# అంతరంగ తరంగాలు

డి.వి.ఎస్. రాజు

**డి.వి.ఎస్. పబ్లికేషన్స్**
నెం.45, రోడ్ నం.6,
ఫిలిం నగర్, జూబ్లీహిల్స్,
హైదరాబాద్ - 500 033


**ప్రథమ ముద్రణ :**
డిసెంబర్ 2004

**డి.టి.పి. డిజైనింగ్ :**
క్రియేటివ్ లింక్స్,
H.No.1-8-705/A/1, 103/C,
బాలాజీ భాగ్యనగర్ అపార్ట్‌మెంట్స్,
నల్లకుంట, హైదరాబాద్-500 044.
ఫోన్ : 55536067.

**వెల :** అమూల్యం

**ముద్రణ :**
కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్
విద్యానగర్,
హైదరాబాద్.

# అంకితం



నాకు జన్మనిచ్చి
నా జీవితానికి స్ఫూర్తినందించిన
జననీ జనకులు, కీర్తిశేషులు
శ్రీ దాట్ల బలరామరాజు
శ్రీమతి సుభద్రాదేవి
గార్లకు
కృతజ్ఞతా పూర్వకంగా

**డి.వి.ఎస్. రాజు**

# మనసులోని మాట

నాకు జన్మతః తల్లి తండ్రుల నుంచి కుటుంబ పెద్దల నుంచి సంస్కారం అబ్బటం నా పూర్వ జన్మ సుకృతం;

సినీ పరిశ్రమలో ప్రవేశించటం; అభిరుచి గల నిర్మాతగా మంచి చిత్రాలను ప్రేక్షకులకు అందించటం; సేవా దృక్పథం గల కుటుంబం నుంచి రావటం వలన సినీ పరిశ్రమకు అనుబంధంగా వున్న పలు సంస్థలలో, వివిధ హోదాల్లో పరిశ్రమ ప్రగతికి సేవలందించే అవకాశం రావటం నా అదృష్టం.

ఇవన్నీ గమనించిన నా కుటుంబ సభ్యులు, శ్రీ వాసిరాజు ప్రకాశం వంటి ఆత్మీయ మిత్రులు నా అనుభవాలను గ్రంథస్తం చేయమని ఎప్పట్నుంచో అడుగుతూ వచ్చారు. చూద్దాం లే... అని వాయిదా వేస్తూ వచ్చాను. అయితే గత సంవత్సరం మూడు నాలుగు సందర్భాలలో నన్ను కలుసుకొన్న సినీచరిత్రకారుడు, జర్నలిస్టు శ్రీ యస్.వి. రామారావు, 'కిన్నెర' నిర్వాహకులు శ్రీ మద్దాళి రఘురామ్ ఆ విషయమై నన్ను వత్తిడి చేసి నా జీవితానుభవాలను పుస్తకరూపంలో భావితరాలకు అందించి తీరాలి అని పట్టుబట్టారు. నేను వివరాలు చెప్పగలను కానీ వ్రాయటం అలవాటు లేదనేసరికి శ్రీ యస్.వి. రామారావు "ఆ బాధ్యత నేను ఆనందంగా మనస్ఫూర్తిగా స్వీకరిస్తాను. మీరు డిక్టేట్ చెయ్యండి – నేను మిగతా పని పూర్తి చేస్తాను" అన్నారు. వారి సహకారానికి నా అభినందనలు.

నా అనుభవాలు గ్రంథస్తం కావటం వల్ల అవి కొందరికైనా స్ఫూర్తినిచ్చే అవకాశం వుందని భావించాను. ఫలితంగా యీ 'అంతరంగ తరంగాలు' రూపు దిద్దుకొంది. ఇది యెవరికి యే మేరకు వుపయోగపడినా అది నాకు ఆనందదాయకమే!

– డి.వి.ఎస్. రాజు

## కృతజ్ఞతలు

నన్ను నిర్మాతగా తీర్చి దిద్దిన
కళామతల్లికి...

నా చిత్రాలను ఆదరించిన
ప్రేక్షకలోకానికి...

అనుక్షణం నన్ను ప్రోత్సహించి
ముందుకు నడిపించిన
కీ॥శే॥ యన్.టి. రామారావు సోదరులకు...

పలు సంస్థలలో నేను కీలకమైన
పదవులు నిర్వహించినపుడు నాకు
తమ సహకారాన్ని అందించిన
ఆత్మీయ మిత్రులకు

నా కృతజ్ఞతాభివందనాలు

**డి.వి.ఎస్. రాజు**

**కుటుంబ నేపథ్యం :**

మా స్వగ్రామం పశ్చిమ గోదావరి జిల్లాలోని కవిటం. అది నిడదవోలు నర్సాపురం కెనాల్ రోడ్‌లో మార్టేరు పాలకొల్లు మధ్య ఉంది. ఎటు చూసినా పచ్చని పొలాలతో నిజంగా భారతదేశానికి ఆంధ్ర రాష్ట్రం అన్నపూర్ణ అన్నపేరును సార్థకం చేస్తున్నదనటానికి ఇటువంటి గ్రామాలే కారణం అని సగర్వంగా చెప్పుకోవచ్చు. మా కుటుంబానికి వ్యవసాయమే ప్రధాన వృత్తి. ఉమ్మడి కుటుంబ వ్యవస్థకు మా కుటుంబాన్నే ఆదర్శంగా చెప్పుకొనేవాళ్ళు. మా తాతగారు దాట్ల కృష్ణంరాజుగారు వారి అన్నగారు సుబ్బరాజుగారు, తమ్ముళ్ళు సీతారామరాజుగారు, నారాయణరాజుగారు, రాఘవరాజుగారు. మా తాతగారిది నిరాడంబర జీవితం. ఆధ్యాత్మిక చింతనతోపాటు స్థితిపరులు కావటం వలన గ్రామంలోని వారికి అవసరమైన సహాయం అందించే పరోపకార స్వభావం ఉండేది. మా తాతగారికి మా తండ్రిగారు బలరామరాజుగారు ఒక్కరే కుమారులు.

మా తండ్రి బలరామరాజుగారు చెప్పిన ప్రకారం మా వంశ పూర్వచరిత్ర వివరాల్లోకి వెళితే...

కొన్ని తరాల క్రిందట గుంటూరు జిల్లా అమరావతి ప్రాంతంలోని చారిత్రాత్మక ప్రసిద్ధి పొందిన ధరణికోట కేంద్రంగా కోట కేతనరాజు పరిపాలిస్తుండేవాడు. ఆయనకు ముందుగా ఒక కుమార్తె, తరువాత చాలా కాలానికి ఒక కుమారుడు జన్మించారు. ఆ కుమార్తెను కాకతీయ సామ్రాజ్య ఏలుబడిలో ఓరుగల్లు రాజకుమారుడికి ఇచ్చి వివాహం చేసారు. ఆ దంపతులకు ఒక కుమార్తె కలుగగా కోట కేతనరాజు తన కుమారుడు కృష్ణంరాజుకు ఆమెను (మనవరాలిని) ఇచ్చి వివాహంచేసి వారికి దాట్ల అనే గ్రామంతోపాటు దాని పరిసర ప్రాంతాల్లో గల కొన్ని గ్రామాలను చేర్చి భరణంగా ఇచ్చారు. ఆ వంశానికి చెందిన వారిలో కొందరు ధరణికోట నుంచి తరలివచ్చి కృష్ణాజిల్లాలోని ముత్యాలంపాడు, తూర్పుగోదావరి జిల్లాలోని



తాతగారు శ్రీ దాట్ల కృష్ణంరాజుగారు, నాయనమ్మ శ్రీమతి సీతాదేవి

అనపర్తి, ద్వారపూడి గ్రామాల్లో స్థిరపడ్డారు. అనపర్తి గ్రామం నుంచి తరువాత కాలంలో మా కుటుంబం వారు కవిటం గ్రామానికి వలస వచ్చారు. ఈ వివరాలు చెపుతూ మా తాతగారు శ్రీ దాట్ల కృష్ణంరాజుగారు అప్పుడప్పుడు నాతో "మన కుటుంబంలో నీది ఏడోతరం" అంటుండేవారు.

భారత భాగవత పఠనం మా తాతగారి దైనందిన కార్యక్రమాల్లో ముఖ్యమైనది. ఉదయం సూర్య నమస్కారాలు, సాయంత్రం సంధ్యావందనం చేసేవారు. వారి పరోపకార బుద్ధి, దైవచింతన మరువలేను. వారి చేసిన పుణ్యఫలమే మా కుటుంబాభివృద్ధికి శ్రీరామ రక్షగా నిలిచిందని నా ప్రగాఢ విశ్వాసం. వారితో పాటు మా నాయనమ్మ సీతమ్మగారు ఆయన ఆదర్శాలకు తగ్గట్టుగా మా కుటుంబాన్ని తీర్చిదిద్దారు.

☆☆☆

మా తండ్రి బలరామరాజుగారు వారి మాతామహుల గ్రామం పెదపుల్లేరులో జన్మించారు. అక్కడ మరియు ఉండి, మార్టేరు గ్రామాల్లో వారి విద్యాభ్యాసం కొనసాగింది. వారికి దేశభక్తి మెండు. స్వాతంత్రోద్యమంలో చురుగ్గా పాల్గొనేవారు. కరాచీ, బొంబాయి కాంగ్రెస్ మహాసభలకు హాజరయి పూజ్య బాపూజీ సందేశం ద్వారా ప్రభావితులైనారు. మాజీ మంత్రి అల్లూరి సత్యనారాయణరాజు గారు వారి సమకాలికులు, మిత్రులు కూడా!

అది **1938** ప్రాంతం. కాలువ పక్కన మా గ్రామం ఉండటంచేత రాకపోకలు సరకులరవాణా అంతా బల్లకట్టు మీదుగా జరిగేవి. ఈ ఇబ్బందిని గమనించిన మా తండ్రిగారు జిల్లా బోర్డువారిని ఒప్పించి ఆ కాలువ మీదుగా ఒక వంతెన నిర్మింపజేసారు. నా చిన్న తనంలో జరిగిన ఆ వంతెన ప్రారంభోత్సవ వేడుక ఇంకా నా కళ్ళలో కదలాడుతుంది. గ్రామ పంచాయితీ బోర్డు అధ్యక్షునిగా మా గ్రామాభివృద్ధికి ఆయన అపారమైన సేవలందించారు. అప్పట్లో టంగుటూరి ప్రకాశం పంతులుగారు ప్రారంభించిన వినియోగ దారుల సహకార సంఘ ఉద్యమ స్ఫూర్తితో గ్రామంలో కన్స్యూమర్ స్టోర్స్

ఏర్పాటు చేసారు. పక్కనే ఉన్న పాలకొల్లులో పండ్ల ఉత్పత్తిదారుల సమాఖ్యను ఏర్పాటు చేయడమే కాక సహకార చక్కెర ఫ్యాక్టరీ ఉండేది. వారు దానిలో ఉపాధ్యక్షులుగా పనిచేసారు. ఆ విధంగా సహకార రంగంలో ఎనలేని సేవలందించిన ప్రముఖ వ్యక్తిగా ఆయన జిల్లాలో ఖ్యాతినొందారు. గ్రామంలో రూరల్ బ్యాంక్ స్థాపించి పరిసర గ్రామాల్లోని రైతాంగానికి ఋణసౌకర్యం అందించటానికి కృషి చేసారు.

ఆయన చేసిన కృషి వల్ల నీలం సంజీవరెడ్డి, కాసు బ్రహ్మానందరెడ్డి వంటి ప్రముఖ రాజకీయ నాయకులతో సాన్నిహిత్యం ఏర్పడింది. ఫలితంగా 1962లో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో నర్సాపురం పార్లమెంటరీ నియోజక వర్గం నుంచి  కాంగ్రెస్ టిక్కెట్టుపై పోటీ చేసి ఆనాటి ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు ఉద్దంరాజు రామంను ఓడించి పార్లమెంటు సభ్యునిగా ఎన్నికయ్యారు.

సంజీవరెడ్డిగారి ప్రోద్భలంతో తిరిగి 1967 ఎన్నికల్లో కూడా ఉద్దంరాజు రామం మీదనే పోటీచేసి గెలుపొందారు.

మా తండ్రి బలరామరాజుగారు బాధ్యతగల ప్రజా ప్రతినిధిగా పార్లమెంటు సమావేశాలకు, కమిటీ సమావేశాలకు క్రమం తప్పకుండా హాజరవుతూ ఇటు ప్రజలకు అటు ప్రభుత్వానికి అందుబాటులో ఉండటానికి తపన పడేవారు. నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి అవిశ్రాంతంగా, నిస్వార్థంగా కృషిచేసిన నిష్కళంక రాజకీయవాది. రాజకీయాలలో ఎంత బిజీగా ఉన్నప్పటికీ బాద్యతగల ఏకైక కుమారునిగా వారి తల్లిదండ్రుల యోగక్షేమాలను నిరంతరం చూస్తుండేవారు. పెద్దలపట్ల ఆయన చూపిన శ్రద్ధాసక్తులు మరువలేనివి. అవి నన్ను ఎంతగానో ప్రభావితం చేసాయి.

ఆయన 1963 ప్రాంతంలో రాజమండ్రిలో అప్పడే రూపు దిద్దుకుంటున్న ప్రకాశ్ నగర్‌లో నివాసం ఏర్పరుచుకున్నారు. వారు అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించిన ప్రకాశ్‌నగర్ హౌస్ బిల్డింగ్ సొసైటి పెద్ద

వ్యవస్థగా మారింది. అక్కడే ప్రకాశంగారి పేరిట ఒక ప్రాథమిక పాఠశాలను, హైస్కూలును, జూనియర్ కాలేజీని ఏర్పాటు చేసారు. దాంతో ఆ ప్రాంత ప్రజల విద్యావసరాలు తీరాయి.

ఆ రోజుల్లో ప్రభుత్వం వద్దనుంచి ఉపాధ్యాయుల జీతాలకు తొందరగా గ్రాంటు వచ్చేది కాదు. మా తండ్రిగారు అప్పటిదాకా ఆగకుండా వారి ఉపాధ్యాయుల ఆర్థిక అవసరాలకు తగు సహాయం చేసేవారు. రిటైరు అయిన వారి సౌకర్యార్థం కమ్యూనిటీ హాలు నిర్మించి అక్కడ ప్రముఖులచేత పురాణపఠనం, కావ్యగానం వంటి పలు కార్యక్రమాలు ఏర్పాటు చేసేవారు.


ఆయన్ని చిరస్మరణీయుణ్ణి చేసిన సంఘటన ఒకటి నేను మర్చి పోలేను. ప్రకాశ్‌నగర్ ప్రజల చిరకాల వాంఛను నిజంచేస్తూ వారు స్వయంగా వెంకటేశ్వర దేవాలయం నిర్మించగా, శృంగేరి పీఠాధిపతులు విగ్రహ ప్రతిష్ఠ చేసారు. ఈనాడు రాజమండ్రిలో ప్రసిద్ధిపొందిన దేవాలయాల్లో అది ఒకటి. ప్రస్తుతం ఆ ఆలయ నిర్వహణబాధ్యత మా సోదరుడు బుచ్చి వెంకటపతిరాజు నిర్వహిస్తున్నారు. దైవకృప వల్ల ఆ విధంగా కూడా మా కుటుంబానికి రాజమండ్రి పట్టణంలో గౌరవ ప్రదమైన గుర్తింపు వచ్చింది.

ప్రకాశ్‌నగర్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి మా తండ్రిగారి తరువాత అధ్యక్షునిగా మా సోదరుడు ఈనాటికీ కొనసాగుతూ ఎంతో సేవలందిస్తూ మా తండ్రిగారి పేరును నిలబెడుతున్నారు. ఈ రోజున రాష్ట్రంలో ఉన్న అన్ని హౌసింగ్ సొసైటీలతో పోల్చినపుడు పలు సౌకర్యాలు ఉన్న ఏకైక హౌసింగ్ సొసైటీగా అది పేరొందింది.

డాక్టర్ కల్నల్ రాజుగారితో కలిసి మాతండ్రిగారు రాజమండ్రి వద్ద గోదావరి నదిపై రోడ్డు రైలు బ్రిడ్జి మంజూరు కావటానికి విశేష కృషిచేసి సాధించటమేకాక వారికి ఆప్తులైన నాటి రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి గారిచే ఆ బ్రిడ్జి ప్రారంభోత్సవం చేయించటం మరువలేని ఒక మధురానుభూతి. కాకినాడలో రంగరాయ మెడికల్ కాలేజీని ఏర్పాటు చేయటంలో మా



ముందు మేనమామ, తరువాత మామ అయిన
శ్రీ వెంకట కృష్ణంరాజుగారు వారి శ్రీమతి రంగాయమ్మగారు



చిన మేనమామ శ్రీ రామభద్రరాజుగారు, మేనత్త శ్రీ భద్రమ్మగారు

తం్రడిగారు కృషి చేయడమే కాక కొంతకాలం మెడికల్ కాలేజి గవర్నింగ్ బాడీకి ఉపాధ్యక్షులుగా పనిచేసారు.

ఆ విధంగా మా తం్రడిగారు నిరంతరం నిస్వార్థ ప్రజాసేవకునిగా ఉభయగోదావరి జిల్లాల ప్రజల అభిమానానికి పాత్రులయ్యారు.

☆☆☆

**నా బాల్య జీవితం :**

తూర్పుగోదావరి జిల్లా కోనసీమలోని అల్లవరం గ్రామంలో **13-12-1928** తేదీన మా మాతా మహుల ఇంట నాజననం. మా తాతగారు నడింపల్లి బుచ్చి వెంకటపతిరాజు గారు ఆ గ్రామంలోనే కాక పరిసర ప్రాంతాలలో మంచి పలుకుబడి గల వ్యక్తి. వారికి ఇద్దరు కుమారులు ఒక కుమార్తె (మా తల్లి సుభద్రాయమ్మగారు) ఏకైక కుమార్తె కావటంతో మా అమ్మగారంటే ఆయనకు ఎంతో అభిమానం. ఆ ఇంట మనవడిగా మొదటగా పుట్టిన వాణ్ని నేనే కావటంచేత మా తాతగారు, అమ్మమ్మ చంద్రమ్మ గారు ఇతర కుటుంబ సభ్యులు నన్ను ఎంతో గారాబంతో, వాత్సల్యంతో చూసుకొనేవారు. మా తాతగారి ఒడిలోనే నేను పెరిగానంటే అతిశయోక్తి కాదు. పరిసర గ్రామాల నుంచి ఆయన వద్దకు సలహాల కోసం ఎందరో పెద్దలు వస్తుండేవారు. అప్పటి వారి సంభాషణలు, లౌకిక వ్యవహారం చూసిన నేను వారి మూలంగా ఎంతగానో ప్రభావితుణ్ణయ్యాను. అప్పుడప్పుడు కవిటం వెళుతున్నప్పటికీ నాబాల్యం ఎక్కువగా అల్లవరంలోనే గడిచిపోయింది. అయిదో తరగతి వరకు అక్కడ ప్రాథమిక పాఠశాలలోనూ, తరువాత థర్డు ఫారం వరకు అక్కడకు దగ్గరలో **ఉన్న** పేరూరు గ్రామంలోనూ విద్యాభ్యాసం కొనసాగింది.

అవి స్వాతంత్ర్య పోరాటం జరుగుతున్న రోజులు. క్విట్ ఇండియా మూవ్‌మెంట్, విదేశీ వస్తు బహిష్కరణఉద్యమం ముమ్మరంగా సాగుతోంది.



సహధర్మచారిణి శ్రీమతి అనసూయదేవితో



వరుసకు నాకు చినతాతగారు అయిన నడింపల్లి సుబ్బరాజుగారు (కొడూరుపాడు వాస్తవ్యులు) ఆనాటి ప్రముఖులైన కళావెంకట్రావు, మల్లిపూడి పళ్ళంరాజు వంటి పెద్దలతో కలిసి స్వాతంత్ర్య సమర యోధునిగా పలు ఉద్యమాలకు నాయకత్వం వహించేవారు. చిన్న వయసులో అవన్నీ ప్రత్యక్షంగా చూడటం వల్ల వాటి ప్రభావం నా మీద ఎంతగానో పనిచేసింది. స్కూలు విద్యార్థిగా ముందుండి ఇతర విద్యార్థులకు నాయకత్వం వహించేవాణ్ణి. అంతకు ముందు మంత్రి అనే మాట వినటమే తప్ప ఎవ్వరినీ చూసి ఎరుగను అటువంటిది తొలిసారిగా నాటి మంత్రివర్యులు బెజవాడ గోపాలరెడ్డి గారిని విద్యార్థి దశలో స్వయంగా చూసి పులకించి పోయాను. చిన్న వయస్సులోనే మంత్రి అయిన బెజవాడ గోపాలరెడ్డి గారిది చూడగానే అందర్నీ ఆకర్షించే స్ఫురద్రూపం, ఆజానుభాహు విగ్రహం. నా ఊహల్లో ఉన్న మంత్రిని ప్రత్యక్షంగా చూడటం ఓ మధురానుభూతి. గోదావరి గలగలలు, పచ్చని పంటపొలాలు, అంబరాన్ని తాకే కొబ్బరి తోటలు, అరటితోటలు వెరసి కోనసీమ ప్రకృతివొడిలో నా బాల్యం గడిచిపోయింది. అందుకే కోనసీమ పేరు వింటే చాలు ఎన్నో మధురస్మృతులు గుర్తుకు వస్తాయి. నాకు ఇద్దరు మేమనామలు పెద్దాయన వెంకటకృష్ణంరాజుగారు ధాన్యం, రైసు మిల్లు వ్యాపారం చేసేవారు. రెండవ ఆయున రామభద్రరాజు గారికి వ్యవసాయమంటే ప్రాణం. క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇచ్చే మా పెద్ద మేనమామ అంటే నాకు కాదు ఆ చుట్టు పక్కల వారందరికీ ఎంతో భయం, భక్తి, అభిమానం, ఆయన కుమార్తె అనసూయ అంటే మా తాతగారికి వల్లమాలిన అభిమానం. వయసులో ఆమె నాకంటే మూడేళ్ళు చిన్న. నాతో పాటు ఆమెను కూడా మా తాతగారు ఎంతో గారాబంగా చూసుకునేవారు. అలాగే మా మేనత్తలు ఇద్దరూ, ఇతర కుటుంబ సభ్యులు మమ్మల్ని అభిమానించేవారు. నాకు ఊహ తెలిసిన తరువాత మా బంధువర్గంలో కొందరు నన్ను "ఏమయ్యా అత్రి మహర్షి" అని సంభోదిస్తుండేవారు. పురాణపాత్రల పరిచయం లేని నాకు అలా ఎందుకన్నారో అప్పట్లో అర్థం

కాలేదు. కాని 1948లో మా ఇద్దరికి వివాహం జరిగాక అర్థమయింది. (అనసూయ భర్త అత్రి మహర్షి కదా)

☆☆☆

అల్లవరంలో విద్యార్థి దశలో ఉండగానే మా తాతగారు సురభి కంపెనీ వారు ప్రదర్శించే 'మాయాబజార్' వంటి నాటకాలకు నన్ను వెంటపెట్టుకొని తీసుకెళ్ళేవారు. అప్పటినుంచి నాకు నాటకాలంటే ముఖ్యంగా పద్య నాటకాలంటే అభిమానం ఏర్పడింది. అప్పుడప్పుడు సినిమాలు చూసినా మనసు ఎక్కువగా నాటకాలవైపే లాగేది. ఈ స్ఫూర్తితోనే మార్టేరులో నా హైస్కూలు విద్యాభ్యాసం జరుగుతున్న రోజుల్లో ఆ చుట్టుపక్కల గ్రామాల్లో ఎక్కడ నాటక ప్రదర్శన జరిగినా హాజరయ్యేవాణ్ణి. ఆ అభిరుచితో నాటక రంగానికి చెందిన ప్రముఖులు బందా, షణ్ముఖి, పీసపాటి, అబ్బూరి, మాధవపెద్ది, పులిపాటి, కొచ్చర్లకోట, గండికోట జోగినాథం, బెల్లంకొండ సుబ్బారావు (మీసాల కృష్ణుడు), అద్దంకి శ్రీరామ మూర్తి, ఈలపాట రఘురామయ్య, కొచ్చర్లకోట సత్యనారాయణ, సూరవరపు వెంకటేశ్వర్లు వీరందరి నాటకాలు చూసేవాణ్ణి. వేదాంత కవి వ్రాసిన తెలుగు తల్లి, ఆశాజ్యోతి సాంఘిక నాటకాలు విపరీతంగా ప్రదర్శించేవారు. వాటిల్లో అక్కినేని నాగేశ్వరరావు స్త్రీ పాత్రలు ధరించేవారు. ఆ నాటకాల్లో సూరపనేని ప్రభాకరరావు అనే నటుడు పద్యాన్ని ఎంతో అందంగా, అర్థవంతంగా, ఆహ్లాదకరంగా, మధురంగా పాడేవారు. వారి గాత్ర మాధుర్యానికి నేను పరవశుణ్ణయ్యాను. పద్య నాటకాల పట్ల నాలో ఆనాడు బీజం వేసుకొన్న అభిమానం నా జీవితంలో పెరుగుతూ వచ్చింది. ఇప్పుడు ప్రభుత్వ పరంగా జరిగే నంది నాటకోత్సవాల్లో పద్యనాటకాలకు పెద్ద పీట వేయటం నిజంగా నాకు ఎంతో ఆనందం కలుగజేసింది.

☆☆☆

థర్డు ఫారం పూర్తయ్యే నాటికి మాతాతగారు పరమపదించారు. పేరూరులో థర్డు ఫారం వరకే ఉంది. ఇహ అప్పుడు స్వగ్రామం కవిటంకు రాక తప్పలేదు. అల్లవరం గ్రామాన్ని నా బాల్య స్నేహితుల్ని, ఆ ప్రకృతిని, అన్నింటికంటే మిన్నగా నన్ను ఎంతో ప్రేమగా చూసుకొన్న మా అమ్మమ్మ చంద్రమ్మగారిని, మేనమామల్ని, మేనత్తల్ని విడిచిపెట్టడం ఏదో వెలితిగా అనిపించింది.

కవిటంకు సుమారు 2 మైళ్ళ దూరంలో ఉన్న మార్టేరులో నా హైస్కూలు విద్య ప్రారంభమయింది. విద్యార్థుల్ని సమీకరించి విద్యార్థి కాంగ్రెస్ సంస్థలో చేరి స్వాతంత్ర్య పోరాట భావాలతో కృషి చేస్తుండేవాడిని. 1946-1947 ప్రాంతంలో టంగుటూరి ప్రకాశం పంతులుగారి సమక్షంలో పశ్చిమగోదావరి జిల్లా విద్యార్థి కాంగ్రెసు సంఘం కార్యదర్శిగా ఎన్ని కావటం నా జీవితంలో మరువలేని సంఘటన.

హైస్కూలు జీవితంలో జరిగిన మరో సంఘటన నా జీవితాన్ని మలుపు తిప్పింది అది -

మేము చదువుకునే హైస్కూలుకు హెడ్‌మాస్టర్ బి.వి. నారాయణగారు. ఆయన ఆజానుబాహుడు. ఆయనపట్ల విద్యార్థులకు భక్తికంటే భయం ఎక్కువ. మా తండ్రిగారు కూడా ఆయన దగ్గర చదువుకున్నారు. గాంధిగారి మరణంతో (30.1.1948) దేశంలో ప్రతి ఒక్కరు కుటుంబ పెద్దని పోగొట్టుకున్నంతగా విలపించారు. ఆ సందర్భంగా నేను కొందరి మిత్రులతో కలిసి తణుకు వెళ్ళి గాంధిగారి చిత్రపటాల్ని కొని వాటిని మా స్కూలులో ప్రతిక్లాసు రూంలోనూ అలంకరించాను. ఆ విధంగా ఆయన్ని మేమంతా స్మరించుకోవాలని మా ఉద్దేశ్యం. మరునాడు హెడ్మాస్టరు పాఠాలు చెప్పటానికి వచ్చి ఆ ఫొటోలు చూసి అక్కడ ఎవరు పెట్టారని గద్దించారు. భయంతో అందరూ మౌనంగా ఉండిపోయారు. నేను లేచి ధైర్యంగా నిలబడ్డాను. "ఎవరి అనుమతితో ఈ పని చేసావు" అని

ప్రశ్నించారు. "దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహనీయుని చిత్రపటాన్ని క్లాస్‌రూంలో ఉంచి నిత్యం స్మరించుకోవటం విద్యార్థులుగా మా కనీస ధర్మం'' అని ధైర్యంగా జవాబు చెప్పాను. దాంతో ఆయన ఆగ్రహోద్రోగుడై అటెండరును పిలిచి అన్ని క్లాసుల్లో ఉన్న ఫోటోల్ని తీయించేశాడు. దీనికి కారణం ఆయన పర్మిషన్ లేకుండా మేం చేసిన పని క్రమశిక్షణా రాహిత్యం అని ఆయన భావించడమే! హెడ్మాస్టారు చేసిన పనికి విద్యార్థుల్లో నిరసన వ్యక్తం కావడమే కాక అందరూ ఏకమై మీటింగు పెట్టి సమ్మె ప్రారంభించాము. విదార్థులనుంచి ఆ విధమైన వ్యతిరేకత వస్తుందని ఆయన ఊహించలేదు. వెంటనే నా మీద మా తండ్రి గారికి ఫిర్యాదుచేద్దామని జట్కా బండిలో మా ఊరు వెళ్ళారు. అయితే ఆయన ఊళ్లో లేకపోవటంతో తిరిగి వచ్చేసారు. మార్టేరు గ్రామ పెద్దలు కలుగజేసుకొని ఆయనకు నాకు, నాతోటి విద్యార్థులకు నచ్చజెప్పి సమ్మె విరమింపజేసారు. ఫలితంగా గాంధిగారి పటాలు యథాప్రకారం గోడలపై దర్శనమిచ్చాయి. ఈ సంఘటన జిల్లా స్థాయిలో విద్యార్థి సంఘాల్లో చర్చనీయాంశమయింది. మార్టేరులో మేము సమావేశాలు నిర్వహించిన విద్యార్థి కాంగ్రెస్ కార్యాలయంలోనే జిల్లా, తాలూకా స్థాయి కాంగ్రెస్ సమావేశాలు జరగటం వో విశేషం. హైస్కూలు జీవితంలో ప్రభాకరదేవర, బాపిరాజు శర్మ వంటి మిత్రులు నాకు అండగా నిలిచారు. ఆ విధంగా విద్యార్థి దశలోనే పలువురు నాయకులతో పరిచయాలు ఏర్పడటమే కాక నిస్వార్థ నాయకుల పట్ల, దేశ రాజకీయాల పట్ల నాలో అభిమానం పెరుగుతూ వచ్చింది.

☆☆☆

**కాలేజీ జీవితం :**

నన్ను డాక్టరుగా చూడాలన్నది మా తండ్రిగారి కోరిక. ఆ ప్రయత్నంలో నన్ను మద్రాస్ కీల్‌పాక్‌లోని 'ఇండియన్ మెడికల్ కాలేజీ'లో చేర్పించారు. అయితే నెలరోజుల్లోనే నా ఆరోగ్యంలో మార్పు రావటం వలన


ఆ చదువుకు స్వస్తి చెప్పి స్వగ్రామం వచ్చాను. తరువాత కాకినాడ పి.ఆర్. కళాశాలలో ఇంటర్‌లో జాయిన్ అయ్యాను.

అప్పట్లో ఉన్న తూర్పుగోదావరి జిల్లా విద్యార్థి కాంగ్రెస్ అంత చురుకుగా పనిచేసేది కాదు. స్వతహాగా సమకాలీన రాజకీయాల పట్ల అవగాహన ఉన్న నేను కొంతమంది మిత్రులను సమీకరించి టౌను ప్రెసిడెంటుగా బాధ్యతలు స్వీకరించటంతో దాని రూపురేఖలు మారిపోయాయి. నాటి నాయకుల్లో ఆచార్య రంగాగారిని అభిమానించాను. ప్రకాశంగారిలోని ధైర్యం, చొరవకు ఆకర్షించ బడ్డాను.

ఇక్కడ ఒక సంఘటన ముచ్చటించాలి. ఉమ్మడి మద్రాసు రాష్ట్రం ఉన్న రోజుల్లో ఒకసారి అవిశ్వాస తీర్మానం ఫలితంగా ప్రకాశంగారు పదవీచ్యుతులైనారు. దాంతో ప్రజల్లో ఆగ్రహం వెల్లువలా ఉప్పొంగింది. అప్పుడు ఆయన ప్రజల్లోకి వచ్చి వాడ వాడలా మీటింగులు పెట్టారు. రాజమండ్రిలో జరిగిన మీటింగుకు మార్టేరు నుంచి స్నేహితులను తీసుకొని వెళ్ళాను. ఆ మీటింగు సుబ్రమణ్యం మైదానంలో జరిగింది. అలసిపోయిన ఆయన గొంతులోంచి మాటలు సరిగ్గా రాలేకపోయినా సొంజ్ఞల ద్వారా ఆయన భావం చెప్పగా దానిని నరసింహదేవర సత్యనారాయణగారు పెద్ద గొంతుతో ప్రజలకు వివరించారు. అది విన్న ప్రజలు ఆవేశంతో ఉగ్రరూతలూగారు. దాని ప్రభావ తీవ్రత ఎంతటిదంటే కొన్ని నెలలపాటు ప్రకాశంగారి పరాజయానికి కారకులైన నాయకులు ఆంధ్రలో అడుగుపెట్టడానికి జడిసేవారు.

⋆⋆⋆

సరిగ్గా అటువంటి మరొక సంఘటన నేను చూసాను. **1984** ఆగస్టులో నాటి ముఖ్యమంత్రి యన్.టి. రామారావు గారిని పదవిలోంచి దింపినప్పుడు ఆ తరహా ఆగ్రహరూపంలో వెల్లువ ప్రజల్లో కనిపించింది.



కాకినాడ, పి.ఆర్. కాలేజి విద్యార్థిగా శ్రీ డి.వి.ఎస్. రాజు

గన్నవరం విమానాశ్రయంలో ఆయనదిగి విజయవాడలో ప్రజలనుద్దేశించి ప్రసంగించాల్సి వచ్చినప్పుడు దారి పొడుగునా సుమారు **25** కిలోమీటర్లు అంటే విజయవాడ దాకా రహదారి అంతా జనసముద్రంలో నిండిపోయింది. ఇదే తరహా నిరసనలు ఆంధ్రప్రదేశ్ అంతటా ప్రతిధ్వనించాయి. అంతేకాదు పొరుగు రాష్ట్రమయిన మదరాసు మెరీనా బీచ్‌లో కరుణానిధి అధ్యక్షతన ఏర్పాటుచేసిన సభలో కూడా కనివినీ ఎరుగని విధంగా ప్రజావెల్లువ, వారి నిరసన ధ్వనులు మిన్నుముట్టాయి.

☆☆☆

నా జీవితంలో మరపురాని ప్రకరణం కాకినాడలోని కాలేజీ విద్యార్థి జీవితం. ఆ రోజుల్లో అంటే **1949**లో పెద్ద తుఫాను వచ్చినప్పుడు విద్యార్థి కాంగ్రెస్ తరపున బట్టలు, వస్తువులు సేకరించి తుఫాను బాధితులకు అందజేశాము. ఆనాటి నా మిత్రులు కాశీచైనుల కృష్ణమూర్తిగారు, వి. లక్ష్మణస్వామి గారు, నాకు ఎప్పుడూ చేదోడుగా ఉండేవారు. నాటకాలు, రాజకీయాలు, విద్యార్థి సంఘ కార్యకలాపాలు - వీటిలో నేను చదువుపట్ల తగిన శ్రద్ధ చూపలేకపోయాను.

ఈ పరిస్థితి గమనించిన నా తండ్రిగారు నా భవిష్యత్తు గూర్చి ప్రస్తావిస్తూ నేను ఏవిధంగా స్థిరపడదలచుకున్నది తెలుపమన్నారు. వ్యాపారం చేస్తే బాగుంటుందేమోనని సూచనగా చెప్పేను. మా గ్రామంలో ప్రముఖ వ్యక్తి వ్యాపార వేత్త శ్రీ కర్రి నర్సిరెడ్డిగారు. వారు మాతండ్రి గారికి సన్నిహితులు నా అభిప్రాయం వారితో చెప్పి వారి సలహా కోరారు. నర్సిరెడ్డిగారికి బస్సులు ఉండేవి. దాంతోపాటు విజయవాడలోనూ, మద్రాసులోనూ సినీ లితో వర్క్స్ అనే వ్యాపార సంస్థను నడుపుతుండేవారు. సరిగ్గా ఆ సమయంలో మదరాసులోని సినీ లితో వర్క్సులో ఆయన భాగస్థులు విడిపోయారు. దాంతో ఆ ప్రెస్సును మద్రాసు నుంచి విజయవాడకు షిఫ్ట్ చేద్దామనే ఉద్దేశ్యంతో ఉన్న రెడ్డిగారు వ్యాపారంపట్ల నా ఆశక్తిని గమనించి మా

తండ్రిగారితో "మీ అబ్బాయికి అంగీకారం అయితే ఆ ప్రెస్సును అభివృద్ధి చేసుకోమనండి. నేను కూడా భాగస్థునిగా ఉంటాను" అని సూచించారు. ఆ సలహా మంచిదిగా తోచటంతో నేను వెంటనే అంగీకరించాను.

☆☆☆

**మరోమలుపు :**

లితో ప్రెస్సు వ్యాపార నిమిత్తమై 1950 డిసెంబరులో మద్రాసు వెళ్ళాను అది నాజీవితంలో ముఖ్యమైన మరో మలుపుకు దారి తీసింది. ఆ రోజుల్లో మద్రాసులో సినిమా పబ్లిసిటీ పోస్టర్లను ముద్రించే ప్రెస్సులు బహుకొద్దిగా ఉండేవి. నేను ఆ ప్రెస్సు బాధ్యతలు చేపట్టాక దానిని ఆధునీకరించటం కోసం ఫోటో ఆఫ్‌సెట్ మిషన్ తెప్పించాను. ఫలితంగా వ్యాపారంలో గణనీయమైన అభివృద్ధి చూసాను. సినిమా పోస్టర్ల ముద్రణకు సంబంధించిన వ్యాపారం కావటంతో ఎన్నో సినిమా కంపెనీలతోనూ, ఎందరో సినీ ప్రముఖులతోనూ పరిచయాలు ఏర్పడ్డాయి. హార్బర్ ప్రాంతంలో ఉండే ఆ ప్రెస్సును మౌంట్ రోడ్డు గల 'శుభోదయా బిల్డింగ్స్' (ఇప్పటి కె.సి.పి. బిల్డింగ్స్)లోకి మార్చాము. ఆ బిల్డింగ్‌కు రాజకీయ, చారిత్రాత్మక ప్రాధాన్యత చాలా ఉంది. అక్కడ నుంచే ప్రకాశం పంతులుగారు, బలుసు సాంబమూర్తిగారు, ప్రజాపత్రిక, మరికొన్ని పత్రికలు నడిపేవారు. ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర ఉద్యమానికి సంబంధించిన చర్చలు జరిగేవి. ఎందరో రాజకీయ నాయకులు వస్తూండేవారు. మైలాపూరులోని బులుసు సాంబమూర్తి గారింట్లో పొట్టి శ్రీరాములుగారు ప్రత్యేక రాష్ట్రం కోసం నిరాహార దీక్ష ప్రారంభించగా ఆయనకు మద్దతుగా శ్రీ స్వామి సీతారాం గారు మా బిల్డింగ్‌లోని మరో అంతస్థులో నిరాహారదీక్ష ప్రారంభించారు. నేను ప్రతిరోజూ నిరాహార దీక్ష శిబిరానికి వెళ్ళి శ్రీరాములు గారిని చూస్తుండేవాడిని. ఆయన ఆరోగ్యాన్ని డాక్టర్ కస్తూరి నారాయణమూర్తిగారు పరీక్షించేవారు. మా కుటుంబానికి కూడా వారే డాక్టర్. వారు శ్రీరాములుగారి ఆరోగ్య పరిస్థితిని


గూర్చి మాకు ఎప్పటికప్పుడు చెపుతుండేవారు. ఇక్కడ టంగుటూరి ప్రకాశం గారి గూర్చి కొద్దిగా ముచ్చటించాలి. నేను ఆయన్ను ఎంతగానో అభిమానించే వాణ్ణి. నాకు వరసకు మేనమామ గారైన నడింపల్లి రామభద్రరాజుగారు యం.యల్.ఏగా ఉండేవారు. వారు ప్రకాశం పంతులుగారికి ఎంతో ఆప్తులు వారితోపాటు అప్పుడప్పుడు ప్రకాశం గారిని కలుస్తుండేవాడిని. అప్పట్లో జరిగిన ఎన్నికల్లో ఎందరో హితవు చెప్పినా వినకుండా మొండి ధైర్యంతో ఆయన హార్బరు నియోజకవర్గం నుంచి ప్రజాపార్టీ టికెట్టుపై పోటి చేసి యు. కృష్ణారావు చేతిలో ఓటమి చవిచూసారు. ప్రకాశంగారి కోసం ఇంటింటికి తిరిగి మాలాంటి అభిమానులు ప్రచారం చేసినా ప్రయోజనం లేకపోయింది. ఆ ఓటమిని ప్రకాశంగారు చిరునవ్వుతో స్వీకరించారు.

☆☆☆

**సినీ లితో ప్రింటింగ్ ప్రెస్సు బాధ్యతలు :**

ఏ శుభముహూర్తంలో చేపట్టానోగాని దాని ఫలితం నా జీవిత పథాన్నే మార్చివేసింది. మా ప్రెస్సులో దక్షిణాది తెలుగు, తమిళ, కన్నడ, మళయాళ చిత్రాల తాలూకు పబ్లిసిటీ మాత్రమే కాకుండా అప్పట్లో మద్రాసులో నిర్మితమైన కొన్ని హిందీ చిత్రాల తాలూకు పబ్లిసిటీ మెటీరియల్ కూడా మా ప్రెస్సులోనే తయారయ్యేవి. వివరంగా చెప్పాలంటే తెలుగులో ఆనాటి ప్రముఖ సంస్థలు వాహిని, రోహిణి, శోభనాచల, అంజలి పిక్చర్స్, సారధి, నేషనల్ ఆర్ట్స్, వినోదా, భరణి, తమిళంలో ఎ.వి.యం, మోడరన్ థియేటర్స్, పక్షిరాజా, జూపిటర్, ఎన్.ఎస్.కృష్ణన్ కంపెనీ ఎ.ఎల్.ఎస్., కన్నడంలో బి.ఆర్. పంతులు, ఆర్. నాగేంద్రరావు, కేరళలోని ఎక్స్.ఎల్. ప్రొడక్షన్స్, టి. వాసుదేవన్, మెర్రీలాండ్ స్టూడియో సుబ్రహ్మణ్యం, ప్రముఖ పంపిణీదారులు కోషి వీరందరితో మాకు వ్యాపార పరంగా సత్సంబంధాలు ఏర్పడ్డాయి. ఆ పరిచయాలు, స్నేహం నా భవిష్యత్తుకు ఎంతగానో ఉపకరించాయి.

☆☆☆



శ్రీ యన్.టి. రామారావు, శ్రీ త్రివిక్రమరావు సోదరులతో

**ఎన్.టి.ఆర్. పరిచయం :**

1952లో శ్రీ ఎన్.టి. రామారావుగారి ఆధ్వర్యంలో వారి సోదరుడు శ్రీ త్రివిక్రమరావు మేనేజింగ్ పార్టనర్‌గా, గోకుల్ కృష్ణమూర్తి పార్టనర్‌గా తాతినేని ప్రకాశరావుగారి దర్శకత్వంలో 'పిచ్చి పుల్లయ్య' అనే చిత్రాన్ని నిర్మించారు. దానికి టి.వి.రాజు సంగీత దర్శకుడు. శ్రీ టి.వి.రాజు గారితో నాకు అంతకుముందే పరిచయం ఉంది. వారు ఒకరోజున నన్ను శ్రీ రామారావుగారు స్టూడియోలో ఉండగా తీసుకెళ్ళి పరిచయం చేసారు. వారిద్దరూ మంచి మిత్రులు. మద్రాసు వచ్చిన తొలిరోజుల్లో ఒకే రూములో ఉండేవారు.

ప్రథమ పరిచయంతోనే రామారావుగారు నేను పరస్పరం ఆకర్షితుల మయ్యాము. ఏ శుభ ముహూర్తంలో మేము కలుసుకున్నామో, ఆ వేళా విశేషం ఏమిటో తెలియదు గాని ఆ ఆత్మీయత, అనుబంధం వారు కీర్తిశేషులయ్యేదాకా మా ఇద్దరి మధ్య కొనసాగింది. నేటికీ ఒక ఆత్మీయునిగా, శ్రేయోభిలాషిగా, మార్గదర్శకునిగా ఆయనంటే నాకు ఎంతో గౌరవం.

మేము కలిసిన మొదటిరోజున పరిచయాలు అయ్యాక వారి "పిచ్చి పుల్లయ్య" చిత్రం తాలూకు పోస్టర్ పబ్లిసిటీ మా ప్రెస్సులో ప్రింట్ చేయటానికి అంగీకారం కుదిరింది. మేము కూడా వారి సంతృప్తి మేరకు పోస్టర్లు ప్రింట్ చేసి సకాలంలో అందజేశాము. అప్పట్లో సినిమా పోస్టర్లు అందంగా డిజైను చేయటంలో టి.వి.యస్.శర్మ, కె.నాగేశ్వరరావు, ఎ.కె.శేఖర్ సిద్ధహస్తులు. ఎస్.ఎం.కేతా, కె. రాందాస్ తరువాత ప్రవేశించారు.

☆☆☆

యన్.టి.ఆర్. సోదరులను నేను తరచుగా కలుసుకొనేవాణ్ణి. వారు ఉభయులు నాపట్ల ప్రత్యేక వాత్సల్యం చూపించేవారు. నేను చెప్పిన మాటల్ని క్రమశిక్షణతో చేతల్లో చూపించటం ఇందుకు కారణం అయి ఉండవచ్చు. "పిచ్చిపుల్లయ్య" నిర్మాణసమయంలోనే ఆ చిత్ర నిర్మాణవ్యవహారాలు చూసే

శ్రీ అట్లూరి పుండరీకాక్షయ్యగారు, నటులు శ్రీ గుమ్మడి వెంకటేశ్వరరావు గారితోనూ పరిచయం అయింది. అది నెమ్మదిగా ఆత్మీయపరమైన స్నేహంగా మారి ఈ నాటికీ కొనసాగుతోంది.

'పిచ్చిపుల్లయ్య' విడుదల సందర్భంగా ప్రేక్షకుల అభిప్రాయం తెలుసుకొనేందుకు రామారావుగారి కారులో కొంత మంది, నా కారులో కొంత మంది కలిసి నెల్లూరు వెళ్ళాము. అప్పట్లో చాలా మంది సినిమా వారికి రిలీజ్ కాగానే టాక్ కోసం నెల్లూరు వెళ్ళటం పరిపాటి. చిత్రం ఆర్థికంగా ఫరవాలేదని పించినా రామారావుగారి నటనకు ప్రేక్షకుల ఆదరాభిమానాలు లభించాయి. అది కొంతలో కొంత తృప్తిని మిగిల్చింది.

☆☆☆

అప్పట్లో నేను మద్రాసులో టి.నగర్‌లోనే సారంగపాణి వీధిలో వుండేవాడిని. ఒకరోజు రాత్రి "ఖాళీగా ఉంటే అన్నయ్య మిమ్మల్ని వెంటనే రమ్మన్నారు" అంటూ త్రివిక్రమరావుగారి నుంచి ఫోను వచ్చింది. వెంటనే బజుల్లా రోడ్డులోని వారింటికి వెళ్ళాను. మేము ముగ్గురమూ (నేను, యన్.టి.ఆర్. త్రివిక్రమరావు) కొద్దిసేపు పిచ్చాపాటి కబుర్లు చెప్పుకున్నాక శ్రీ రామారావుగారు కొద్దిపాటి గంభీరంతో వారి మనసులోని మాటను ఇలా వివరించారు.

"రాజు గారు! మీతో ఒక విషయం మాట్లాడటానికి రమ్మన్నాను. నేను కాలేజి విద్యార్థిగా ఉన్నప్పుడు "నేషనల్ ఆర్ట్ థియేటర్స్" అనే సంస్థ పేరిట నాటకాలు ప్రదర్శించేవాడిని. అందులో నాతోపాటు, జగ్గయ్య, పుండరీకాక్షయ్య కూడా నటించేవారు. ఇంతకు ముందు "పిచ్చిపుల్లయ్య" "నేషనల్ ఆర్ట్స్" పతాకంపై తీశాము. ఇప్పుడు మా నాటక సంస్థ "నేషనల్ ఆర్ట్ థియేటర్" పేరు మీద సినిమాలు తమ్ముడు త్రివిక్రమరావు సారథ్యంలో తీయాలను కొంటున్నాము. అయితే అందులో చాలామంది మిత్రులు

భాగస్థులుగా చేరటానికి ముందుకు వచ్చారు. మా సోదరులకు వ్యక్తులు, వ్యక్తిత్వం ప్రధానం. డబ్బుకాదు. మీ వ్యక్తిత్వం, నిజాయితీ మాకు బాగా నచ్చాయి. కాబట్టి మీరు మా సంస్థలో భాగస్తులుగా చేరి తమ్ముడికి అండగా ఉంటే సంతోషిస్తాము.'' అన్నారు.

నేను చిత్రపరిశ్రమకు అనుబంధంగా ఉండే వ్యాపార సంస్థ నడుపుతున్నప్పటికీ నిర్మాణరంగాల్లో అడుగు పెట్టాలనే ఆలోచన అంతవరకు నాకు కలగలేదు. మాకు ఉన్న కొద్దిపాటి పరిచయంతో నా పట్ల అభిమానాన్ని చూపి వారి స్నేహ హస్తాన్ని అందించటం నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది. వెంటనే "మీరు అటువంటి సదవకాశం కలిపించటమే నా అదృష్టంగా భావిస్తాను'' అని నా అంగీకారాన్ని తెలియజేశాను. ఇది చిత్ర నిర్మాణరంగంలో నా తొలి అడుగు.

☆☆☆

1953లో ప్రారంభించబడ్డ 'నేషనల్ ఆర్ట్స్ థియేటర్' సంస్థ తొలి ప్రయత్నంగా 'తోడుదొంగలు' చిత్రాన్ని నిర్మించింది. శ్రీరామారావుగారు, శ్రీ గుమ్మడి వెంకటేశ్వరరావుగారు ప్రధాన పాత్రలు పోషించారు. సముద్రాల రామానుజం (జూనియర్) రచన, టి.వి.రాజు సంగీతం, చిత్ర దర్శకులు డి. యోగానంద్.

'తోడుదొంగలు' ఆర్థిక దృష్టితో కాక కళాత్మక విలువలతో తీశారు. చిత్రానికి సంబంధించిన మ్యూజిక్ సిట్టింగ్సు రాత్రి వేళల్లో జరిగాయి. శ్రీ త్రివిక్రమరావుగారికి సంగీతం పట్ల అభిరుచి ఎక్కువ. ఆయన దగ్గర ఉండి ట్యూన్స్ విషయంలో సూచనలు ఇస్తుండేవారు. నేను కూడా మ్యూజిక్ సిట్టింగ్స్‌కు వెళుతుండేవాడిని. అప్పట్లో రామారావుగారు రోజుకు రెండు మూడు షిఫ్టులు పనిచేస్తూ చాలా బిజీగా ఉండేవారు. షూటింగ్ పూర్తయి ఇంటికి వచ్చేసరికి 10 గం॥ దాటేది. భోజనానంతరం ఆయన కూడా వచ్చి



'పిచ్చి పుల్లయ్య'లో యన్.టి.ఆర్.



'తోడుదొంగలు' వర్కింగ్ స్టిల్

కెమెరామెన్ యం.ఏ. రెహమాన్, యన్.టి.ఆర్, దర్శకుడు యోగానంద్

సంగీత చర్చల్లో పాల్గొనేవారు. ఆ సోదరులిద్దరికీ పడుకోబోయే ముందు టీ తాగటం అలవాటు. సంగీతం కార్యక్రమాలు పూర్తయ్యాక అందరూ మౌంట్ రోడ్డులోనో, లేక ట్రిప్లికేన్‌లోనో ఉన్న ఇరానీ హోటల్లో 'టీ' తాగి ఇళ్ళకు వెళ్ళేవాళ్ళం. ఆ సోదరులిద్దరూ సంస్థలో పనిచేసే అందరితోనూ ఎంతో కలుపుగోలుతనంగా ఉండేవారు.

ఈ చిత్ర నిర్మాణసమయంలోనే ఘంటసాల వెంకటేశ్వరరావు గారితో పరిచయం, తరువాత ఆయనంటే ఎంతో గౌరవం, అభిమానం ఏర్పడ్డాయి. అప్పుడప్పుడు పాటల రికార్డింగ్ కార్యక్రమం పూర్తయ్యాక రిలాక్స్ కావటానికి ఘంటసాల గారు మౌంట్‌రోడ్డులో ఉన్న మా ఆఫీస్‌కు వచ్చేవారు. ఇద్దరం తరచుగా మెరీనా బీచ్‌కు వెళ్తుండేవాళ్ళం.

ఈ సందర్భంగా ఘంటసాల మాష్టారు గూర్చి ఒక విషయం ముచ్చటించుకోవాలి. ఆయన నిర్మించిన 'పరోపకారం' (1953) చిత్రం విడుదల సందర్భంగా ఆయన కొన్ని కేంద్రాలకు వెళుతూ నన్ను కూడా రమ్మని కోరారు. మొదట విజయనగరం వెళ్లాం. అక్కడ ఆయన చిన్నతనంలో సంగీతం, విద్య అభ్యసించిన రోజుల్లో పడ్డ కష్టాలను గూర్చి వివరంగా చెబుతూ విజయనగరంలో తాను సంచరించిన, తనతో అనుబంధం ఉన్న ప్రదేశాలన్నిటినీ చూపించారు. అక్కడనుంచి కాకినాడ మీదుగా విజయవాడ చేరాము. 'పరోపకారం' టాక్ ఆశాజనకంగా లేదు. విజయవాడలో గాంధినగర్‌లో వున్న హోటల్‌లో బస చేశాము. ఆ సాయంత్రం మా రూమ్ బయట కూర్చుని పిచ్చాపాటి మాట్లాడుతుండగా ఎదురుగా వున్న లక్ష్మి టాకీస్‌లో 'దేవదాసు' చిత్రం 100 రోజులు దాటి దిగ్విజయంగా ప్రదర్శించటం గమనించిన ఘంటసాలగారు నాతో "రాజుగారూ! దేవదాసు చిత్రంలో నా పాటలకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. కానీ నేను స్వయంగా నిర్మించిన 'పరోపకారం' చిత్రం అపజయం పాలయింది. దానికి ఆనందించాలో, దీనికి బాధ పడాలో తెలియడం లేదు" అన్నారు. తరువాత



గంఢ్రగొడ్డలి యుద్ధం వంటి కొత్త తరహా
పోరాటాలను 'జయసింహ' చిత్రం కోసం
స్టంట్ మాష్టారు సోము కంపోజ్ చేసారు.



నాటి ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానంద రెడ్డి దంపతులతో
దేశ రక్షణ నిధి సాంస్కృతిక కార్యక్రమ బృందం

ఆయన మరణించేదాక నేను నిర్మించిన అన్ని చిత్రాలలోనూ ఘంటసాల మాష్టారు మధురమైన గీతాలను సుమధురంగా ఆలపించారు.

1954లో 'తోడుదొంగలు' విడుదలయింది. కొన్ని కేంద్రాలలో టాక్ తెలుసుకోవటానికి త్రివిక్రమరావుగారూ, నేను ఆంధ్రాకు వెళ్ళాము. ఈ చిత్రంలో శ్రీ యన్.టి.ఆర్, శ్రీ గుమ్మడి ఇద్దరూ వయసు మళ్ళిన 'డీగ్లామర్డ్' పాత్రలు పోషించటం విశేషం. రామారావుగారి నటనకు ప్రశంసలు లభించినా ఆర్థికంగా విజయవంతం కాలేదు. విజయవాడ నుంచి మేము తిరిగి మద్రాసుకు కారులో బయలుదేరాము. మార్గమధ్యంలో నేను ఈ పాటికి "చిత్ర ఫలితాలు తెలుసుకొన్న రామారావుగారు పట్టుదలతో కొత్త చిత్రానికి కథ కోసం తీవ్రంగా ఆలోచిస్తుంటారు" అని త్రివిక్రమరావుగారితో అన్నాను.

☆☆☆

**జయసింహ విశేషాలు :**

మేము బజుల్లా రోడ్డులో రామారావుగారి ఇంటికి చేరేసరికి మేము ఊహించిన దృశ్యం మా కళ్ళకు ఎదురయింది. వరండాలో ఒక సోఫాలో రామారావుగారు ఒక పుస్తకం చదువుతూ నాకు కనిపించారు. మమ్మల్ని చూడగానే ఆయన పుస్తకం ప్రక్కన పెట్టి "రండి రండి మంచి కథాంశం ఉన్న నవల ఇప్పుడే పూర్తి చేసాను. అది వెంకట పార్వతీశం కవులు వ్రాసిన 'వీరపూజ'. ఈ నవల మీరిద్దరూ కూడా చదివి మీ అభిప్రాయం చెప్పండి" అన్నారు.

ఆ పుస్తకం చదువుతూంటే సెంటిమెంట్ పరంగానూ, సాహస కృత్యాల పరంగానూ ప్రేక్షకుల్ని ఉత్తేజ పరిచే సంఘటనలు, సన్నివేశాలు చాలా ఉన్నాయనిపించింది. అదే విషయం రామారావుగారితో చెప్పాం. అప్పుడు వారు నవలలోని మూల కథను మాత్రం తీసుకొని సముద్రాల సీనియర్, సముద్రాల జూనియర్‌లతోనూ, దర్శకులు యోగానంద్‌తోనూ విపులంగా

చర్చించి సినిమాకు తగ్గట్టుగా స్క్రీన్‌ప్లే రూపొందించారు. అదే 'జయసింహ' చిత్రం. అందులో మహామహులైన నటీనటులు యస్వీ రంగారావు, గుమ్మడి, కాంతారావు, రేలంగి, రాజనాల, అంజలీదేవి మొదలగు వారిని ఎంపిక చేసారు. హీరోయిన్ రాజకుమారి పాత్రకు ఎవరయితే బాగుంటుందా అన్న ఆలోచన వచ్చినప్పుడు అప్పుడే చిత్రపరిశ్రమలో ప్రవేశించిన వహిదా రెహమాన్‌ను పిలిపించి చూసాక రామారావు గారు ఆమెను ఎంపిక చేశారు. టి.వి.రాజు, ఎం.ఏ. రహమాన్ స్టంటు సోము, వెంపటి సత్యం వంటి సిద్ధహస్తులైన సాంకేతిక నిపుణుల్ని ఎన్నుకొన్నారు.

తెలుగు చిత్రాల్లో స్టంటు పరంగా అప్పటి వరకూ వచ్చిన పోరాట సన్నివేశాలకు భిన్నంగా స్టంటు సోము కంపోజ్ చేసిన గండ్రగొడ్డలి యుద్ధం, కాగడాల పోరాటం ప్రేక్షకుల్ని ఎంతగానో ఆకర్షించాయి. రహమాన్ ఫొటోగ్రఫీ కన్నుల విందు చేసింది. సంగీతపరంగా టి.వి.రాజు కంపోజ్ చేసిన అన్ని పాటలు హిట్ అయ్యాయి. అన్ని విధాలా అందులోని "ఈనాటి ఈ హాయి కల కాదోయి నిజమోయి.." అన్న పాట క్రొత్త ఒరవడిని సృష్టించింది.

ఈ విధంగా ఎన్నో ప్రత్యేకతలు ఉన్న జానపద చిత్రం 'జయసింహ' అనూహ్య విజయాన్ని సాధించింది. చిత్రం విడుదలకు మేమంతా విజయవాడవెళ్ళి లక్ష్మి టాకీసులో మొదటి ఆట పూర్తయ్యేవరకు ఉండి అక్కణ్ణుంచి బందరులోని బృందావన్ టాకీసుకు వెళ్ళాము. రెండవ ఆటకు ప్రేక్షకులు హర్షాతిరేకం గమనించి, రెండవ ఆట పూర్తయ్యేసరికి తిరిగి విజయవాడ వచ్చాము. లక్ష్మి టాకీసు చుట్టుపక్కల అన్ని రోడ్లు, రిక్షాలతో నిండిపోయాయి. ఆ థియేటర్ యజమానులు రామక్రిష్ణారావుగారు, జగన్నాధరావుగారు (తరువాత ఈయన నిర్మాతగా రాజనందిని, నిండు మనసులు వంటి చిత్రాలు నిర్మించారు.) వారిని ఆ రిక్షాల హడావిడి ఏమిటి అని ప్రశ్నించాము. వారు "రిక్షావాళ్ళ వత్తిడి వల్ల ప్రత్యేకంగా అర్ధరాత్రి ఆట వెయ్యాల్సి వచ్చింది." అని చెప్పారు. మేము హాలు లోపలికి వెళ్ళి చూడగా నేల నుంచి బాల్కనీ దాకా అన్ని క్లాసులు రిక్షా కార్మికులతో నిండిపోయాయి.

పలు సన్నివేశాలలో ముఖ్యంగా పోరాట దృశ్యాలలో హాలంతా కేరింతలు, ఈలలు, చప్పట్లతో మార్మోగింది. ఈ సన్నివేశాన్ని చూసిన శ్రీరామారావుగారు, మేము పడ్డ కష్టానికి తగ్గ ఫలితం లభించింది అని ఎంతగానో ఆనందించాము.

'జయసింహ' (1955) పలు కేంద్రాలలో 100 రోజులకు పైగా నడిచింది. అప్పటికి ఇంకా రంగుల చిత్రాలు రాలేదు. అయితే మద్రాసులో ఒక టెక్నీషియన్ సినిమాలో జనాకర్షణగల ఒకటి రెండు సన్నివేశాలకు పంచరంగులు అద్దటం వంటి ప్రక్రియ ప్రారంభించాడు. పైన ఉదహరించిన 'ఈనాటి ఈ హాయి...' అన్న పాటకు ఆ రంగులు అద్దె ప్రక్రియ పూర్తి చేసి అన్ని కేంద్రాలకు తరువాత పంపాము. దాంతో అంతకు ముందు సినిమాను ఒకసారి చూసినవారు ఆ పాటకోసం మళ్ళా, మళ్ళా చూడసాగారు. విజయోత్సవ వేడుకలు జరుపుకోవటానికి విజయవాడ, రాజమండ్రి, కాకినాడ కేంద్రాలు ఎంపిక చేసారు. అదే సమయంలో పాలకొల్లు, పెనుగొండ కేంద్రాలలో 'జయసింహ' 50 రోజులు పూర్తి చేసుకుంది. (అటువంటి కేంద్రాలలో 50 రోజులు ఆడిందంటే అది 100 రోజులకు సమానం) ఆ థియేటర్ యజమానులు నాకు మిత్రులు. వారు శతదినోత్సవ వేడుకలకు కాకినాడ వెళ్ళేటప్పుడు ముందుగా పాలకొల్లు, పెనుగొండ కేంద్రాలకు చిత్ర యూనిట్ తీసుకెళ్ళి గౌరవించాలని వారి ఉద్దేశ్యం. వారు ఆ కోరికను నా ద్వారా శ్రీ రామారావుగారికి తెలియజేశారు. పైగా ఎప్పటినుంచో రామారావు గార్ని మా స్వగ్రామం కవిటం తీసుకెళ్ళాలని నా కోరిక.

యూనిట్ అంతా హౌరా మెయిల్‌లో కాకినాడ బయలుదేరాము. శ్రీ రామారావుగారూ, త్రివిక్రమరావుగారు, గుమ్మడి వెంకటేశ్వరరావుగారూ, నేను సంగీత దర్శకులు టి.వి.రాజుగారు నిడదవోలులో దిగి ఆ ప్రక్కనే ఉన్న టి.వి.రాజుగారి అత్తవారి గ్రామం మారంపల్లి వెళ్ళి అల్పాహారం తీసుకొని అక్కణ్ణుంచి బయలుదేరి భోజన సమయానికి మా స్వగ్రామం కవిటం

చేరుకున్నాము. సినిమా వారిని చూసేందుకు వచ్చిన జనంతో మా ఇంటి పరిసరాలు నిండిపోయాయి. అభిమాన నటుల్ని చూసి మా గ్రామ ప్రజలు ఎంతోగానో ఆనందించారు. మా తండ్రిగారు చక్కని భోజన ఏర్పాట్లు చేసారు. నిడదవోలు బయలుదేరిన దగ్గర నుంచి పాలకొల్లు చేరేదాకా శ్రీ రామారావుగారిని చూడాలని రహదారిలో గుఱ్ఱపు బండ్లు, ఎడ్ల బండ్లు వగైరా అడ్డుపెట్టి మా కార్లను ఆపి తమ అభిమాన కథానాయకుణ్ణి కళ్ళారా జూసి తృప్తి చెందారు. పాలకొల్లులో (థియేటర్ యజమాని అద్దేపల్లి సత్యనారాయణ మూర్తి) పెనుగొండలో (థియేటర్ యజమాని నూలి లక్ష్మీనారాయణ జమిందార్) ప్రతి ఆటకు ప్రేక్షకులకు అభివాదం చేసి ఆ తరువాత కాకినాడ మెజిస్టిక్ టాకీసులో ఫంక్షన్‌కి హాజరయ్యాము. ఆ మరుసటి రోజు రాజమండ్రి రామా టాకీసులోనూ, మూడోరోజు విజయవాడ లక్ష్మీటాకీసులోనూ శతదినోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. అప్పట్లో శ్రీ జగన్మోహనరావు అనే ఆయన మేనేజింగ్ పార్టనర్‌గా 'నేషనల్ ఆర్ట్స్' అనే డిస్ట్రిబ్యూషన్ సంస్థ ప్రారంభించి సినిమాల్ని పంపిణీ చేస్తుండేవారు. ఆ సందర్భంగా ఆయనతో పరిచయం పెరగటం ఫలితంగా ఆ సంస్థలో నేను భాగస్వామిగా చేరటం జరిగింది. దీని కార్యాలయాలు విజయవాడలోనూ, సికింద్రాబాదులోనూ ఉండేవి.

☆☆☆

## యన్.టి.ఆర్. పట్టుదల

జయసింహ సందర్భంలో జరిగిన ఒక సంఘటన గూర్చి చెప్పితీరాలి. రాకుమారి పాత్రకు వహీదా రహమాన్‌ను ఎంపిక చేసిన సందర్భంలో ఆమెకు, నిర్మాణసంస్థ ఎన్.ఏ.టి.తో ఒక ఒప్పందం జరిగింది. దాని ప్రకారం ఆమె రెండు సంవత్సరాలు ఎన్.ఎ.టి. అనుమతి లేకుండా ఇతర చిత్రాలలో నటించకూడదని నిబంధన. దీనికి విరుద్ధంగా ఆమె ఒక చిత్రంలో నటించటానికి "కాల్షీట్సు" ఇచ్చింది. నిబంధనను ఉల్లంఘించినందుకు

ఎన్.ఎ.టి. సంస్థ ఆమెకు రిజిస్టర్డు నోటీసు పంపింది. ఆమె తరుపున ఆమె తల్లి "మా అమ్మాయి మైనర్, అంచేత ఆమె చేసిన ఎగ్రిమెంటు చెల్లదు". అని లాయర్ ద్వారా జవాబు పంపించింది. దానికి రామారావు గారు ఆగ్రహించి వహిదా తప్పకుండా మేజర్, కాని అబద్దం ఆడుతున్నారని దీని విషయం పరిశీలించి తగు చర్యతీసుకోవాలని పట్టుదల వచ్చింది. వహీదా తండ్రి మున్సిపల్ కమీషనర్‌గా పనిచేసారు. ఆయన తమిళనాడులోని చెంగల్పట్టు, కడలూరు పట్టణాల్లో గతంలో కమీషనర్‌గా వ్యవహరించారు. అంచేత వహీదా బహుశా అక్కడ జన్మించి ఉండవచ్చు అని అభిప్రాయపడ్డారు రామారావుగారు. ఆ విషయాన్ని ధ్రువపరచుకోవటం కోసం నేనూ, గుమ్మడి వెంకటేశ్వరరావుగారు కడలూరు వెళ్ళాము. అక్కడ జన్మించలేదని తెలుసుకొని చెంగల్పట్టు వెళ్ళి జనన, మరణాల ఆఫీసులో వాకబు చేయగా ఆమె అక్కడ జన్మించినట్టు, ఆమె జనన తేదీని బట్టి ఆమె మైనర్ కాదు మేజర్ అన్న విషయం ధ్రువపడింది. దీనిని ఉదహరిస్తూ ఎన్.ఏ.టి. సంస్థ రిప్లయ్ నోటీసు ఇవ్వగా వహిదా తల్లి చేసేది లేక కొంత మంది ప్రముఖులతో వచ్చి రామారావుగారిని క్షమాపణకోరి ఆయన్ను శాంతింప చేశారు.

☆☆☆

**'పాండురంగ మహాత్మ్యం'**

'జయసింహ' తరువాత తీయవలసిన చిత్రం కథ గూర్చి రామారావుగారు తీవ్రంగా ఆలోచిస్తున్న సమయంలో ఏకాదశి సందర్భంగా మద్రాసు ఎలిఫిన్‌స్టన్ థియేటర్‌లో 'హరిదాసు' చిత్రం అర్ధరాత్రి ఆటగా వేస్తున్నట్టు తెలిసింది. 1946లో తొలిసారిగా విడుదలయి ఘనవిజయాన్ని సాధించిన ఆ భక్తిరస చిత్రంలో త్యాగరాజ భాగవతార్, వసుంధరాదేవి (వైజయంతిమాల తల్లి) నటించారు. మేమంతా వెళ్ళి అర్ధరాత్రి ఆట చూసాము. ఆ కథాంశం రామారావుగారికి బాగా నచ్చింది. దాంతో ఆ కథను కొద్ది మార్పులు చేసి 'పాండురంగ మహాత్మ్యం'గా నిర్మించారు. అందులో

రామారావుగారితో పాటు నాగయ్య, అంజలీదేవి, బి. సరోజాదేవి ప్రధాన పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి కమలాకర కామేశ్వరరావు దర్శకత్వం వహించగా సముద్రాల జూనియర్ రచన, టి.వి.రాజు సంగీతాన్ని అందించారు. ఈ చిత్రంలోని 'హే క్రిష్ణా ముకుందా మురారి...' అన్న పాట ఈ నాటికి ప్రజలను అలరిస్తుంది. ఆ పాటలో చిన్న కృష్ణుని పాత్రలో బాలనటిగా విజయనిర్మల మొదటిసారిగా తెరకు పరిచయమయ్యారు. 'పాండురంగ మహాత్మ్యం' కూడా విపరీతంగా ప్రజాదరణపొంది శత దినోత్సవం చేసుకొంది. దాని తరువాత ఎన్.ఎ.టి. సంస్థ 'సీతారామ కళ్యాణం' (1961), 'గులేబకావళి కథ' (1962) నిర్మించారు. అప్పటి వరకు ఆ సంస్థలో నా భాగస్వామ్యం కొనసాగింది. 'గులేబకావళి కథ' చిత్ర నిర్మాణసమయంలో రామారావుగారు ప్రముఖ కవి సి.నారాయణరెడ్డి గారిని హైదరాబాదు నుంచి మద్రాసు పిలిపించి ఆయన చేత పాటల్ని రాయించారు. అప్పట్నుంచి సి.నారాయణరెడ్డి గారితో ఏర్పడ్డ పరిచయం ఆత్మీయ స్నేహమై ఈనాటి వరకు కొనసాగుతోంది. ఒక విధంగా చెప్పాలంటే మా డి.వి.ఎస్. ప్రొడక్షన్స్ చిత్రాలకు నారాయణరెడ్డి గారే ఎక్కువ గీతాలు రాశారు.

☆☆☆

ఎన్.ఎ.టి.లో భాగస్వామ్యం కొనసాగుతుండగానే అంటే 1962కు ముందే కొన్ని పరిస్థితుల్లో నేను చిత్ర నిర్మాణరంగంలోకి అడుగుపెట్టాను. రామారావుగారు హీరోగా సాహిణి వారు నిర్మించిన 'పెంకిపెళ్ళాం' చిత్రాన్ని 'కణ్ణియన్ కడిమై' అనే టైటిల్‌తో తమిళంలోకి డబ్‌చేసి విడుదల చేయగా అది విజయవంతమయింది.

1959లో హిందీలో విజయవంతమైన 'చిరాగ్ కహా రోషనీ కహా' చిత్రం ప్రదర్శన హక్కులతో పాటుగా దక్షిణాది భాషల్లో రిమేక్ చేసే హక్కులని కొంతమంది మిత్రులతో కలిసి తీసుకున్నాము. ఈ సంగతి తెలియని దర్శకులు శ్రీ తాతినేని ప్రకాశరావు ఆ చిత్రం హక్కుల కోసం

బొంబాయి వెళ్ళి నిర్మాతల్ని సంప్రదించగా అవి మా దగ్గర ఉన్నట్టు వారికి తెలిపారు. అప్పుడు వారికి (తాతినేని ప్రకాశరావు) నాకు మిత్రులైన ప్లాజా థియేటర్ యజమాని శ్రీ అప్పిరెడ్డి గారిని నా వద్దకు చర్చలకు పంపారు. హక్కులు వారికి అమ్మినాసరే లేక ఉభయులు భాగస్వాములుగా తెలుగు, తమిళ భాషల్లో ఒకేసారి నిర్మించాలని. ఇది దాని సారాంశం. నాతో భాగస్థులుగా ఉన్న కొంతమంది మిత్రులతో ఆలోచించి ఆ ప్రతిపాదనకు అంగీకరించాము. మాకు మార్గదర్శకులైన శ్రీ రామారావుగారితో ఈ విషయం ప్రస్తావించగా వారు ఈ ప్రతిపాదనకు సంతోషించారు. అప్పట్లో ఒక కథను తెలుగు, తమిళ భాషల్లో తీసినప్పుడు శ్రీ అక్కినేని - సావిత్రి విజయవంతమైన జంటగా పేరుంది. ఆ కాంబినేషన్‌తో నేను నిర్మాతగా, తాతినేని ప్రకాశరావు దర్శకునిగా తెలుగులో 'మా బాబు', తమిళంలో 'అన్బుమగన్ (1961) అనే పేరుతో నిర్మించాము. ఆశించిన స్థాయిలో ఆ చిత్రం విజయవంతం కాలేదు. అయితే మంచి చిత్రంగా ప్రజాప్రశంసలతో పాటు ఉత్తమ చిత్రంగా ఫిలింఫేర్ అవార్డు పొందింది.

☆☆☆


**డి.వి.యస్. ప్రొడక్షన్స్ ఆవిర్భావం :**

నేను స్వయంగా చిత్ర నిర్మాణం చేపట్టే తలంపుతో 1964లో డి.వి.యస్. ప్రొడక్షన్స్ సంస్థను ప్రారంభించాను. శ్రీ రామారావుగారే నన్ను వెన్నుతట్టి ప్రోత్సహించారు. శ్రీరామారావుగారు శ్రీ త్రివిక్రమరావు సోదరుల చేతుల మీదుగా సంస్థ ప్రారంభించబడింది. డి.వి.యస్. ప్రొడక్షన్స్ మొదటి చిత్రం 'మంగమ్మ శపథం' చిత్ర దర్శకులు శ్రీ విఠలాచార్య, రచన జూనియర్ సముద్రాల, సంగీతం టి.వి.రాజు.

ఈ కథను అంతకుముందు జెమినీ వారు 'మంగమ్మ శపథం' పేరుతోనే తమిళంలో నిర్మించారు. అందులో రంజన్, వసుంధరాదేవి ప్రధాన పాత్రలు పోషించారు.



'మా బాబు' చిత్రంలో అక్కినేని



అక్కినేని జన్మదినోత్సవ సందర్భంగా అభినందనలు

మా చిత్ర కథానాయకుడు శ్రీ రామారావుగారు. ఆయన తండ్రి, కొడుకులుగా ద్విపాత్రాభినయం.మాకు కథానాయిక ఎంపిక చిక్కు సమస్యగా మారింది. చిత్ర కథానాయిక మంగమ్మ ఒక హీరోకి భార్య మరో హీరోకి తల్లి. పట్టుదల, ధైర్యసాహసాలతో మహారాజుతో సవాల్ చేసి పంతం నెగ్గించుకున్న పాత్ర. చిత్రం అంతటికీ అది కేంద్ర బిందువు వంటిది. అటు భార్యగా, ఇటు తల్లిగా నటించి మెప్పించాల్సిన క్లిష్టమైన భూమిక. కొడుకు పాత్రలో ఉన్న ఎన్.టి.ఆర్ 'అమ్మా' అని సంభోదిస్తే ప్రేక్షకులు అంగీకరించాలి. అటువంటి నటి ఎవరా అని చాలా పేర్లు పరిశీలించి చివరకు జమునగారిని ఎంపిక చేశాము. మా నిర్ణయం పట్ల చిత్ర పరిశ్రమలో తలపండిన పెద్దలెందరో నిరుత్సాహపరిచారు. అయినా సరే పాత్రలోని రెండు పార్శ్వాలను జమున చక్కగా పోషించగలరు అనే ధైర్యంతో ముందుకు సాగాము.

☆☆☆

ఈ చిత్ర నిర్మాణప్రారంభ దశలో నన్ను ఆందోళనకు గురిచేసిన ఒక సంఘటన ప్రస్తావిస్తాను.

ఒక రోజున నేను, రామారావుగారు వారి సోదరులు త్రివిక్రమరావుగారు వారింట్లో చిత్రాన్ని గురించి చర్చిస్తున్న సమయంలో జెమినీ అధినేత శ్రీ ఎస్.ఎస్. వాసన్ గారి దగ్గర్నుంచి ఫోన్ వచ్చింది. కొద్ది సేపట్లో వారు వచ్చి రామారావు గారిని కలుస్తారు అనేది దాని సారాంశం. ఆయన ఎందుకు వస్తున్నారేది మేము ఆందోళన పడ్డాము. ఆయన అంతకు ముందు ఈ కథను తమిళంలోను, హిందీలోనూ తీశారు. ఒకవేళ ఆయనే తెలుగులో తీయాలనుకుంటున్నారా? లేక ఆ సినిమా హక్కుల గురించి మాట్లాడటానికి వస్తున్నారా అనే పలు సందేహాలు నన్ను ఆందోళనకు గురి చేస్తాయి. ఆయన వచ్చే సమయానికి నేను వేరే రూమ్‌లోకి వెళ్ళి ఆతృతతో ఏం జరుగుతుందా అని ఎదురు చూస్తున్నాను. ఆయన వచ్చి వెళ్ళాక అసలు



డి.వి.ఎస్. ప్రొడక్షన్స్ తొలిచిత్రం 'మంగమ్మ శపథం' ప్రారంభోత్సవ సంబరం





'మంగమ్మ శపథం'లో నాయకీ నాయకులు యన్.టి.ఆర్. - జమున

విషయం శ్రీ రామారావుగారు వివరించారు. వాసన్‌గారు తెలుగులో తీయబోయే 'ఆడబ్రతుకు' చిత్రంలో రామారావుగారిని బుక్ చేయటం కోసం వచ్చారట! ఆ విషయం విన్న మేము హమ్మయ్య అని స్థిమిత పడ్డాము.

☆☆☆

నాకు మొదటినుంచి మధురమైన సంగీతమంటే చాలా ఇష్టం. ఇది జానపద చిత్రమైనా అన్ని పాటలు సంగీత పరంగానూ, సాహిత్యపరంగానూ ఉన్నత స్థాయిలో ఉండటానికి మేము చేసిన కృషి ఫలించింది. ఈ కృషిలో నాకు త్రివిక్రమరావుగారు, సి.నారాయణరెడ్డి గారు, టి.వి. రాజుగారు ఎంతో సహకరించారు. దాని ఫలితమే మంచి కథా, కథనం సంగీతంతో కూడిన చిత్రంగా రూపుదిద్దుకుంది.

శ్రీ విఠలాచార్య గారు ఎప్పుడూ నిర్మాత శ్రేయస్సు కోరే దర్శకుడు. చిత్రంపై ఎక్కువ ఖర్చు పెట్టకూడదు, నిర్మాత బాగుండాలి అనే దృక్పథం కలవారు. పాటలన్నీ కూడా ఇండోర్‌లో సెట్స్ వేసి, అవుట్‌డోర్ లో చిత్రీకరించిన ఎఫెక్ట్ రావటం కోసం ప్రయత్నించటం ఆయన పద్ధతి.

ఇది సంస్థ తొలి చిత్రం కాబట్టి కనీసం ఒక్క పాటైనా సుందర ప్రదేశమైన కొడైకెనాల్‌లో తీయాలని నిర్మాతగా నా కోరిక. అందులోనూ చిత్రంలోని మొదటి పాట 'రివ్వున సాగే రెపరెపలాడే యవ్వనమేమన్నది'... అనే హీరోయిన్ ఇంట్రడక్షన్ పాటను కోడైకెనాల్‌లో చిత్రీకరిద్దామని నేను ప్రతిపాదించాను. అందుకు విఠాలచార్యగారు 'ఎందుకు సార్ అవుట్‌డోర్‌లో తీసినా అనుకున్నట్టు పనిపూర్తిగాదు. తిరిగొచ్చి ఇక్కడ కొంత ఇండోర్‌లో తీయాల్సి వస్తుంది. దాని బదులు పూర్తిగా ఇండోర్‌లో (విజయా గార్డెన్స్)లో తీస్తే సరిపోతుంది గదా! అనవసరపు ఖర్చు తప్పుతుంది. అన్నారు. అయినా గట్టిగా పట్టుపట్టడంతో ఆ పాటను కొడైకెనాల్‌లోనే తీయాలని నిర్ణయించాము.

☆☆☆



కొడైకెనాల్‌లో కెమెరాకంటితో దృశ్యాన్ని వీక్షిస్తున్న శ్రీ డి.వి.ఎస్.



'మంగమ్మ శపథం' రికార్డింగ్ సందర్భంగా విఠలాచార్య, టి.వి. రాజు లతో..

**కోడైకెనాల్ వింత అనుభవం :**

అది 1965 జనవరి. శీతాకాలం కావటంతో చలి ఎక్కువగా ఉంది. కొడైకెనాల్‌కి మేము చేరుకున్న మరుసటి రోజు షూటింగ్. ఆరోజు ఉదయాన్నే మేకప్ చేసుకొని వచ్చిన చిత్ర కథానాయిక జమున ఇతర యూనిట్ సభ్యులు అందరూ షూటింగ్ స్పాట్‌కి చేరుకున్నాము. కాని ఔట్‌డోర్ యూనిట్ ఎక్విప్‌మెంట్ అక్కడికి చేరుకోలేదు. ఒక పక్క చలి మరో పక్క యూనిట్ రాలేదని ఒకటే టెన్షన్. మేనేజర్ కారులో వెళ్ళి చూడగా అవుట్‌డోర్ యూనిట్ వ్యాన్ చెడిపోవటం వల్ల షూటింగ్ స్పాట్‌కు డెబ్బై మైళ్ళ దూరంలో ఒక చోట ఆగిపోయింది. మరో వ్యాన్‌లోకి ఎక్విప్‌మెంట్ ఎక్కించి సాయంత్రానికి స్పాట్‌కు చేరుకున్నారు. సూర్యుడు విశ్రాంతి తీసుకోవటం వల్ల మేము ఆరోజు షూటింగ్ చేయలేక పోయాము. మర్నాడు లొకేషన్‌కి వచ్చి షూటింగ్ ప్రారంభిద్దామనుకొనేసరికి చలి వాతావరణం కావడంవల్ల కెమెరా మొరాయించింది. అప్పుడు కెమెరామేన్ సంపత్ చితి మంటల్ని ఏర్పాటు చేసి కెమెరా భాగాలకు వేడిసెగ తగిలించాడు. మధ్యాహ్నం షూటింగ్ ప్రారంభించాము. ఒక పక్క జమున డేట్స్ అయిపోతుండటం మరో పక్క పాట చిత్రీకరణ ఎలాగా అనుకుంటూనే మూడొంతులు పూర్తి చేశాము. విఠలాచార్య గారు ముందు చెప్పినట్టుగానే మిగతా లింకు షాట్లు మద్రాసు విజయా గార్డెన్స్‌లో కొడైకెనాల్ వాతావరణం ఉండేలా పూర్తి చేయాల్సి వచ్చింది. అయితే తెరపై ఆపాట చూస్తున్నప్పుడు మా కష్టం కలిసి వచ్చిందని తృప్తి మిగిలింది.

శాస్త్రీయ సంగీతమన్నా, జానపద గీతాలన్నా అందులోనూ జావళీలంటే నాకెంతో ఇష్టం. అందుకే 'అందాల నా రాజా అలుకేలరా...' అన్న జావళీ గీతాన్ని రెండో కథానాయకి, నర్తకి అయిన ఎల్. విజయలక్ష్మి, హీరో ఎన్.టి.ఆర్.లపై చిత్రీకరించాము. ఈ తరహా జావళీ గీతాలనే ఆ తరువాత చిత్రాలలో కూడ పొందు పరిచాము. చిత్ర విజయానికి సంగీతం ఎంతో

దోహదం చేస్తుందని నా నమ్మకం. అందుకే నా చిత్రాల్లో సంగీతంపట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొనేవాళ్ళం.

1965 మార్చి నెలలో విడుదలైన 'మంగమ్మశపథం' ఘనవిజయం సాధించింది. ఆర్థికంగా మాకు లాభాలు తెచ్చిపెట్టడమే కాక వందరోజులపైగా ప్రదర్శించబడింది. మా బ్యానర్ పై నిర్మించిన తొలిచిత్ర ఫలితాలు మాకు ఎంతో తృప్తినిచ్చాయి.

☆☆☆

## ఫిలిం ప్రొడ్యూసర్స్ గిల్డ్ ఆఫ్ సౌత్ ఇండియా ఆవిర్భావం

నా విద్యార్థి దశ నుంచి పది మందికి ఉపయోగపడే కార్యక్రమాల్ని ఉత్సాహంగా ముందుండి నడిపించటం నాకు అలవాటు. 1964-65 ప్రాంతాలలో పాకిస్థాన్, భారత్ యుద్ధ ఫలితంగా గవర్నమెంట్ విధించిన కంట్రోల్ మూలంగా ముడి ఫిలిం దొరకటం చాలా కష్టంగా ఉండేది. పర్మిట్ ద్వారానే ఫిలిం కొనాల్సి వచ్చింది. చిన్న నిర్మాతలకు చిత్ర నిర్మాణదశలోనూ, విడుదల పరిస్థితి సమయంలోనూ, కావల్సిన ముడి ఫిలిం పంపిణీ చేసే బాధ్యత 'సౌత్ ఇండియన్ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్' వారిది. ఆ సంస్థకు ఆధ్వర్యం వహించిన కొందరు పెద్దలే ఆ ముడిఫిలింను ఎక్కువగా దక్కిచ్చుకొనే వారు. దాంతో చిన్న నిర్మాతలు నిరాశపడి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొవలసి వచ్చేది.


నేనూ, మరికొంతమంది మిత్రులు కలిసి నిర్మాతల శ్రేయస్సే ప్రధానంగా దృష్టిలో ఉంచుకొని వారందరికీ సహాయపడే సంస్థ ఒకటి ఉండాల్సిన ఆవశ్యకత ఉందని నిర్ధారించాము. ఆ నిర్ణయానుకూలంగా 1965లో 'ఫిలిం ప్రొడ్యూసర్స్ గిల్ట్ ఆఫ్ సౌత్ ఇండియా' అనే సంస్థను ప్రారంభించాము. దానికి తొలి అధ్యక్షునిగా శ్రీ త్రివిక్రమరావు గారిని, కార్యదర్శిగా నన్ను ఎన్నుకొన్నారు. దాని కార్యాలయం మా ఆఫీసులోనే పెట్టి కార్యకలాపాలు ప్రారంభించాము.

ఫిలిం పంపిణీకి సంబంధించి రెండు వర్గాలు ఏర్పడ్డాయి. ఒక వర్గం స్టూడియోలు నిర్మించి ఎప్పటినుంచో సినిమాలు తీసే నిర్మాతలకు ప్రథమస్థానం ఇతర సీనియర్ నిర్మాతలకు రెండోస్థానం, ఇంకా మిగిలితే అప్పుడు కొత్త వారిని గూర్చి ఆలోచించాలనే వర్గం ఒక ప్రక్క - కాదు కొత్త వారికి కూడా ప్రాధాన్యత ఉండాలి, అందరం సమానమే అని మరోవర్గం, అప్పటి పరిస్థితులలో చిత్ర పరిశ్రమ పైన చెప్పిన ప్రకారం రెండుగా చీలిపోయింది. మొదటి వర్గం పక్షాన శ్రీనివాసన్‌గారు, రెండో వర్గం పక్షాన నాగిరెడ్డిగారు ముందుగా నిలిచారు. మేమంతా నాగిరెడ్డిగారికి అండగా నిలిచాము. ఈ ముడిఫిలిం సరఫరా కోసం 'ఫిలించాంబర్'లోని కొంత మంది పెద్దలు కమిటీగా ఏర్పడి నిర్మాతల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వారికి సమంజస మనిపించిన మేరకు ఫిలిం మంజూరు చేసేవారు.

ఈ దరఖాస్తుదారు వారం వారం జరిగే కమిటీ ముందు హాజరయి తమ అవసరాలను వివరించటంతోపాటు కమిటీ సభ్యులడిగే ప్రశ్నలకు జవాబు చెప్పి సమర్థించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సందర్భంగా చాలామంది నిర్మాతలకు అవమానాలు ఎదురయ్యాయి. ఆ విషయాలు కొంతమంది మిత్రులు నాకు వివరించారు. ఈ సందర్భంలో నా స్వానుభవం ఒకటి ఉదహరించాలి. నా తొలిచిత్రం 'మంగమ్మ శపథం' విడుదలకు పంపిణీదారులు అవసరాల రీత్యా ముప్పై ప్రింటులు కావాల్సి ఉన్నా నేను వాటిని ఇరవై నాలుగు ప్రింట్‌లకు నియంత్రించి దరఖాస్తు చేశాను. ఆ దరఖాస్తు పరిశీలనా సమయంలో ఆ కమిటీ ముందు హాజరయ్యాను. అప్పుడు కమిటీ పెద్దలలో ఒకరైన ఒక దర్శక, నిర్మాత పది మంది సభ్యుల ముందు నన్ను "ఎవరిని అడిగి 24 ప్రింట్లతో సినిమాని విడుదల చేయాలని నిర్ణయించారు?" అని ప్రశ్నించారు. అందులో అడిగేవారికి చెప్పేవారు లోకువ అనే ధోరణి నాకు కన్పించింది. ఆ ప్రశ్నకు ధీటుగా నేను ఆ పెద్దమనిషిని "మీరు ఎవరిని అడిగి మీ చిత్రాన్ని 30 ప్రింట్లతో విడుదల చేశారు?" అని ఎదురు ప్రశ్న వేశాను. ఊహించని నా ఎదురు ప్రశ్నకు ఆయన దగ్గర జవాబు



'పిడుగురాముడు' పాటల రికార్డింగ్ సందర్భంగా...



'తిక్క శంకరయ్య' ప్రారంభోత్సవ సందర్భంలో చిత్రపరిశ్రమకు చెందిన ప్రముఖులు నాగిరెడ్డి, ఎల్.వి. ప్రసాద్, కె.ఎల్.ఎన్. రాజు, ఎన్.ఎస్. మూర్తి, సుందర్‌లాల్ నహతా

కరువయింది. మిగతా సభ్యులు సర్దుబాటు చేస్తూ మీ చిత్రం పెద్దది కాబట్టి అన్ని ప్రింట్లు సమంజసం అంటూ సమర్థించారు. ఈ సంవాదం పరిశ్రమ వర్గాల్లో ఒక సంచలనం కలిగించటమే కాక చిన్న నిర్మాతల్లో ధైర్యాన్ని, ఉత్సాహాన్ని నింపింది. తర్వాత నాగిరెడ్డిగారూ కూడా ఈ విషయం తెలుసుకొని నన్ను అభినందించారు.

ఇలా ఉండగా **1966**లో 'సౌత్ ఇండియా ఫిలిం ఛాంబర్' కు జరిగిన ఎలక్షన్స్‌లో నన్ను కార్యదర్శిగా ఎన్నుకొన్నారు. విజయా నాగిరెడ్డి వంటి పెద్దల ప్రోత్సాహం లభించింది. ఆనాటి నుంచి ఈనాటి వరకు ఆ సంస్థతో నా అనుబంధం కొనసాగుతూనే ఉంది. ఆ సంస్థ పరంగా నేను కార్యదర్శిగానూ, అధ్యక్షుని హోదాలోనూ అందించిన సేవలకు నాలుగు భాషలకు చెందిన నిర్మాతలు ఇప్పటికీ నన్ను గౌరవిస్తూనే ఉన్నారు.

☆☆☆

మా సంస్థ రెండో చిత్రంగా 'పిడుగు రాముడు' అనే చిత్రాన్ని **1966**లో నిర్మించాము. శ్రీ రామారావుగారు, రాజశ్రీ ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రానికి విఠలాచార్యగారే దర్శకులు. ఆ చిత్రం పది వారాలకుపైగా ప్రదర్శించబడి లాభాలు సంపాదించి పెట్టింది. అంతేకాదు టి.వి.రాజు, సి. నారాయణరెడ్డి కాంబినేషన్‌లో పాటలన్నీ హిట్టయ్యాయి.

మూడవ చిత్రంగా హాస్యరసానికి ప్రాధాన్యత ఇచ్చి 'తిక్కశంకరయ్య' నిర్మించాము. ఇందులో శ్రీరామారావు గారు ద్విపాత్రాభినయం కాగా జయలలిత, కృష్ణకుమారి కథానాయికలు, యోగానంద్ దర్శకుడు, సంగీతం టి.వి.రాజుగారే. దీంట్లో విలన్‌గా నాగభూషణం నటించగా ఆయన ప్రక్కన అసిస్టెంటుగా ఉంటూ విలన్‌కే వ్యతిరేకంగా కథను నడిపించే నక్కజిత్తుల పాత్రను అల్లు రామలింగయ్య చక్కగా పోషించారు. ఈ చిత్రం కూడా ప్రజాదరణపొందింది.



'తిక్క శంకరయ్య' ప్రారంభోత్సవ సందర్భంగా సినీరంగానికి చెందిన అతిరథ మహారథులు
యన్.టి.ఆర్, సినారె, యు. విశ్వేశ్వరరావు, టి.వి. రాజు, త్రివిక్రమరావు, డి.వి.ఎస్. రాజు, పద్మనాభం, మొ॥వారు

నాకు ఎందుకో జానపద కథలంటే ఎంతో అభిమానం. బహుశా ప్రేక్షకుల్ని మూడు గంటలసేపు మంత్ర ముగ్దుల్ని చేసి కట్టి పడేసే శక్తి వాటికి ఉందని నమ్మడమే ఇందుకు కారణం కావచ్చు.

రాజులు కుట్రలు, కుతంత్రాలు, ఎత్తుగడలు, సాహస పోరాటాలు, గుఱ్ఱపుస్వారీలు ఇవన్నీ సామాన్య ప్రేక్షకుడికి అత్యంత వినోదాన్ని అందిస్తాయి.

ఈ భావంతో నాలుగవ చిత్రంగా 'గండికోట రహస్యం' అనే జానపదం భారీ ఎత్తున నిర్మించాము. దర్శకుడు, గీతరచయిత, సంగీత దర్శకుడు (విఠలాచార్య, సి.నా.రె. టి.వి.రాజు) పాతవారే. ఎన్.టి.ఆర్. ద్విపాత్రాభినయం చేయగా దేవిక, జయలలిత హీరోయిన్లుగా నటించారు. ఇది కూడా అఖండ విజయం సాధించింది. ఈ చిత్రాలలోని పాటలు కూడా విపరీతంగా ప్రజాదరణపొందాయి. ఇక్కడో విషయం ప్రస్తావించాలి. ఎన్.టి.ఆర్. నటజీవితాన్ని పరిశీలిస్తే బయటి నిర్మాతలు తీసిన చిత్రాలలో పోల్చినపుడు మా సంస్థ నిర్మించిన చిత్రాలు మూడింటిలో (మంగమ్మ శపథం, తిక్కశంకరయ్య, గండికోట రహస్యం) ద్విపాత్రాభినయం చేయటమే కాక తన అద్భుత నటనతో ఆ చిత్ర విజయాలకు కారకులయ్యారు. ఆ విధంగా మా డి.వి.యస్. ప్రొడక్షన్ సంస్థ పేరు అటు ప్రేక్షకుల హృదయాలలోనూ, ఇటు సినీ పరిశ్రమలోనూ బాగా నాటుకు పోయింది.

☆☆☆

**దేశ రక్షణ నిధి :**

అదో మహాప్రస్తానం. 1952 ప్రాంతంలో రాయలసీమ కరువు కోరల్లో చిక్కుకొని విలవిల్లాడింది. అప్పుడు శ్రీ ఎన్.టి. రామారావు గారి ఆధ్వర్యంలో ఆంధ్ర దేశంలో కొన్నిచోట్ల కళారూపాలు ప్రదర్శించి నిధులు సేకరించి క్షామ నివారణనిధిగా దానిని వారికి అందజేశారు.

1964-65 లో భారత-పాకిస్తాన్ యుద్ధం వచ్చింది. వీర జవానుల సహాయార్ధం శ్రీ రామారావు గారు తిరిగి ఉద్యమించి పలు కేంద్రాలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి 'ఎన్.టి.ఆర్. డిఫెన్సు ఫండు' పేరిట సహాయాన్ని అందజేయాలనుకున్నారు. దీనికి తోటి కళాకారులు, సాంకేతిక నిపుణులు సహకారంతో కొన్ని కేంద్రాలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నాటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డిగారు ప్రభుత్వం తరపు నుంచి పూర్తి సహకారాన్ని అందజేస్తామని హామీ ఇచ్చారు.

నేనూ త్రివిక్రమరావు గారు కలిసి కొన్ని ముఖ్య పట్టణాలకు వెళ్ళి ప్రోగ్రామ్‌లు నిర్వహించటానికి అనువుగా స్థానిక ప్రముఖులతో కమిటీలు ఏర్పాటు చేశాము.

తిరుపతిలో శ్రీ ఎన్.సి. చెంగల్రావు నాయుడు, కర్నూలులో శ్రీ కోట్ల విజయభాస్కర్ రెడ్డి (జిల్లా పరిషత్ చైర్మన్), భీమవరంలో శ్రీ కనకరాజు (జిల్లాపరిషత్ చైర్మన్), రాజమండ్రిలో శ్రీ భావరాజు (అశోకా టాకీసు యజమాని), విజయవాడలో శ్రీ రామక్రిష్ణారావు (లక్ష్మి టాకీస్ అధినేత) ఆ కమిటీలకు అధ్యక్షులుగాను, గుంటూరులోనూ, బందరులోనూ ఆయా జిల్లాల కలక్టర్లే అధ్యక్షులుగా వ్యవహరించారు.

మేము రెండు, మూడు వారాల పాటు పర్యటించి అన్ని చోట్ల కళాకారులకు ఉండటానికి వసతి, భోజన సదుపాయాలు గూర్చి తగు ఏర్పాట్లు చేసి మద్రాసు చేరాము. అప్పటికి శ్రీ రామారావు గారు, శ్రీ పుండరీకాక్షయ్యగార్ల పర్యవేక్షణలో నాటకాలు, నృత్య ప్రదర్శనలు - వాటి గురించి రిహార్సల్సు చేస్తుండేవారు.

క్రమశిక్షణకు మారు పేరు శ్రీరామారావుగారు. ఈ కార్యక్రమాల సక్రమ నిర్వహణకోసం ఒక్కో విభాగానికి సమర్థులైన వారిని ఇన్‌ఛార్జిగా నియమించారు. భోజన వసతి, సదుపాయాలకు శ్రీయుతులు బి.ఏ. సుబ్బారావు, శ్రీధర్‌రావు, మిద్దే జగన్నాథరావు, ఫైనాన్స్ విభాగానికి

విఠలాచార్య, యస్.భావనారాయణ, ట్రాన్స్‌పోర్ట్ విభాగానికి డి. రామానాయుడు, స్టేజ్ కంట్రోలర్‌గా డి.ఏల్. నారాయణ, సాంస్కృతిక కార్యక్రమాలను పుండరీకాక్షయ్య, మొత్తం అన్ని కమిటీలకు సమన్వయకర్తగా నాకూ బాధ్యతలు అప్పజెప్పారు. నేను మద్రాసు నుంచే వివిధ కేంద్రాలలో ఉన్న కమిటీల వారితో ఉత్తర, ప్రత్యుత్తరాల ద్వారా పరిస్థితులను సమన్వయపరుస్తూ పర్యవేక్షించేవాడిని. నాకు రామారావు గారి బావమరిది అయిన రుక్మాంగదరావు సహకరిస్తుండేవారు.

ఈ సాంస్కృతిక యాత్రా కార్యక్రమానికి కొన్ని బస్సులు మరికొన్ని లారీలు, యన్.టి.ఆర్. పై అభిమానం ఉన్నవారు కొందరు తమ సొంత కార్లలోనూ ఒక కాన్వాయ్‌గా ఏర్పడి ఎక్కడా ఒడిదుడుకులు లేకుండా కార్యక్రమాల్ని విజయవంతంగా పూర్తి చేసుకొని తిరిగి రావటం సినీ పరిశ్రమలో ఒక చారిత్రాత్మక సంఘటనగా అభివర్ణించవచ్చు.

మా బృందం మద్రాసు నుంచి బయలుదేరే రోజు తెల్లవారు ఝామున శ్రీ యమ్.జి. రామచంద్రన్, యన్.టి.ఆర్. గారి ఇంటికి వచ్చి బృందంలోని సభ్యులందరుకూ పూలమాలలు వేసి ఉత్సాహపరచి శుభాకాంక్షలు అందజేశారు.

శ్రీ రామారావుగారు ఒక ప్రత్యేకమైన బస్సులో డ్రైవర్ ప్రక్కనున్న సీట్లో కూర్చొగా మిగతా కళాకారులందరూ అదే బస్సులో ప్రయాణం. ఆరోగ్య రీత్యా బస్సులో ఎక్కువ దూరం ప్రయాణం చేయలేని వారు సైతం రామారావుగారి క్రమశిక్షణచూసి వారితో కలిసి ప్రయాణం చేసి సహకరించారు.

ఈ కళాకారులు బృందానికి రక్షణగా ఫైట్ మాస్టర్ సాంబశివరావు ఆధ్వర్యంలో యాభైమంది వాలంటీర్లు ప్రయాణం జరిగినంత కాలం వెన్నంటి ఉన్నారు.

ఇహ ఈ టీమ్ దినచర్య...

ఉదయం ఏడు గంటలకల్లా స్నానాదికాలు ముగించుకొని స్ట్రీట్ ర్యాలీకి కళాకారులు సిద్ధమై ఉండాలి. లారీల్లోనూ, జీపుల్లోనూ వారందరూ పట్టణంలోని ప్రతివీధి తిరుగుతూ జోలె పట్టి నిధులు సేకరించటం మొదటి లారీ బ్యానెట్ పై శ్రీ రామారావుగారు జోలె పట్టుకుని కూర్చొని ప్రజలకు, అభిమానులకు అభివాదం చేస్తూ ముందుకు దూసుకుపోయేవారు. పుండరీకాక్షయ్యగారి సోదరులు శ్రీ బలరామ్‌గారు వారిని వెన్నంటి ఉండేవారు. ఆ బ్యానట్‌పై నుంచే అప్పుడప్పుడు శ్రీ రామారావు గారిచ్చే ఉపన్యాసాలు ప్రజల్ని ఉత్తేజితుల్ని చేసేవి. ఆ ఉపన్యాసాలలో నిధి పోగు చేయటమే కాక దేశ క్లిష్ట పరిస్థితిని వివరించి ప్రజలను కార్యోన్ముఖులుగా చేయటమే తన ఉద్దేశమని, సరిహద్దులో ప్రాణాలొడ్డి దేశ రక్షణచేపట్టిన వీరజవానులకు ఈ దేశ పౌరులుగా మనం అందించే అండదండలు నైతికంగా వారికి ఉత్తేజాన్ని యిస్తాయని ఉద్బోధించేవారు.

ఈ కార్యక్రమానికి నేల ఈనినట్టు జనం వచ్చేవారు. పెద్దా, చిన్నా తారతమ్యం లేకుండా తమ శక్తి మేరకు సొమ్మును, వస్తు సామాగ్రిని సమర్పించేవారు. పలు ప్రాంతాలలో మహిళలు తమ వంటి మీది బంగారు ఆభరణాలను శ్రీ రామారావుగారి జోలెలో వేసేవారు. ఒక చోట ఒక బీద యువతి తనకు వేరే వస్తువులు లేక ఉన్న మంగళ సూత్రాన్ని తీసి జోలెలో వెయ్యపోగా రామారావుగారు సున్నితంగా నివారించి ఆమె అభిమానమే ఎంతో విలువైనది అభినందించారు. ఆ విధంగా స్ట్రీట్ ర్యాలీ కార్యక్రమం మధ్యాహ్నం వరకు కొనసాగేది. వారంతా స్ట్రీట్ ర్యాలీకి తరలి వెళ్ళగా నేను మాత్రం సాయంత్రం జరగ వలసిన కార్యక్రమ ఏర్పాట్లు కోసం ఆ సభలో పాల్గొనే అతిథులు, అధికార్లను కలవటానికి, వేదికపై అలంకరణలను పర్యవేక్షించటానికి వెళ్ళేవాణ్ని.

భోజనానంతరం ప్రజలు విరాళంగా ఇచ్చిన పైకాన్ని, నోట్లను నాణేలను విఠలాచార్య, భావనారాయణపర్యవేక్షణలో ఓ పదిమంది బృందం లెక్కించి మాకు అందజేసేవారు.

సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆరు గంటల వరకు పట్టణ ప్రముఖుల ఆహ్వానాన్ని పురస్కరించుకొని వారి వారి సంస్థలకు, ఇళ్ళకు, కార్యాలయాలకు వెళ్ళి విరాళాలు అందుకునేవారు. కనీసం వెయ్యి రూపాయలకు తక్కువ కాకుండా నిధిని ఇచ్చేవారి ఇళ్ళకు వెళ్ళటంలో ప్రాధాన్యత లభించేది. ప్రతి కేంద్రంలోనూ, ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు ముందుకు వచ్చి సహకరించేవారు. ప్రత్యేకించి విజయా పిక్చర్స్ అధినేత శ్రీ పూర్ణచంద్రరావు, వారి కుమారులు భాస్కరరావు, శ్రీ సూరిరెడ్డి వెంకటరామయ్య వారి కుమారులు, విజయా మేనేజర్ సత్యంగారు - వీరంతా శ్రీ రామారావుగారికి అందించిన సహకారం మరువలేనిది. ఆరు గంటల కల్లా అందరూ ముందుగా ఏర్పాటు చేసిన సభావేదిక వద్దకు చేరుకొని మేకప్ వగైరాలు పూర్తి చేసుకొని ప్రదర్శన ప్రారంభించేవారు. సైనిక దుస్తుల్లో ఉన్న శ్రీ రామారావుగారు ఆడిటోరియంలోకి వెళ్ళి ప్రేక్షకులు ఇచ్చిన నిధిని కూడా సేకరించేవారు. ప్రతి కార్యక్రమంలో పట్టణంలోని ప్రముఖులు ముఖ్య అతిథులు గా వచ్చేవారు. ఇంచుమించుగా ప్రతి సభలోనూ నేను స్వాగతం చెప్పగా శ్రీ రామారావుగారు విపులంగా ప్రసంగించేవారు. తరువాత ముఖ్య అతిథులు మాట్లాడేవారు. ఆ తరువాత సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభమయ్యేవి.

శ్రీ రామారావుగారు ముందుగా రూపొందించిన బ్లూ ప్రింట్ ప్రకారం వేదిక మీద ఏవిధమైన మార్పులు చేర్పులు లేకుండా సాంస్కృతిక కార్యక్రమాలు క్రమపద్ధతిలో కొనసాగేవి. ఈ కార్యక్రమంలో పరిశ్రమలోని ప్రముఖ నటీనటులు అందరు పాల్గొనేవారు. శ్రీ ఘంటసాల వారి సంగీత విభావరి కూడా ఉండేది. ఈ కార్యక్రమాలు రాత్రి ఒంటి గంట వరకు

కొనసాగేవి. తరువాత భోజనాలు ఆ వెంటనే ఏర్పాట్లు చేసిన విడిదిలో కేవలం మూడు నాలుగు గంటలు మాత్రమే విశ్రాంతి తీసుకుని తిరిగి ఉదయం ఏడు గంటలకు స్నానాదికాలు ముగించుకొని తదుపరి కేంద్రానికి ప్రయాణం సాగేది. రాత్రి ఒంటి గంటకు వేదిక సామగ్రి అంతా కేంద్రీకరించి ఒక లారీలో శ్రీ డి.యల్. నారాయణగారి పర్యవేక్షణలో తరలించి మరుసటి రోజు జరగబోయే కార్యక్రమానికి వేదికను సిద్ధం చేసేవారు.

మేము వెళ్ళిన ప్రతిచోటా ఒకే రూములో మూడు పడకలు ఉండేలా ఏర్పాట్లు చేయించాలని శ్రీ రామారావుగారి సూచనలు. అందులో ఆయన, వారి సోదరులు త్రివిక్రమరావుగారు నేను ఉండేవాళ్ళం. ప్రతి రోజు రాత్రి కార్యక్రమమంతా పూర్తి అయ్యాక రూములో ముగ్గురం జరిగిన దాన్ని సమీక్షించుకొని జరగబోయే కార్యక్రమం గూర్చి పథక రచన చేసేవారము.

క్రమశిక్షణ గూర్చి ఇది మాకు అవసరం అనిపించింది. నాకు ఇప్పటికీ బాగా జ్ఞాపకం - రాత్రి రెండు గంటలకు చర్చలు ముగిసాక రామారావుగారు వారి సోదరులు, నేను నిద్రపోయాక నిద్రకు ఉపక్రమించేవారు. రామారావు గారికి ఎంత లేటుగా పడుకున్నా తెల్లవారు జామున 4 గంటలకు నిద్రలేవటం అలవాటు. వారు నిద్ర లేచి, మా ఇద్దరికి నిద్రా భంగం కలగకుండా, లైటు కూడా వేయకుండా ఆయన స్నానాదికాలు పూర్తిచేసుకొనేవారు. ఒక్కొక్క సారి నేను అటు ఇటు కదలటం చూసి ఆయన "మీకు నిద్రా భంగం చేశానా రాజుగారూ" అనేవారు. దానికి బదులుగా "కాదండి అసలు నిద్రపడితేకదా" అనేవాడిని. "అయ్యయ్యో అలా అయితే ఎలా? మీ ఆరోగ్యం పాడయిపోతుందే" అని నొచ్చుకునేవారు. అన్ని కేంద్రాలలోను ఇంచుమించుగా ఇదే మా దినచర్య. ఇవన్నీ పూర్తి చేసుకొని ఆఖరి ప్రోగ్రాం హైదరాబాదులో పెట్టుకున్నాం. నాటి ప్రధానమంత్రి లాల్ బహుదూర్ శాస్త్రి గారు ముఖ్య అతిథి. నాటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానంద రెడ్డిగారి అధ్యక్షతన పెద్ద ఎత్తున ఘనంగా సభ జరిగింది. ఆనాటి మధుర స్మృతి

ఇప్పటికీ కళ్ళకు కట్టినట్టుగా కనిపిస్తుంది. అన్ని కేంద్రాలలో వసూలైన చిల్లర నాణాలు తరువాత, కరెన్సీ నోట్లు, వస్తు సామగ్రి మొత్తానికి ఒక డ్రాఫ్టు రూపంగా యుద్ధ నిధికి శ్రీరామారావుగారు స్వయంగా ప్రధానికి అందజేశారు.

లాల్ బహదూర్ శాస్త్రిగారు చాలా ప్రశాంతంగా కనిపించే వ్యక్తి. అటువంటి ఆయన శ్రీరామారావు గారు నిర్వహించిన యుద్ధనిధి కార్యక్రమాన్ని ప్రశంసిస్తూ దేశభక్తిని ప్రబోధిస్తూ ఆవేశపూరితమైన ప్రసంగం చేశారు. అదే విధంగా శ్రీ బ్రహ్మానందరెడ్డి గారు మన రాష్ట్రంలో ఇటువంటి మంచి ప్రయత్నం జరిగినందుకు హర్షం వ్యక్తం చేసారు. ఆ మర్నాడు శ్రీ కాసుబ్రహ్మానందరెడ్డి గారు వారి ఇంటి వద్ద అందరికీ విందు భోజనం ఏర్పాటు ఏర్పాటు చేసి ఆ యజ్ఞంలో పాల్గొన్న ప్రతి ఒక్కరిని అభినందించారు.

ఇదే విధంగా శ్రీ రామారావుగారు 'సైక్లోన్ రిలీఫ్ ఫండ్' కోసం మూడుసార్లు, 'పోలీస్ వెల్ఫేర్ ఫండ్' సేకరణకోసం ఒకసారి, మార్కాపురంలో కాలేజీ ఏర్పాటుకోసం ఒకసారి కార్యక్రమం నిర్వహించారు. సేకరించిన నిధిని ప్రభుత్వానికి జమకడుతూ వ్యాపారస్థులు ఉదారంగా వస్తురేపేణా ఇచ్చిన సామగ్రిని (దుస్తులు, వంటసామాగ్రి, ఇతర గృహోపకరణాలు) 'రామక్రిష్ణ మిషన్' ద్వారా బాధితులకు పంపిణీ చేసారు. విజయవాడలో అగ్ని బాధితుల సహాయార్థం శ్రీ రామారావుగారు లక్ష రూపాయల విరాళం అందజేశారు.

మదరాసులో కామరాజు గ్రౌండ్స్‌లో 'సైక్లోన్ రిలీఫ్ ఫండ్' కోసం కార్యక్రమం నిర్వహించగా దానికి తమిళనాడు ముఖ్యమంత్రి కరుణానిధి స్వయంగా వచ్చి అభినందించారు. ఈ నిధి సేకరణకార్యక్రమాల్లో ప్రభుత్వానికి సంబంధించిన అన్ని విభాగాల్లోనూ ప్రత్యేకించి పోలీసు శాఖ వారు, ఆయా ప్రాంతాల్లో ఉన్న ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్స్ సహకరించేవారు.

**1971** ప్రాంతాల్లో శ్రీ పి.వి. నరసింహారావుగారు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పదవీబాధ్యతలు చేపట్టాక వారిని మద్రాసు ఆహ్వానించి



దేశరక్షణ నిధి సాంస్కృతిక యాత్రలో



దేశరక్షణ నిధిని యన్.టి.ఆర్ నాటి ప్రధానమంత్రి శ్రీ లాల్‌బహదూర్ శాస్త్రిగారికి అందజేయగా శ్రీ రాజుగారు నివేదిక సమర్పిస్తున్న దృశ్యం

ఫిలిం పరిశ్రమ ప్రముఖులంతా వారిని ఘనంగా సత్కరించారు. పరిశ్రమకు చెందిన పలు సమస్యల్ని వారి దృష్టికి తీసుకురాగా వారు సానుకూలంగా స్పందించారు.

**శ్రీ ఎన్.టి.ఆర్. - శ్రీ ఎ.ఎన్.ఆర్. సైక్లోన్ రిలీఫ్ ఫండ్ :**

1979లో దివిసీమలో ఉప్పెన ముంచుకు వచ్చి కొన్ని గ్రామాలు కొట్టుకుపోవడం, వేలాది మంది మరణించటం జరిగింది. ఆపదలో వున్న కుటుంబాలను ఆదుకోవటం కోసం శ్రీ యన్.టి. రామారావు, శ్రీ అక్కినేని నాగేశ్వరరావులు కలసి కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించి ఆ విషయాన్ని నాటి ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు గారికి తెలియజేసారు. వారు సంతోషంతో ఆమోదించారు. వారు ఆ నిర్ణయం తీసుకొన్ని రోజున నా సొంత చిత్రం 'కాలాంతకులు' షూటింగ్ కోసం ఊటీలో ఉన్నాను. శ్రీ రామారావు గారు నాకు ఫోన్ చేసి వారి నిర్ణయాన్ని తెలిపి 'మీ సహకారం ఎప్పటిలాగే ఇప్పుడు కావాలి మీరు షూటింగ్‌లో బిజీగా ఉన్నట్లున్నారు మరి ఎలా?' అన్నారు. నేను షూటింగ్ కార్యక్రమాలు మా వాళ్లకు ఒప్పజెప్పి వెంటనే మద్రాసు మీదుగా హైద్రాబాదుకు వచ్చి ఆ బృహత్ కార్యనిర్వహణలో పాలుపంచుకొన్నాను.

ఈ కార్యక్రమం కూడా ఆంధ్రప్రదేశ్‌లోని అనేక ముఖ్యపట్టణాల్లో ఎంతో విజయవంతంగా జరిగింది. గతంలో ఈ తరహా కార్యక్రమాల్లో పాల్గొనని శ్రీ నాగేశ్వరరావు గారూ ఈ సారి ఈ కార్యక్రమంలో పాల్గొనటంతో ఒక క్రొత్తదనం సంతరించుకొంది. శ్రీ నాగేశ్వరరావు గారు సహజసిద్ధమైన ధోరణిలో కబుర్లతో, జోకులతో, ఛలోక్తులతో మా శ్రమను మరచిపోయేలా చేసేవారు. సహజంగా అందరితో కలిసి బస్సులో ప్రయాణం చేసినా నాగేశ్వరరావుగారు అప్పుడప్పుడు బస్సులో ప్రయాణం చేయలేక నా కారులోకి వచ్చేవారు. మా ప్రయాణం చాలా జువియల్‌గా జరిగేది.



తమిళనాడుకు మూడవసారి ముఖ్యమంత్రిగా ఎన్నికైన
శ్రీ కరుణానిధిగారిని అభినందిస్తున్న దృశ్యం



పి.వి. నరసింహారావు ముఖ్యమంత్రిగా పదవీబాధ్యతలు స్వీకరించాక
అభినందనలు అందజేస్తూ...



సైక్లోన్ రిలీఫ్ ఫండ్ కార్యక్రమ ప్రారంభోత్సవంలో రథసారథులు యన్.టి.ఆర్, ఏ.ఎన్.ఆర్

ఈ విధంగా మహామహులందరితో కలిసి సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తిగా ప్రజాసేవా కార్యక్రమాల్లో పాల్గొని కీలకమైన పాత్ర నిర్వహించే అవకాశం రావటం నా అదృష్టంగా భావిస్తూ ఉంటాను. ఎంతో నమ్మకంతో అంతటి గురుతర భాద్యత నాపై ఉంచిన శ్రీ రామారావుగారిని మరచిపోలేను.

☆☆☆

**తెలుగు ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ :**

1975 ప్రాంతంలో చాలామంది తెలుగు నిర్మాతలు చిత్ర నిర్మాణవ్యయం అంచనాలకు మించి పెరుగుతుండటం పట్ల ఎంతో ఆందోళన చెందారు. నటీనటులకు సంబంధించి వారి పర్సనల్ మేకప్‌మేన్, పర్సనల్ కాస్టూమర్ ఇతరత్రా రెమ్యునరేషన్స్ ప్రధాన సమస్యగా మారింది. దీనిని ఎలా ఎదుర్కొవాలి అనే భావం నిర్మాతలో రాగా అందరూ ఐక్యంగా అంకిత భావంతో పనిచేసే విధంగా తెలుగు చిత్ర నిర్మాతలకు ఒక ప్రత్యేక సంఘం ఉండాలని భావించారు. ఆ దిశగా జరిగిన సమావేశానికి శ్రీయుతులు త్రివిక్రమరావు, విఠలాచార్య, భావనారాయణ, అట్లూరి పూర్ణచంద్రరావు, జి. హనుమంతరావు, కె. చటర్జీ, యం.యస్.రెడ్డి, కె. రాఘవ వంటి ఎందరో ప్రముఖ నిర్మాతలు ఎంతో ఉత్సాహంతో పాల్గొన్నారు. ఫలితంగా 'తెలుగు చలన చిత్రనిర్మాతల మండలి' ఆవిర్భవించింది. నేను అధ్యక్షునిగా శ్రీ యం.యస్. రెడ్డిగారు ఉపాధ్యక్షునిగా శ్రీ జి. హనుమంతరావు, శ్రీ ఎ. పూర్ణచంద్రరావు కార్యదర్శులుగా శ్రీ కె. రాఘవ కోశాధికారిగా మరికొంతమంది ప్రముఖ నిర్మాతలు కార్యవర్గ సభ్యులుగా కార్యనిర్వాహక వర్గం ఏర్పడింది. అప్పటి ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావుగారిని మద్రాసు ఆహ్వానించాము. మా తండ్రి శ్రీ బలరామ రాజు గారికి శ్రీ వెంగళరావు గారు ఆప్తులు. ఆ విధంగా వారితో సాన్నిహిత్యం ఉంది. వారు వచ్చి 'తెలుగు నిర్మాతల మండలి' నూతన కార్యాలయం


ప్రారంభించారు. అప్పట్లో చిత్ర నిర్మాణంలో ఏర్పడ్డ ఒడిదుడుకులు సవరించుకోవటానికి అందరూ ఏకోన్ముఖులై మంచి ఫలితాలు సాధించారు.

☆☆☆

తెలుగు చలనచిత్ర పరిశ్రమ మద్రాసు నుండి హైద్రాబాద్‌కు తరలింపు దిశగా జరిగిన పరిణామాలలో ముందుగా చెప్పుకోదగ్గది శ్రీ రామక్రిష్ణప్రసాద్ గారి నేతృత్వంలో సారథీ స్టూడియో నిర్మాణం. అక్కడ ప్రముఖ నటులైన శ్రీ నాగేశ్వరరావుగారితో పాటు శ్రీ రామారావుగారు నటించిన చిత్రాలు కూడా కొన్ని నిర్మించారు. ప్రత్యేకించి శ్రీ నాగేశ్వరరావు గారితో చిత్రాలు నిర్మించే శ్రీ దుక్కిపాటి మధుసూదనరావుగారు, శ్రీ పి. పుల్లయ్యగారు, జగపతి రాజేంద్రప్రసాద్ గారు, పి.ఎ.పి. సుబ్బారావుగారు, శ్రీ సి.వి.ఆర్. ప్రసాద్‌గారు, శ్రీ తమ్మారెడ్డి కృష్ణమూర్తిగారు ఎంతో కృషి చేసారు. నాటి నుంచి మన రాష్ట్రానికి ముఖ్యమంత్రులైన శ్రీ నీలం సంజీవరెడ్డి, శ్రీ కాసుబ్రహ్మానందరెడ్డి, శ్రీ మర్రి చెన్నారెడ్డి, శ్రీ జలగం వెంగళరావు ప్రభృతులు పరిశ్రమ తరలింపుకై తమ వంతు సహకారాన్ని, ప్రోత్సాహాన్ని అందించారు.

## 'సౌత్ ఇండియన్ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్'

నేను తెలుగు చిత్ర నిర్మాతల మండలి అధ్యక్ష పదవితోపాటు 'సౌత్ ఇండియన్ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్'కు కార్యదర్శిగా వ్యవహరించాను. అప్పట్లో చిత్ర నిర్మాతలకు, కార్మికులకు మనస్పర్థలు ఏర్పడి సమ్మెలవల్ల షూటింగులకు అంతరాయం కలిగింది. పెద్దలైన శ్రీ నాగిరెడ్డి, శ్రీ ఎ.వి. ఎమ్ చెట్టియార్, శ్రీ ఎ.ఎల్. శ్రీనివాసన్, భరణీ రామకృష్ణారావు వీరితోపాటు నేను, నా సహచర మిత్రులైన శ్రీయుతులు యు. విశ్వేశ్వరరావు, పి. గంగాధర్ రావు, వి.సి. సుబ్బరామన్, డి. రామానుజమ్ పూనుకొని సమస్య



నాటి తమిళనాడు ముఖ్యమంత్రి శ్రీ యం.జి. రామచంద్రన్‌గారితో చిత్ర పరిశ్రమ సమస్యలు చర్చిస్తున్న శ్రీ డి.వి.ఎస్.

పరిష్కారానికి ప్రయత్నించాము. ఈ దిశగా వివిధ యూనియన్లకు చెందిన నిమయ్ ఘోష్, యం.బి. శ్రీనివాస్, రంగరాజన్ వంటి ప్రతినిధులతో చర్చించగా సమస్యకు పరిష్కారం లభించింది. ఇక్కడ ఒక విషయం ఉదహరించాలి. విజయా-వాహిని స్టూడియోలో కూడా సమ్మె జరిగినప్పుడు రాజకీయ పార్టీలకు చెందిన పెద్దలు జోక్యం చేసుకొన్నారు. దీంతో స్థంభన ఏర్పడింది. అప్పుడు శ్రీ నాగిరెడ్డి గారి ఆధ్వర్యంలో ప్రతి శాఖలోనూ పనిచేసేవారి నుంచి మాత్రమే నాయకులు ఉండాలని వారే ప్రాతినిధ్యం వహించి సమాలోచనల్లో పాల్గొనాలి అనే నిర్ణయం తీసుకొన్నాము. దానితో సుహృద్భావ వాతావరణం ఏర్పడి సమస్య పరిష్కారానికి మార్గం తేలికయింది. దీని కనుగుణంగా ఫిలిం పరిశ్రమలో ఉన్న కార్మిక వర్గాలకు చెందిన వివిధ శాఖల వారితో 'సౌత్ ఇండియన్ ఫిలిం ఎంప్లాయీస్ ఫెడరేషన్' అనే ఒక సంస్థ ఏర్పడింది. ఈ సందర్భంగా నాటి తమిళనాడు ముఖ్యమంత్రి యం.జి. రామచంద్రన్ గారిని కలిసి సమస్యలను వారితో చర్చించాము. వారు దానికి సానుకూలంగా స్పందించారు.

☆☆☆

**ఫిలిం ఇన్‌స్టిట్యూట్ :**

నేను సౌత్ ఇండియన్ ఫిలిం ఛాంబర్ ద్వారా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్న సందర్భంలో చిత్ర నిర్మాణాల సంఖ్య పెరుగుతున్న దృష్ట్యా పరిశ్రమలోకి నూతన నటీనటులు వస్తే బాగుంటుందనే ఆలోచన వచ్చింది. ఇదే భావం మరికొందరిలో కూడా కనిపించింది. అప్పట్లో కేంద్ర ప్రభుత్వం తరఫున పూనాలో ఈ తరహా శిక్షణఇచ్చే 'ఫిలి ఇన్‌స్టిట్యూట్' ఉంది. తమిళనాడులో ప్రభుత్వం తరఫున 'ఫిలిం ఇన్‌స్టిట్యూట్' నిర్వహించబడుతుండేది. తమిళం, హిందీ తప్ప మిగతా భాషల వారికి ఈ రెండు సంస్థలలోకి అవకాశాలు తక్కువగా ఉండేవి.

పరిశ్రమలోకి క్రొత్తవారు రావాలనే భావనతో 'సౌత్ ఇండియన్ ఫిలిం ఛాంబర్' తరఫున ఒక నట శిక్షణాలయం ఏర్పాటు చేయాలని నాటి అధ్యక్షులు శ్రీ నాగిరెడ్డి గారికి సూచించగా ఆయన ఎంతో సంతోషించి ఆ ఏర్పాట్లు చేయమని నన్ను ప్రోత్సహించారు.

వెంటనే 'సౌత్ ఇండియన్ ఫిలిం ఛాంబర్' నిర్వహణలో యాక్టింగ్ స్కూల్‌కు రూపకల్పన చేయటం జరిగింది. దానికి నేను కరస్పాండెంట్‌గా వ్యవహరించాను. అదే సమయంలో అమెరికాలో తర్ఫీదు పొంది వచ్చిన శ్రీ రాజా రాందాసు గారు హైదరాబాదులో ఉన్నారని తెలుసుకొని వారిని సంప్రదించి ఆ నట శిక్షణాలయంకు ప్రిన్సిపాల్ నియమించాము.

తెలుగు, తమిళం, కన్నడ, మళయాళ భాషల్లో నాలుగు విభాగాలుగా ఈ శిక్షణాలయం ఏర్పాటు చేసాము. తెలుగుకు సంబంధించినంత వరకు శ్రీ దేవదాస్ కనకాల ఆయన శ్రీమతి లక్ష్మిదేవి గార్లను శిక్షకులుగా తీసుకొన్నాము. నాలుగు భాషలకు చెందిన వారి నుంచి శిక్షణపొందే నిమిత్తం దరఖాస్తులు ఆహ్వానించి ఇంటర్వ్యూలు ప్రారంభించాము. నాతోపాటు ఆ ఇంటర్వ్యూలో వివిధ భాషలకు చెందిన పెద్దలైన శ్రీ పి. పుల్లయ్య, రాజా రాందాస్ గారు, శ్రీ పంజు, శ్రీ త్రిలోక్‌చందర్, శ్రీ వి.సి. సుబ్బరాయన్ మొదలగు వారు పాల్గొన్నారు. ఈ ఇంటర్వ్యూలో ప్రతి విద్యార్థి తన సమర్థతను నిరూపించుకోవడానికి చిన్న చిన్న సన్నివేశాలను వారికి ఇచ్చి నటించి చూపమని అడిగేవాళ్ళం.

ఈ సందర్భంగా ఒక ప్రత్యేకమైన సంఘటన ఉదహరించాలి. కన్నడ విద్యార్థుల ఇంటర్వ్యూ జరుగుతున్న సమయంలో శివాజీరావు అనే అబ్బాయి ఇంటర్వ్యూకు వచ్చాడు. అందరిలాగానే అతన్ని కూడా చేస్తున్న ఉద్యోగం, కుటుంబ పరిస్థితుల గూర్చి ప్రశ్నించాము. తాను బెంగుళూరులో బస్ కండక్టర్‌గా చేస్తున్నట్లు, తను, తన తల్లి మాత్రమే తన కుటుంబమని వివరించాడు. వెంటనే పి. పుల్లయ్యగారు తన సహజ ధోరణిలో "ఆ, ఇకచాలు

- ఇతని జీవితాన్ని పాడు చేయద్దు. రెండింటికి పనికి రాకుండా పోతాడు." అనే అభిప్రాయం వెలిబుచ్చుతూ నిరుత్సాహ పరిచారు. కన్నడ విభాగంలో కనీసం పదిమంది విద్యార్థులైనా ఉండాలనే అభిప్రాయం మాది. అంతకుముందు ఐదుగురు విద్యార్థులని ఇంటర్వ్యూ చేయగా అందులో ఒక్కరు మాత్రమే సెలక్టు అయ్యారు. అప్పుడు నేను కల్పించుకొని శ్రీ పుల్లయ్య గారితో "దయచేసి ఐదు నిమిషాలపాటు ఆగండి" అని శివాజీరావుని బయట వెయిట్ చెయ్యమని చెప్పాను. అతను బయటకు వెళ్ళాక నేను పుల్లయ్యగారితోనూ, ఇతర సభ్యులతోనూ "వచ్చిన కుర్రాడు ఒడ్డు పొడుగు ఉన్నాడు. మనకు విద్యార్థులు కావాలి కాబట్టి మనం తొందరపడి ఏ నిర్ణయానికి రావద్దు. తిరిగి అతన్ని ఇంటర్వ్యూ చేద్దాము" అనిచెప్పి శివాజీరావును లోపలికి పిలిచాం. శివాజీరావుతో "ఇప్పుడు నువ్వు రెండు సంవత్సరాలు చదవాలి. మరి, నీలో నటుడు కావాలనే బలమైక కాంక్ష ఉన్నదా అని అడుగగా అతను చాల ఆత్మవిశ్వాసంతో అటువంటి కోరిక నాలో ఉంది. అని చెప్పాడు. అప్పుడు నేను అతని ముందు ఒక ప్రతిపాదన ఉంచాను. "నువ్వు బస్ కండక్టర్ అని చెప్పావు. ఉద్యోగానికి రాజీనామా చెయ్యకుండా ఒక సంవత్సరంపాటు లాంగ్ లీవ్ పొందగలవా? అని అడిగాను. "నాకు ఎలిజిబిలిటీ ఉంది. తప్పకుండా శెలవు దొరుకుతుంది". అని చెప్పాడు. అయితే ఆ హామీపై నీకు సీటు ఇస్తాము. మొదటి సంత్సరం కోర్సు పూర్తికాగానే నీవు నటుడిగా పైకి వస్తావనే నమ్మకం మాకు కలిగితే రెండవ సంవత్సరం చదవచ్చు. లేకపోతే తిరిగి ఉద్యోగానికి వెళ్ళొచ్చు" అన్నాము. అతను ఆ ప్రతిపాదనకు అంగీకరించాడు. ఆ విధంగా ఆ రోజున మా శిక్షణాలయంలో చేరి తర్ఫీదు పొందిన శివాజీరావే ఈనాడు తమిళనాడు సూపర్‌స్టార్‌గా వెలుగొందుతున్న రజనీకాంత్.

ఆ తరువాత బ్యాచ్‌లో చిరంజీవి, జి. నారాయణరావు, హరిప్రసాద్, సుధాకర్, శుభలేఖ సుధాకర్, రాజేంద్ర ప్రసాద్, మహర్షి రాఘవ, భానుచందర్, ప్రసాద్‌బాబు మొదలగువారు ఆ నట శిక్షణాలయంలో

శిక్షణపొందినవారే. ఆ సంస్థ నాలుగు సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంలో శ్రీ రాజారాందాస్ గారు ఆరోగ్యం రీత్యా ఉద్యోగ విరమణచేసి వెళ్ళిపోయారు. అప్పుడు రంగస్థలంపై అనుభవం ఉన్న చాట్ల శ్రీరాములుగారి పేరును రాజారాందాస్ గారు సూచించారు. అయితే నాటక రంగంలో బిజీగా ఉండటం వల్ల ఆయన ఆశక్తతను వ్యక్తం చేసారు. మూడవ బ్యాచ్ కోర్సులు జరుగుతుండగా తమిళనాడుకు శ్రీ ఎం.జి. రామచంద్రన్ ముఖ్యమంత్రి కావటం, ఆయన మంత్రి వర్గంలో ప్రముఖ నిర్మాత అయిన శ్రీ ఆర్.యం. వీరప్పన్ సమాచార మంత్రి కావటం జరిగిది.

మా ఫిలిం యాక్టింగ్ స్కూలు దినదినాభివృద్ధి చెందుతూ పరిశ్రమ వర్గాలలోనూ, బయటి వారినుంచి మంచి పేరు సంపాదించుకుంది. ఈ ఇన్‌స్టిట్యూట్ ప్రత్యేకత ఏమిటంటే ప్రముఖ దర్శకులు, సాంకేతిక నిపుణులు వారానికి ఒకరు చొప్పున విజిటింగ్ లెక్చరర్స్‌గా వచ్చి ఉమ్మడి తరగతులు నిర్వహించేవారు. అలా వచ్చిన వారిలో దర్శకులు సి.యస్.రావు, సి.వి. శ్రీధర్, ఎ. భీమ్‌సింగ్, ఎ.సి. త్రిలోకచందర్, కె. విశ్వనాథ్ వంటి ప్రముఖులు ఉన్నారు.

వారితోపాటు మేకప్, స్టంట్, నృత్యం మొదలైన శాఖలకు చెందిన ప్రముఖులు వచ్చి ఆయా రంగాలలో శిక్షణఇచ్చేవారు. వీటన్నిటినీ మించి ప్రతిరోజూ సాయంత్రం యోగ విద్యను అభ్యసించటం కూడా ఉండేది. వీలైనన్ని ఎక్కువ అంశాలతో విద్యార్థులకు అవగాహన కలిగేలా శిక్షణ కొనసాగేది. ప్రత్యేకంగా ప్రాక్టికల్స్ విషయంలో స్టూడియోల్లో జరుగుతున్న షూటింగ్‌లు పరిశీలనా దృక్పథంతో చూడడానికి పంపుతుండేవాళ్ళం. అందువలన నటీనటులు వాచకం, అభినయంతోపాటు, అటు దర్శకత్వం ఇటు కెమెరాకు చెందిన ప్రాథమిక అవగాహన ఏర్పడేందుకు ఇది సహకరించేది. ఆ విధంగా ఈ సంస్థ చాలా ప్రాచుర్యం పొందింది. దీంతో తమిళనాడు ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇన్‌స్టిట్యూట్‌లో నటనా విభాగంలో విద్యార్థులు చేరటం పలచబడి ఆ సంస్థ కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంది.

ప్రభుత్వం తరపున నడుపుతున్న ఒక సంస్థలో నటనా విభాగంలో విద్యార్థులు లేకపోతే దాని పరిణామం ఇతర భోధనా శాఖలపై పడుతుంది. ఇది గమనించిన శ్రీ యం.జి.ఆర్, శ్రీ వీరప్పన్ ఇద్దరూ "మీ ఇన్‌స్టిట్యూట్‌లో పనిచేస్తున్న అధ్యాపకులందరినీ మేము తీసుకొంటాము. మీరు నడుపుతున్న కార్యకలాపాలు మా ఇన్‌స్టిట్యూట్‌లో జరిగేలా చూస్తాము. అంచేత మీరు విడిగా ఇన్‌స్టిట్యూట్ నడపాల్సిన అవసరం లేదు. మాతో సహకరించండి" అంటూ విపరీతమైన వత్తిడి తీసుకు వచ్చారు. 'సౌత్ ఇండియన్ ఫిలిం ఛాంబర్'లో సభ్యులుగా ఉన్న తమిళ నిర్మాతలు కొందరు ఈ సూచనను సమర్థించారు. దాంతో మూడవ బ్యాచ్ శిక్షణ ముగిసేవరకు విజయవంతంగా నిర్వహించి, తదుపరి తమిళనాడు ప్రభుత్వం సూచనను గౌరవించి 'ఫిలిం ఇన్‌స్టిట్యూట్'ను మూసివేశాము.

☆☆☆

**అంతర్జాతీయ చలనచిత్రోత్సవాలు :**

1977-78లో 'సౌత్ ఇండియన్ ఫిలిం చాంబర్'కు నన్ను అధ్యక్షుడిగా ఎన్నుకొన్నారు. అటు 'ఫిలిం ఫెడరేషన్ ఆఫ్ ఇండియా'లో కార్యక్రమాల్లో కూడా చురుకుగా పాల్గొనటంతో నా బాధ్యతలు జాతీయ స్థాయికి విస్తరించబడ్డాయి. ప్రతి యేడు అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలు దేశ రాజధాని ఢిల్లీలో జరగటం ఆనవాయితీ. అయితే ఈ ఉత్సవాలు ఢిల్లీలోనే కాకుండా భారతదేశంలో ఫిలిం పరిశ్రమ విస్తరించిన ఇతర కేంద్రాలలో కూడా జరగాలి, అంటూ మేము ప్రభుత్వంపై వత్తిడి తెచ్చాము. ఫలితంగా 1978లో కాంపిటేటివ్ ఫెస్టివల్ ఢిల్లీలో జరిగితే మరుసటి సంవత్సరం కాంపిటేషన్ లేని పద్ధతిలో 'అంతర్జాతీయ ఫిల్మోత్సవ్' అని నామకరణం చేసి 'ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్'ను తొలిసారిగా మద్రాసులో నిర్వహించాము. దీనికి దక్షిణాది రాష్ట్రాల ఫిలిం పరిశ్రమలోని వారితో పాటు బొంబాయి, కలకత్తా ఫిలిం

పరిశ్రమకు చెందిన ప్రముఖులు కూడా ఎంతగానో సహకరించారు. ఫలితంగా మద్రాసులో ఘనంగా 'ఫిల్మోత్సవ్' నిర్వహించగలిగాము.

ఈ సంఘటనతో సినీ పరిశ్రమ దేశ రాజధాని ఢిల్లీలో లేనందువల్ల అది ఉన్న ఇతర ప్రాంతాలలో ఫిల్మోత్సవాలు నిర్వహించటం బాగుంటుదన్న మా వాదనకు బలం చేకూరింది. ఇందుకు అటు ప్రభుత్వం ఇటు పరిశ్రమ కూడా ఎంతో సంతోషించింది.

☆☆☆

**బ్రహ్మానంద చిత్రపురి :**

చిత్ర పరిశ్రమ మద్రాసు నుంచి హైదరాబాదుకు తరలించే కృషిలో భాగంగా బ్రహ్మానందరెడ్డిగారి హయాంలో హైదరాబాద్-విజయవాడ రహదారిలో హైదరాబాద్ శివార్లలో పరిశ్రమవారి కోసం కొన్ని ఎకరాల స్థలం కేటాయించారు. దీనికి పరిశ్రమ వర్గాలు 'బ్రహ్మానంద చిత్రపురి' అని నామకరణం చేసారు. ఈ చిత్రపురిలో శ్రీ రామారావుగారు, శ్రీ ఎల్.వి. ప్రసాద్ గారు స్టూడియో నిర్మాణం చేపట్టారు. అయినప్పటికీ పరిశ్రమ వర్గాల్లో 'బ్రహ్మానంద చిత్రపురి' నగరానికి చాలా దూరంగా ఉంది కాబట్టి అక్కడ కాకుండా అనుకూలమైనచోట ప్రత్యామ్నాయ స్థలం కావాలన్నారు. దాంతో హైద్రాబాదుకు పరిశ్రమ తరలిరావటం అనే ప్రక్రియ ఊపందుకోలేకపోయింది. ఆ పరిస్థితుల్లో శ్రీ రామారావు, శ్రీ ప్రసాద్‌గారు స్టూడియో నిర్మాణం ఆపివేశారు. శ్రీ వెంగళరావు గారు ముఖ్యమంత్రి అయ్యాక పరిశ్రమ వర్గాలతో చిత్ర పరిశ్రమ హైదరాబాదు తరలింపు గూర్చి సమీక్షించి దాని అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తానన్నారు. అప్పుడు పరిశ్రమ వర్గాల వారు 'బ్రహ్మానంద చిత్రపురి' వ్యవహారాన్ని గూర్చి వివరించి ఆ స్థలం నగరానికి దూరంగా ఉండడం వల్ల ప్రత్యేకించి కార్మిక వర్గానికి రవాణా సౌకర్యం దృష్ట్యా గల కష్టనష్టాలను వివరించి దానికి బదులు

మరోచోట స్థలం కేటాయించవలసిందిగా కోరారు. ఆ దిశగా ప్రయత్నాలు ప్రారంభ మయ్యాయి. అప్పుడే శ్రీ అక్కినేని నాగేశ్వరరావుగారికి అన్నపూర్ణ స్టూడియోస్‌ను నిర్మించటానికి స్థలం మంజూరు చేశారు.

తరువాత శ్రీ వెంగళరావు గారు నాటి ఆర్థిక, సమాచార శాఖామంత్రి శ్రీ పిడతల రంగారెడ్డిగారు ఇప్పుడు ఫిలింనగర్ ఉన్న స్థలాన్ని పరిశ్రమలోని వారికి గృహనిర్మాణ నిమిత్తం సూచించారు. అది కూడా రాళ్ళు, గుట్టలతో నిర్మానుష్యంగా ఉండటం వల్ల ఆ ప్రదేశం కూడా అనువుగా లేదని పరిశ్రమలోని వారు వారికి తెలియజేశాము.

శ్రీ రామారావుగారు ముషీరాబాదు ఏరియాలో కొంతస్థలం ఖరీదుచేసి స్టూడియో నిర్మాణం తలపెట్టారు. అదే 'రామకృష్ణా స్టూడియో'

ఇలా ఉండగా **1978**లో డాక్టర్ మర్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన ప్రమాణస్వీకారం చేసిన తొలిరోజుల్లోనే వారిని శ్రీ అక్కినేని నాగేశ్వరరావుగారు విందుకు ఆహ్వానించారు. ఆ విందులో ఎప్పుడో తలపెట్టిన చిత్రపరిశ్రమ అభివృద్ధి ఆశించిన మేరకు ఎందుకు జరగలేదు అన్న విషయం ప్రస్తావనకు వచ్చింది. అప్పుడు శ్రీ నాగేశ్వరరావుగారు "ఆనాడు మంత్రిగా మీరు ఇచ్చిన ప్రోత్సాహం మరువలేనిది, ఇప్పుడు మీరు ముఖ్యమంత్రి కాబట్టి మాకు మరింతగా మేలు జరగవచ్చు. ఒకసారి మద్రాసు వచ్చి అక్కడ ఉన్న ప్రముఖులను కలిసి చిత్రపరిశ్రమ హైదరాబాదుకు తరలిరావలసిన అవసరాన్ని మీరు విశదపరిస్తే మంచి ఫలితాలు వస్తాయి. మీ హయాంలోనే ఇది జరగాలి." అని అన్నారు.

దానికి చెన్నారెడ్డిగారు స్పందిస్తూ వెంటనే అటువంటి ఏర్పాటు చేయమన్నారు. ఆ మరునాటి ఉదయమే శ్రీ నాగేశ్వరరావుగారు నాకు ఫోన్‌చేసి ఈ విషయాన్ని వివరించి మీరు వెంటనే ముఖ్యమంత్రి గారిని మద్రాసు ఆహ్వానించి పరిశ్రమ పెద్దలతో సమావేశం ఏర్పాటు చేయండి. దీనికి మీరే సమర్థులు అన్నారు. దానికి అనుగుణంగా ముఖ్యమంత్రి గారిని రెండు

రోజుల పాటు మా చిత్రపరిశ్రమను నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొనవలసిందిగా ఆహ్వానించాము. దానికి శ్రీ చెన్నారెడ్డిగారు తమ అంగీకారం తెలుపుతూ రెండు రోజులు మాకు కేటాయించారు.

ఈలోగా తెలుగు చిత్ర నిర్మాతల కార్యాలయంలో పరిశ్రమకు చెందిన పలు శాఖల వారితో శాఖాపరంగా సమావేశాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ ఉద్దేశాలు వారి ముందుంచి పరిశ్రమ హైదరాబాదుకు తరలివెళ్ళటానికి సహకరించాలని కోరుతూ అలా ఎందరు రావటానికి సిద్దంగా ఉన్నది, వారికి కావలసిన గృహవసతి తదితర ఏర్పాట్లు ఏమిటి అనేవి వివరంగా తెలుసుకొన్నాము. ఈ విషయాలన్నిటినీ క్రోడీకరిస్తూ ఒక పుస్తక రూపంలో మెమోరాండం తయారుచేసి ముఖ్యమంత్రి గారికి సమర్పించే విధంగా ఏర్పాటు చేసుకున్నాము. మా ఈ కృషిలో నాతోపాటు శ్రీయుతులు యం.ఎస్. రెడ్డి, యు. విశ్వేశ్వరరావు, పి. పుల్లయ్య, జి. హనుమంత రావు, కె. రాఘవ, ఎ. పూర్ణ చంద్రరావు, రంజిత్ కుమార్ మొదలగు నిర్మాతలు, ప్రభాకర్‌రెడ్డి, కృష్ణంరాజు, గుమ్మడి, జగ్గయ్య, ధూళిపాళ మొదలగు నటీనటులు, మరికొందరు సాంకేతిక నిపుణులు ఎంతగానో సహకరించారు. అనుకున్న ప్రకారం ముఖ్యమంత్రి శ్రీ చెన్నారెడ్డి గారు, నాటి రెవెన్యూమంత్రి శ్రీ ఎన్. జనార్ధన్‌రెడ్డి గారు, మరో మంత్రి శ్రీ జి. వెంకటస్వామి గారు తదితరులతో మద్రాసు విచ్చేశారు. ఆ నాడు మైలపూర్ లోని న్యూ ఉడ్‌ల్యాండ్ హోటల్‌లో పెద్ద సభ ఏర్పాటు చేశాము. ఆ కార్యక్రమంలో శ్రీ రామారావు గారు, శ్రీ నాగేశ్వరరావుగారు, పరిశ్రమలోని అన్ని శాఖలకు చెందిన ప్రతినిధి వర్గాలు పాల్గొని కార్యక్రమము దిగ్విజయం కావటానికి సహకరించారు. ఆనాడు చేసిన ముఖ్య ప్రతిపాదనల్లో కొన్ని...

- సాంకేతికంగా అభివృద్ధి చెందటానికి అంటే స్టూడియోనిర్మాణం, రికార్డింగ్ థియేటర్లు, ఫిలిం లాబరేటరీస్, ఎడిటింగ్ యూనిట్లు వగైరా ఏర్పాటు చేయటానికి యాభై ఎకరాల స్థలం కేటాయించాలి.

- హైదరాబాదులో పరిశ్రమలోని అన్ని వర్గాల వారికి ఒక చోట నివసించేందుకు వీలుగా గృహ నిర్మాణఏర్పాట్లకు కనీసం 100 ఎకరాల స్థలం కేటాయించాలి.

- చిత్ర నిర్మాణానికి అవసరమైన ఆధునిక యంత్ర సామాగ్రితో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు చేసుకోవటానికి తక్కువ వడ్డీతో ఋణసదుపాయం కల్పించాలి.

- ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలలో ప్రభుత్వ పరిధిలోని భవంతులలోనూ, అందమైన అవుట్‌డోర్ లొకేషన్స్‌లోనూ షూటింగ్ జరుపుకోవటానికి అతి తక్కువ రుసుముతో పర్మిషన్‌లు మంజూరు చేయాలి.

- వినోదపు పన్ను తగ్గించాలి.

- థియేటర్లను నిర్మించే వారికి లైసెన్సింగ్ విధానం సరళీకృతం చేయాలి.

- రాష్ట్రంలో తీసిన చిత్రాలకు ప్రభుత్వ పరంగా ఇచ్చే సబ్సిడీ పెంచాలి.

ఈ ప్రతిపాదనలన్నీ ముఖ్యమంత్రికి సమర్పించిన మెమోరాండంలో ఉదహరించాము. మేము కోరినన్నిటినీ శ్రీ చెన్నారెడ్డి గారు ఆమోదిస్తూ ఆలస్యం లేకుండా పరిశ్రమకు చెందిన కొద్దిమంది సభ్యులు వారం రోజులుగా అన్ని వివరాలతో కూడిన ప్రతిపాదనలతో హైద్రాబాదు రావలసిందిగా కోరారు. ప్రభుత్వ పరంగా వివిధ శాఖల అధికారులను పిలిపించి తగు నిర్ణయాలు తీసుకొందామన్నారు. వారి సూచనలకు అనుగుణంగా శ్రీ రామారావు గారు, శ్రీ నాగేశ్వరరావుగారుతో మేమంతా కలిసి విస్తృతంగా చర్చించి తగు ప్రతిపాదనలతో ఆ సమావేశంలో పాల్గొన్నాము. అప్పటికే హైద్రాబాదులో నివాసం ఏర్పరుచుకొన్న శ్రీ దుక్కిపాటి మధుసూదనరావు, శ్రీ తమ్మారెడ్డి కృష్ణమూర్తి, శ్రీ కె.బి. తిలక్, శ్రీ సి.వి. ఆర్. ప్రసాద్ మొదలగు వారు కూడా ఈ చర్చల్లో పాల్గొన్నారు. ప్రభుత్వపరంగా పలు శాఖలకు చెందిన అధికారులు కూడా విచ్చేసారు.

ముఖ్యమంత్రి గారు గ్రీన్‌లాండ్‌లో ఏర్పాటు చేసిన ఆ విస్తృత సమావేశంలో అన్ని సమస్యలు కూలంకషంగా చర్చించాము. దానిపై స్పందించిన శ్రీ చెన్నారెడ్డి గారు వెంటనే తగు చర్యలు తీసుకోవలసిందిగా అధికారులను ఆదేశించారు. పరిశ్రమలోని అన్ని శాఖల నుంచి కలిపి పన్నెండు మందితో ఒక కమిటీని రూపొందించమని - అలాగే అధికారులతో వారొక కమిటీని ఏర్పాటు చేస్తామని, ఆ రెండు కమిటీలు సమన్వయంతో పనిచేసి ఎప్పటికప్పుడు తనకు నివేదికలు అందజేయవలసిందిగా కోరారు. ఆ విధంగా కమిటీలు వేసుకుని ముందడుగు వేశాము.

ఈ దిశగా మంచిఫలితాల కోసం తొందరగా కార్యరూపం దాల్చటానికి మేము తరచుగా హైదరాబాదు వచ్చేవారము. మా ఖర్చులు మేమే భరిస్తూ హోటల్ సరోవర్‌లో ఉంటూ ప్రభుత్వ పరంగా త్వరితగతిని ప్రతిపాదనలు అమలు కావటానికి కృషి చేసాము.


తత్ఫలితంగా రాష్ట్రప్రభుత్వం సినీపరిశ్రమ వారి గృహనిర్మాణ నిమిత్తం జూబ్లీ హిల్స్‌లో 100 ఎకరాల స్థలం కేటాయించారు. అదే విధంగా సాంకేతిక యూనిట్ల స్థాపనకోసం అన్నపూర్ణా స్టూడియో ఎదురుగా 50 ఎకరాలు కేటాయించారు. ఈ స్థలాలను స్వాధీన పరుచుకోవటంలో మేము ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవలసి వచ్చింది. ఇలా ఉండగా సాంకేతిక యూనిట్ల కోసం కేటాయించిన 50 ఎకరాలు ప్రభుత్వానిది కాదు మాది అంటూ కొందరు వ్యక్తులు మేము వేసిన ప్రహరీ కంచెను తీసివేసి గలాటా సృష్టించారు. అందుకు పోలీసులు కూడా ఏమీ చేయలేని నిస్సహాయస్థితి ఏర్పడింది. దీనికి కారణం అందులో ఎంతోమంది ప్రముఖుల, పెద్దల హస్తం ఉందని తెలిసింది. అప్పుడు ఎట్లాగైనా సరే దాన్ని మనం సాధించి తీరాలనే పట్టుదల మాలో పెరిగింది ఈ స్థలం సేకరణవిషయంలో ఏర్పడ్డ అడ్డంకుల్ని అధిగమించటంలో స్థానికంగా ఉన్న దుక్కిపాటి మధుసూదనరావు, కె.బి.తిలక్, కె. రాఘవ, సి.వి.ఆర్. ప్రసాద్, తమ్మారెడ్డి కృష్ణమూర్తి, రంజిత్

కుమార్ వంటి మిత్రులు ప్రధాన పాత్ర వహించారు. ఏమైనా కారణాంతరాల వల్ల శ్రీ చెన్నారెడ్డి గారి సూచనమేరకు ఆ స్థలాన్ని వదులుకోవలసిన పరిస్థితి మాకు ఏర్పడి ప్రత్యామ్నాయ స్థలం కోసం అన్వేషించగా ఇప్పుడు పద్మాలయా, రామానాయుడు స్టూడియోస్ ఉన్న ప్రాంతంలో 50 ఎకరాలు కేటాయించారు. గృహనిర్మాణానికి మంజూరు చేసిన 100 ఎకరాల స్థలం విషయంలో కూడా మేము ప్రతిఘటన ఎదుర్కోవలసి వచ్చింది. ఆ 100 ఎకరాల్లో మాది 50 ఎకరాలు అంటూ జూబ్లీహిల్స్ కోపరేటివ్ సొసైటీ వారు అడ్డుపెట్టారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్ళాము. వారు సొసైటీ వారిని పిలిపించి "మీకు ఎప్పుడో మంజూరు చేసిన స్థలంలో ఏవిధమైన అభివృద్ధి చూపలేదు. కాబట్టి దానిని ప్రభుత్వం ప్రతిపాదించిన విధంగా ఫిలిం పరిశ్రమ వారికి 50 ఎకరాలు ఇవ్వాలి లేకపోతే సొసైటీని రద్దుచేస్తాము" అని హెచ్చరించారు. ఇహ గత్యంతరం లేక సొసైటీ దిగివచ్చి ఆ 50 ఎకరాల్ని చిత్ర పరిశ్రమకు ఇచ్చారు. ఆ స్థలాలకు స్టూడియోలకు ఇచ్చిన విధంగానే నామమాత్రపు ధరను నిర్ణయించారు.


**'ఫిలిం నగర్' నామకరణం :**

పరిశ్రమకు చెందిన మిత్రులతో కలిసి ఆ 100 ఎకరాలలో 1978-79 ప్రాంతాలలో గృహ నిర్మాణం కోసం ఒక సొసైటీని స్థాపించాలనుకొన్నాము. దేశంలో మరెక్కడా లేని విధంగా పెద్ద, చిన్న అనే తారతమ్యం లేకుండా చిత్ర పరిశ్రమ అభివృద్ధిలో భాగం పంచుకునేవారందరూ ఒకే చోట నివసించాలని, అందరుకుతగ్గ ఏర్పాట్లు జరగాలని అనుకున్నాము. దానికి ఏ పేరు పెడితే బాగుంటుందని పలువురు ఆలోచించగా - ఇక్కడ ఫిలిం పరిశ్రమకు చెందిన వారు ఉంటారు కనుక "ఫిలిం నగర్" అనే పేరు బాగుంటుందని నేను సూచించగా అందరూ సంతోషం వెలిబుచ్చి ఆ పేరు ఖాయం చేసారు.

☆☆☆




1979లో ఆంధ్రప్రదేశ్ ఫిలిం ఛేంబర్ ఆఫ్ కామర్స్ ప్రారంభోత్సవ సమయంలో నాటి ముఖ్యమంత్రి శ్రీ చెన్నారెడ్డి, రెవెన్యూ మంత్రి ఎన్. జనార్ధనరెడ్డిలతో అధ్యక్షులు శ్రీ డి.వి.ఎస్.



ఆంధ్రప్రదేశ్ ఫిలిం ఛేంబర్ ఆఫ్ కామర్స్ ఏర్పాటు సందర్భంగా నాటి కార్యవర్గ సభ్యులు

## ఆంధ్రప్రదేశ్ ఫిలిం ఛాంబర్ ఆవిర్భావం :

అప్పట్లో విజయవాడ కేంద్రంగా 'ఆంధ్రా ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్' హైదరాబాద్ కేంద్రంగా 'హైదరాబాద్ స్టేట్ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్' అనే సంస్థలు పనిచేస్తూ ఉండేవి. ఈ రెండు సంస్థలు చిత్ర పంపిణీదారులకు, ఎగ్జిబిటర్స్‌కు తగిన సేవలు అందించేవి. చిత్ర నిర్మాణరంగం హైదరాబాదుకు తరలిరావటం, హైదరాబాదులో అందుకు అనువుగా స్టూడియోలు నిర్మాణం జరుగుతున్న రోజులవి. ఆ తరుణంలో విస్తృత స్థాయిలో హైద్రాబాద్ కేంద్రంగా ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహించే విధంగా ఒక్కటే ఫిలింఛాంబర్ ఉంటే బాగుంటుందనే ఆలోచన వచ్చింది. ఆ విషయాన్ని శ్రీ చెన్నారెడ్డిగారికి చెప్పగా ఆయన ఎంతో సంతోషించారు. ఆ ప్రయత్నంలో మేము విజయవాడ వెళ్ళి అక్కడి వారితో చర్చించాము. పై ప్రతిపాదనకు విజయవాడలో తీవ్రమైన వ్యతిరేకత వచ్చినప్పటికీ నవయుగ చంద్రశేఖర్ రావుగారు మా ప్రయత్నాన్ని హర్షిస్తూ, ఎంతో సహకరించారు. మేము రెండు, మూడు సార్లు విజయవాడ వెళ్ళి ఆంధ్రా ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ మరియు హైద్రాబాద్ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఒకటిగా విలీనమై ఎ.పి. ఫిలించాంబర్ పేరిట సంస్థ హైద్రాబాద్ కేంద్రంగా పనిచేస్తుంది కాబట్టి మరింత ఎక్కువ ప్రయోజనాలను సాధించవచ్చు అని నచ్చజెప్పాము. ఇటువైపు హైద్రాబాద్ ఫిలిం ఛాంబర్ వారు కూడా ఈ విలీనానికి సుముఖత చూపలేదు. దానికి వారు చెప్పిన కారణం వారు నైజాం ఏరియాతో పాటు మరట్వాడా రీజియన్‌లో ఉన్న ఎగ్జిబిటర్స్‌కు కూడా మా సేవలు అందిస్తున్నాము, అంచేత విలీనం సాధ్యపడదు అన్నారు. అప్పట్లో హైద్రాబాద్ ఫిలిం ఛాంబర్‌కు శ్రీ కేతినేని రామారావు, శ్రీ రమేశ్‌చంద్ర లహోటి అధ్యక్షులుగా ప్రాతినిధ్యం వహించారు. విస్తృత పరిధిలో 'ఆంధ్రప్రదేశ్ ఫిలిం ఛాంబర్' ఏర్పడినప్పటికీ వారి సేవలు యధాతథంగా కొనసాగించవచ్చునని నచ్చ చెప్పాము.

ఆ రెండు సంస్థలు సూచన ప్రాయంగా అంగీకారం తెలిపాయి. 'ఆంధ్రా ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్' ఆవిర్భవించింది. మిత్రులందరూ దానికి నన్ను తొలి అధ్యక్షునిగా ఎన్నుకొన్నారు. దోమల గూడలో ఏర్పాటు చేయబడిన సంస్థ కార్యాలయాన్ని ముఖ్యమంత్రి శ్రీ చెన్నారెడ్డి గారు ప్రారంభించారు. అనంతరం జరిగిన పరిణామాలవల్ల 'హైదరాబాద్ స్టేట్ ఫిలిం ఛాంబర్' వారు, వారి సంస్థను 'ఎ.పి. ఫిలిం ఛాంబర్'లో విలీనం చేయలేకపోయారు. కానీ ఆ సంస్థలోని సభ్యులు చాలామంది ఈ సంస్థలో కూడా సభ్యులుగా ఉండి వారి సహకారాన్ని అందించారు.

'ఆంధ్రప్రదేశ్ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్' ఏర్పడ్డ తరువాత అనేక విధాలుగా చిత్ర పరిశ్రమ అభివృద్ధికి అది దోహదపడింది. వినోదపు పన్ను, ఔట్‌డోర్ షూటింగ్ పర్మిషన్‌లు, చిత్ర నిర్మాణానికి అవసరమైన రికార్డింగ్, డబ్బింగ్ థియేటర్‌లు, ఫిలింనగర్ అభివృద్ధి మొదలైన విషయాలు ప్రభుత్వంతో చర్చించి ఫలితాలను సాధించటంలో ఛాంబర్ కీలకమైన పాత్ర పోషించింది. ఈ కార్యాలయం నుంచే శ్రీ దుక్కిపాటి మధుసూదనరావుగారి అధ్యక్షతన ఫిలింనగర్ సంస్థ కార్యకలాపాలు ప్రారంభించాము.

☆☆☆

**డి.వి.యస్. సంస్థ చిత్ర నిర్మాణ వ్యవహారం :**

సినీ రంగానికి చిత్ర పరిశ్రమ అభివృద్ధికి అవసరమైన పనుల్లో వివిధ హోదాల్లో నేను చురుకుగా పాల్గొన్నప్పటికీ మరోవైపు డి.వి.యస్. పతాకంపై చిత్ర నిర్మాణం కొనసాగుతూనే ఉంది.

ఇంతకు ముందు ఉదహరించిన చిత్రాలతో పాటు శ్రీ కె. విశ్వనాథ్‌గారు గారి దర్శకత్వంలో 'చిన్ననాటి స్నేహితులు' (1971) శ్రీ సి.యస్. రావుగారి దర్శకత్వంలో 'ధనమా? దైవమా?' (1973) చిత్రాలు నిర్మించాము. ఈ రెండింటి లోనూ శ్రీ యన్.టి. రామారావు గారే

కథానాయకులు. 1974లో శ్రీ కె. విశ్వనాథ్ గారి దర్శకత్వంలో 'జీవనజ్యోతి' చిత్రాన్ని ప్రారంభించాము. ఈ సందర్భంగా ఒక విషయం ఉదహరించాలి. అంతకుముందు నేను శ్రీ యన్.టి.ఆర్. గారితోనే చిత్రాలు నిర్మించాను. ఆయనకు తగ్గ కథకోసం అన్వేషణలో ఉండగా సరియైన కథ దొరకలేదు. ఒక రోజున శ్రీ రామారావు గారింట్లో ఈ విషయమై ముచ్చటిస్తున్నప్పుడు అక్కడ ఉన్న విజయ డిస్ట్రిబ్యూషన్‌కు చెందిన శ్రీ పూర్ణచంద్రరావుగారు మాతో "శ్రీ కె. విశ్వనాథ్‌గారు మరో నిర్మాత కోసం నాకొక కథ వినిపించారు. అది బాగుండేలా ఉంది చూడండి'' అని చెప్పారు. తరువాత నేను శ్రీ విశ్వనాథ్ గారిని సంప్రదించగా ఆయన ప్రముఖ రచయిత్రి శ్రీమతి రామలక్ష్మి (ఆరుద్ర గారి సతీమణి) వ్రాసిన "ఆడది'' అన్న నవల ఆధారంగా ఆయన తయారు చేసిన చిత్ర కథను నాకు మెరినా బీచ్‌లో వినిపించారు. ఆ కథ నాకెంతో నచ్చింది. కానీ చిత్రం ప్రథమ భాగం అంతా కథానాయకుడు విద్యార్థిగా ఉండటం వల్ల ఆ పాత్ర శ్రీరామారావు గారికి ఎంతవరకు సరిపోతుంది అనే సందేహం ఏర్పడి వారికి కథ చెప్పాము. శ్రీ యన్.టి.ఆర్ సావధానంగా విని "కథాంశం బావుంది, మనం ఇంకో కథ ఎన్నుకొందాం. ఈలోగా శోభన్‌బాబు లాంటి వారిని పెట్టి ఈ చిత్రం తీయండి'' అని సలహా ఇచ్చారు. ఆ విధంగా "జీవనజ్యోతి'' చిత్రానికి అంకురార్పణ జరిగింది. శోభన్‌బాబు, వాణిశ్రీ కాంబినేషన్‌లో శ్రీ విశ్వనాథ్‌గారి దర్శకత్వంలో ఈ చిత్రం తయారైంది. మా చిత్రాలకు ఎప్పుడూ సంగీతం అందించే శ్రీ టి.వి. రాజు అనారోగ్యంతో ఉండటంతో శ్రీ కె.వి. మహదేవన్‌గారిని సంగీత దర్శకులుగా నియమించుకొన్నాము. నారాయణరెడ్డిగారు పాటలు వ్రాశారు. ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకుల ఆదరాన్ని పొంది అఖండ విజయం సాధించింది. పలు కేంద్రాలలో శతదినోత్సవం జరుపుకొంది. 1975 లో విడుదలైన ఈ చిత్రం రాష్ట్ర ప్రభుత్వం నుంచి నాలుగు నంది అవార్డులను (ఉత్తమచిత్రం, ఉత్తమ దర్శకుడు, ఉత్తమనటుడు, ఉత్తమనటి) గెలుచుకొంది. నిజంగా ఇది మా సంస్థకు దక్కిన అపూర్వగౌరవం.



'చిన్ననాటి స్నేహితులు' పాటల రికార్డింగ్ సందర్భంగా...



'ధనమా? దైవమా?' ప్రారంభోత్సవ ముహూర్తంలో...

శ్రీ యన్.టి. రామారావుగారు తరువాత హైద్రాబాద్ మకాం మారి ఇతరత్రా బిజీగా ఉండటంచేత శ్రీ విశ్వనాథ్ గారి దర్శకత్వంలో శోభన్‌బాబుతో 'జీవిత నౌక' (1977), కాలాంతకులు (1978), నూతన్ ప్రసాద్, కవితలతో 'ప్రెసిడెంట్ పేరమ్మ (1979), కృష్ణంరాజుతో 'అల్లుడు పట్టిన భరతం' (1980) చిత్రాలు నిర్మించాము.

తరువాత శ్రీ పి. సాంబశివరావు దర్శకత్వంలో 'ప్రణయగీతం' (1981), శ్రీ వేజెళ్ళ సత్యనారాయణ దర్శకత్వంలో 'మార్చండి చట్టాలు' (1984) నిర్మించాము.


☆☆☆

**హిందీ చిత్ర నిర్మాణం :**

శ్రీ యల్.వి. ప్రసాద్ గారంటే నాకు చాలా అభిమానం. ఆయన కూడా నాపట్ల ఎంతో వాత్సల్యం చూపించేవారు. ఒక రోజున మేమిద్దరం బొంబాయి విమానాశ్రయంలో కలుసుకున్న సందర్భంలో "రాజు గారూ, మీరు చిత్ర పరిశ్రమకు అనేక విధాలుగా సేవ చేస్తున్నారు. మీ కాలాన్నంతా వెచ్చించి దాని అభివృద్ధికి పాటుపడుతున్నారు. దీనివల్ల మీ చిత్ర నిర్మాణవ్యవహారాలు వెనుకబడటం లేదా?" అని ప్రశ్నించారు. అది కొంతవరకు వాస్తవమే అన్నాను. వెంటనే ఆయన "పరిశ్రమకు మీరెంతో ఉపయోగపడుతున్నారు. మాలాంటి వారు మీకు ఎంతో కొంత అండగా నిలవాల్సిన బాధ్యత ఉంది. మీరు హిందీ చిత్రం తీయండి. నేను దర్శకత్వం వహించి అన్ని వ్యవహారాలు చూసిపెడతాను." అంటూ ఎంతో ఆప్యాయంగా చెప్పారు. ఇదే విషయాన్ని నాకు ఆప్తులైన శ్రీ అట్లూరి పూర్ణచంద్రరావుగారితో ప్రస్తావించాను. అప్పట్లో ఆయన ఎక్కువగా హిందీ చిత్రాలు నిర్మించేవారు. తగిన కథ కోసం ఆయన సలహా కోరాం. శ్రీ పూర్ణచంద్రరావుగారు కూడా నన్ను ప్రోత్సహిస్తూ "నేను 'న్యాయం కావాలి' చిత్రం యొక్క హిందీ హక్కులు కొన్నాను. అవి మీకు ఇస్తాను. అంతే కాదు నేను కూడా




ఊటీలో కాలాంతకుడు షూటింగ్ సందర్భంగా నిర్మాత, దర్శకులతో
నాయకీ నాయకులు శోభన్‌బాబు, జయసుధ



'జీవిత నౌక' ఔట్‌డోర్ లొకేషన్‌లో...



'ప్రెసిడెంట్ పేరమ్మ' ఔట్‌డోర్ షూటింగ్‌లో...



హిందీ చిత్రం 'ముఝే ఇన్సాఫ్ చాహియే' ఊటీలో షూటింగ్ సందర్భంగా దర్శకులు శ్రీ ఎల్.వి. ప్రసాద్‌గారితో



'ముఝే ఇన్సాఫ్ చాహియే'లో రేఖ, రతి అగ్నిహోత్రి

నిర్మాణవ్యవహారాల్లో సహకరిస్తాను. తప్పకుండా హిందీ చిత్రం తీయండి'' అన్నారు.

ఆ విధంగా శ్రీ యల్.వి. ప్రసాద్‌గారి దర్శకత్వంలో హిందీలో 'ముఝే ఇన్సాఫ్ చాహియే' **(1982)** చిత్రాన్ని ప్రారంభించి తొలి షెడ్యూల్ పూర్తి చేసాము. రెండో షెడ్యూల్ ప్రారంభిద్దామనుకొన్న సమయంలో శ్రీ ప్రసాద్‌గారు అనారోగ్యంతో బాధపడ్డారు. అప్పుడు ఆయన సూచనమేరకు తాతినేని రామారావు గారిని దర్శకునిగా తీసుకొని ప్రసాద్ గారి పర్యవేక్షణలో ఆ చిత్రం పూర్తిచేసి **1983**లో విడుదల చేశాము. రేఖ, మిధున్‌చక్రవర్తి, రతి అగ్నిహోత్రి, అస్రానీ మొదలగువారు నటించారు. లక్ష్మీకాంత్ ప్యారేలాల్ సంగీతం అందించిన ఆ చిత్రం అనూహ్య విజయం సాధించింది.

☆☆☆

## డి.వి.ఎస్. ప్రొడక్షన్స్ చిత్ర వివరాలు, చిత్ర దృశ్య మాలికలు

| సం॥ | చిత్రం - దర్శకులు - ప్రధాన తారాగణం |
|---|---|
| 1965 | మంగమ్మ శపథం - బి. విఠలాచార్య-యన్.టి.ఆర్, జమున, ఎల్. విజయలక్ష్మి |
| 1966 | పిడుగు రాముడు - బి. విఠలాచార్య-యన్.టి.ఆర్, రాజశ్రీ, ఎల్. విజయలక్ష్మి |
| 1968 | తిక్క శంకరయ్య - డి. యోగానంద్ - యన్.టి.ఆర్, జయలలిత, కృష్ణకుమారి |
| 1969 | గండికోట రహస్యం - బి. విఠలాచార్య - యన్.టి.ఆర్, జయలలిత, దేవిక |
| 1971 | చిన్ననాటి స్నేహితులు - కె. విశ్వనాథ్ - యన్.టి.ఆర్, వాణిశ్రీ, జగ్గయ్య |
| 1973 | ధనమా? దైవమా? - సి.ఎస్. రావు - యన్.టి.ఆర్, జమున |
| 1975 | జీవన జ్యోతి - కె. విశ్వనాథ్ - శోభన్‌బాబు, వాణిశ్రీ |
| 1977 | జీవిత నౌక - కె. విశ్వనాథ్ - శోభన్‌బాబు, జయప్రద, జయసుధ |
| 1978 | కాలాంతకుడు - కె. విశ్వనాథ్ - శోభన్‌బాబు, జయసుధ |
| 1979 | ప్రెసిడెంటు పేరమ్మ - కె. విశ్వనాథ్ - నూతన్ ప్రసాద్, కవిత |
| 1980 | అల్లుడు పట్టిన భరతం - కె. విశ్వనాథ్ - కృష్ణంరాజు, జయసుధ |
| 1981 | ప్రణయగీతం - పి. సాంబశివరావు - చంద్రమోహన్, సుజాత, గుమ్మడి |
| 1983 | ముఝే ఇన్సాఫ్ ఛాహియే(హిందీ)-తాతినేని రామారావు - రేఖ, మిథున్ చక్రవర్తి, రతి అగ్నిహోత్రి |
| 1984 | మార్చండి మన చట్టాలు - వేజెళ్ల సత్యనారాయణ - చంద్రమోహన్, శారద |
| 1986 | చాణక్య శపథం - కె. రాఘవేంద్రరావు - చిరంజీవి, విజయశాంతి |
| 1987 | భానుమతిగారి మొగుడు - ఎ. కోదండరామిరెడ్డి - బాలకృష్ణ, విజయశాంతి |
| 1990 | దోషి నిర్దోషి - వై. నాగేశ్వరరావు - శోభన్‌బాబు, సుమన్, లిజి |
| 1992 | ఛాంపియన్ - వై. నాగేశ్వరరావు - వినోద్‌కుమార్, శోభన |
| 1993 | రాజధాని - కోడి రామకృష్ణ - వినోద్‌కుమార్, యమున |

### భాగస్వామ్యంలో నిర్మించిన చిత్రాలు

| | |
|---|---|
| 1957 | కణ్ణయిన్ కడమై (తమిళం)- కమలాకర కామేశ్వరరావు- యన్.టి.ఆర్, రాజసులోచన |
| 1960 | మా బాబు - తాతినేని ప్రకాశరావు - నాగేశ్వరరావు, సావిత్రి, గుమ్మడి, కన్నాంబ |
| 1961 | అన్బుమగన్ (తమిళం)- తాతినేని ప్రకాశరావు - నాగేశ్వరరావు, సావిత్రి, కన్నాంబ |
| 1972 | శ్రీ కృష్ణాంజనేయ యుద్ధం- సి.ఎస్. రావు- యన్.టి.ఆర్, వాణిశ్రీ, ఎస్.వి.రంగారావు |
| 1975 | దేవుడులాంటి మనిషి - సి.ఎస్. రావు - కృష్ణ, మంజుల, శ్రీదేవి |




మంగమ్మ శపథం (1965)





పిడుగు రాముడు (1966)



తిక్క శంకరయ్య (1966)



గండికోట రహస్యం (1969)



చిన్ననాటి స్నేహితులు (1971)



ధనమా? దైవమా? (1973)




జీవన జ్యోతి (1975)




జీవిత నౌక (1977)




కాలాంతకుడు (1978)




ప్రెసిడెంటు పేరమ్మ (1979)



అల్లుడు పట్టిన భరతం (1980)




ప్రణయగీతం (1981)



మార్చండి మన చట్టాలు (1984)



చాణక్య శపథం (1986)



భానుమతిగారి మొగుడు (1987)




దోషి నిర్దోషి (1990)



ఛాంపియన్ (1992)



రాజధాని (1993)



శ్రీ కృష్ణాంజనేయ యుద్ధం (1972)
(పూర్ణిమా పతాకంపై)



దేవుడులాంటి మనిషి (1975)
(పూర్ణిమా పతాకంపై)

**ఫిలిం ఫెడరేషన్ ఆఫ్ ఇండియా :**

ఆంధ్రలో ఫిలిం పరిశ్రమ అభివృద్ధి కోసం ఏర్పడిన 'ఫిలిం ఛాంబర్' ఫిలింనగర్ కార్యకలాపాల్లో తీరిక లేకుండా పనిచేస్తున్న సమయంలో 1980లో 'ఫిలిం ఫెడరేషన్ ఆఫ్ ఇండియా' కార్యవర్గ సమావేశంలో పాల్గొనటానికి బొంబాయి వెళ్ళాను. ఆ సమావేశంలో ఆ సంవత్సరానికి కొత్త అధ్యక్షుణ్ణి ఎన్నుకోవటం ముఖ్యాంశం. అనుకోని విధంగా కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా నా పేరును అధ్యక్షునిగా ప్రతిపాదించారు. నేను హైద్రాబాదు పరిశ్రమకు చెందిన వ్యవహారాల్లో తీరిక లేకుండా ఉండటం వల్ల నేను ఆ ప్రతిపాదనను వ్యతిరేకించాను. కాని అప్పట్లో ఫిలిం ఫెడరేషన్‌లో నెలకొని ఉన్న అనిశ్చిత వాతావరణం తొలగిపోవాలంటే మీరు తప్పక మా ప్రతిపాదన అంగీకరించాలంటూ ఆ అధ్యక్ష భాద్యత నాపై ఉంచారు.

'ఫిలిం ఫెడరేషన్ ఆఫ్ ఇండియా' అంటే భారతదేశంలోని చలనచిత్ర పరిశ్రమకు ప్రాతినిధ్యం వహిస్తూ తలమానికంగా ఉన్న సంస్థ. దేశంలోని వివిధ ప్రాంతాలలో గల ఫిలిం పరిశ్రమకు చెందిన సంస్థలు అన్నీ ఇందులో సభ్యులుగా ఉన్నాయి. అంటే బొంబాయి కేంద్రంగా వెస్టర్న్ ఇండియాకు ప్రాతినిధ్యం వహిస్తున్న సంస్థలు, మద్రాసు కేంద్రంగా దక్షిణాది ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న 'సౌత్ ఇండియన్ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్', తదితర కేంద్రాలలో వున్న సంస్థలు, కలకత్తా కేంద్రంగా 'ఈస్టర్న్ ఇండియన్ మోషన్ పిక్చర్స్ అసోసియేషన్', ఇండోర్ కేంద్రంగా సెంట్రల్ ఇండియాకు చెందిన 'సి.పి.సి.ఐ.' ఫిలిం సంస్థ, ఢిల్లీ కేంద్రంగా 'నార్త్ ఇండియన్ మోషన్ పిక్చర్స్ అసోసియేషన్' వీటితోపాటు పంజాబ్, మరాఠీ, తమిళ, తెలుగు, కన్నడ, మళయాళం, మొ॥ ప్రాంతీయ భాషా చిత్రాలకు చెందిన సంస్థలు, ఫిలిం లేబరేటరీలకు చెందిన సంస్థలు, ఇండియన్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ వంటి సంస్థలు ఈ ఫెడరేషన్‌లో సభ్యులుగా ఉన్నాయి.

అది కొన్ని మనస్పర్థల వల్ల, ఇతర కారణాల వల్ల 'ఈస్టర్న్ ఇండియన్ మోషన్ పిక్చర్స్ అసోసియేషన్', 'ఆలిండియా ఫిలిం ప్రొడ్యూసర్స్ కౌన్సిల్', బొంబాయి, నార్త్ ఇండియాకు చెందిన కొన్ని సంస్థలు ఫెడరేషన్

నుంచి రాజీనామా చేయటం జరిగిన సమయం, తిరిగి వారందరినీ ఫెడరేషన్‌లో చేర్చవలసిన గురుతర బాధ్యత నాపై పడింది.

ముందుగా కలకత్తా వెళ్ళి 'ఈస్టర్న్ ఇండియన్ మోషన్ పిక్చర్స్' అసోసియేషన్‌తో సుదీర్ఘ చర్చలు జరిపి వారు తిరిగి ఫెడరేషన్‌లో చేరటానికి ఒప్పించటంలో సఫలమయ్యాము. అదే విధంగా ఇతర మిత్రులతో కలిసి శ్రీ జి.పి. సిప్పి అధ్యక్షతన పనిచేస్తున్న 'ఆల్ ఇండియా ఫిలిం ప్రొడ్యూసర్స్ కౌన్సిల్' కార్యవర్గంతో సంప్రదింపులు ప్రారంభించి వారిని తిరిగి ఫెడరేషన్‌లోనికి రప్పించటానికి చర్చలు ప్రారంభించాము. శ్రీ సిప్పి తదితర మిత్రులు సుముఖత చూపినా పెద్దలైన వి. శాంతారాంగారు ఈ ప్రతిపాదనను గట్టిగా వ్యతిరేకించారు. మా అభ్యర్థనపై బొంబాయి రాజ్‌కమల్ స్టూడియోలో శాంతారాం గారి అధ్యక్షతన బొంబాయి చిత్ర పరిశ్రమకు చెందిన సంస్థలతోనూ, ప్రముఖులతోనూ ఒక సమావేశం ఏర్పాటు చేశాము.

'ఫిలిం ఫెడరేషన్ సంస్థ' తరఫున నేను, శ్రీ డి. రామానుజం, సెంట్రల్ ఇండియాకు చెందిన శ్రీ సంతోష్ సింగ్ జైన్ మొ॥ వారు ఆ సమావేశంలో పాల్గొన్నాము. బొంబాయి సినీ పరిశ్రమకు చెందిన అతిరథ మహారథులందరూ విచ్చేసారు. కేంద్ర సంస్థ అయిన 'ఫిలిం ఫెడరేషన్' ను పునరుజ్జీవింప చేయాల్సిన అవసరం ఎంతో ఉందని, బొంబాయి చిత్ర పరిశ్రమ తిరిగి ఆ ఫెడరేషన్‌లో చేరిననాడే అది జరుగుతుందని, ఇతర దేశాలలోని చిత్ర పరిశ్రమకు చెందిన వ్యవహారాలు కూడా సత్సంబంధాలతో మెరుగు పడతాయని అందువల్ల మంచి ఫలితాలు వస్తాయని చర్చించటం జరిగింది. అప్పుడు వి. శాంతారాం ప్రసంగిస్తూ ఫెడరేషన్ డిస్ట్రిబ్యూటర్స్‌కు ఎగ్జిబిటర్స్‌కు ప్రాధాన్యత ఇస్తూ నిర్మాతలకు తగిన గుర్తింపు ఇవ్వటం లేదని, ఆ పరిస్థితుల్లో వారు ఫెడరేషన్ నుంచి వైదొలగామని వివరించారు. అప్పుడు మేము కలిసికట్టుగా ఉంటే సాధించగల లక్ష్యాలను గూర్చి తెలియపరచాము. ఎట్టకేలకు శాంతారాంగారు మెత్తబడి 'ఫిలిం ఫెడరేషన్' అనే పేరు మార్చి, నిర్మాతలకు ప్రాధాన్యత ఉండే విధంగా మరో పేరు పెడితే తాము చేరతామని ప్రతిపాదించారు. బొంబాయి చెందిన ఇతర మిత్రులు మా



ఫిలిం ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షునిగా ఎన్నికైన సందర్భంలో ఆంధ్రప్రదేశ్ ఫిలిం ఛేంబర్ వారు సత్కరించిన దృశ్యం

సూచనను అంగీకరించినప్పటికీ శాంతారాం గారి ముందు ఏమీ చెప్పలేక పోయారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన ఫిలిం ఫెడరేషన్ సంస్థ పేరు మార్చటం వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదని అంతకంటే చక్కగా సరిపోయే మరోపేరు సూచించటం కష్టమని శాంతారాంగారికి నచ్చ చెప్పాము. సరే మీరు ఆలోచించుకొని నిర్ణయించండని శాంతారాం వెళ్ళిపోయారు.

వారం రోజులు పోయాక బొంబాయి మిత్రులతో కలిసి జి.పి. సిప్పిగారి ఇంట్లో మరో సమావేశం ఏర్పాటు చేసి అందరికీ నచ్చజెప్పి ఆలిండియా ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్‌ను ఫెడరేషన్‌లో తిరిగి చేర్చటం జరిగింది. ఆ విధంగా ఫిలిం ఫెడరేషన్ తిరిగి పూర్వ వైభవాన్ని పొందటానికి మేము చేసిన కృషికి నాతో పాటు అందరూ ఎంతో సంతోషించాము. ఫెడరేషన్ కార్యక్రమాలు తిరిగి ఊపందుకున్నాయి.

గతంలో భారత ప్రభుత్వం ఎస్.కె. పాటిల్ గారితో 'నేషనల్ ఫిల్మ్ పాలసీ' నిర్ణయించటానికి ఒక కమిటీని వేసింది. అది జరిగి చాలా కాలం గడిచిపోయిన కారణంగా ప్రస్తుత పరిస్థితుల కనుగుణంగా ఫిలిం పాలసీని తిరిగి నిర్ణయించాలని భావించారు.

కేంద్ర ప్రభుత్వం వారు శ్రీ శివరామ కారంత్ గారి అధ్యక్షతన నేషనల్ ఫిలిం పాలసీని రూపొందించటం కోసం "వర్కింగ్ గ్రూప్ ఆన్ నేషనల్ ఫిల్మ్ పాలసీ" అనే కమిటీని ఏర్పాటు చేసి దానికి కేంద్ర ప్రభుత్వ అధికారులతో పాటు పరిశ్రమలోని వివిధ శాఖల వారికి ఆ కమిటీలో సభ్యత్వం ఇచ్చారు. సౌత్ ఇండియా నుంచి నేను, శ్రీ డి. రామానుజం, శ్రీయం. భక్తవత్సలం, ఆదూర్ గోపాలకృష్ణ ఆ కమిటీలో సభ్యులుగా వ్యవహరించాము. ఆ కమిటీ చిత్ర నిర్మాణ కేంద్రాలను సందర్శించి వివిధ సంస్థలకు ప్రాతినిధ్యం వహిస్తున్న వారి అభిప్రాయాలను సేకరించి క్రోడీకరించి వినోదపు పన్ను విధానం తగ్గింపు రేటులో పునర్ వ్యవస్థీకరణ, ఫిలిం ఫెస్టివల్స్, చిత్రాల ఎక్స్‌పోర్ట్, దేశ విదేశాలలో షూటింగ్ అనుమతులు, పంపిణీ, ప్రదర్శన విభాగాల్లో రావాల్సిన మార్పులు సూచిస్తూ కేంద్ర ప్రభుత్వానికి ఒక నివేదిక సమర్పించింది.

దేశ స్థాయిలో 'ఫిలిం ఫెడరేషన్' వ్యవహారాలు చూసుకుంటూ మరో వైపు రాష్ట్రస్థాయిలో 'ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్' ఫిలింనగర్ వ్యవహారాలు చూస్తున్న సమయంలో 'ఛాంబర్ ఆఫ్ కామర్స్‌కు' నా స్థానంలో కొత్త అధ్యక్షుణ్ణి ఎన్నుకుంటేే బాగుంటుందని భావించాను. ఈ దిశగా హైద్రాబాదులోని మిత్రులని సంప్రదించి జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేసి నూతన అధ్యక్షుడిగా నవయుగ చంద్రశేఖర్ రావు గారిని ఎన్నుకొన్నాము. వారితోపాటు కొత్త కార్యవర్గం ఏర్పడింది. అయినప్పటికి ఎప్పటిలాగే సమయం చిక్కినప్పుడు ఆంధ్రప్రదేశ్ చిత్ర పరిశ్రమ వ్యవహారాల్లోనూ అభివృద్ధి కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొనేవాణ్ణి. ఈ అభివృద్ధి కార్యక్రమాలలో నాకు శ్రీయుతులు అక్కినేని నాగేశ్వరరావు, డి. మధుసూదనరావు, పి. చంద్రశేఖర్‌రావు, యం.యస్. రెడ్డి, కె. రాఘవ, తమ్మారెడ్డి కృష్ణమూర్తి, కె.బి. తిలక్, మురళీమోహన్, రంజిత్ కుమార్, జి. హనుమంతరావు, గుమ్మడి వెంకటేశ్వరరావు మొ॥ వారు ఎంతగానో సహకరించారు.

ఫెడరేషన్ పనులకోసం నేను తరచుగా మద్రాసు, హైదరాబాదు, బొంబాయి, ఢిల్లీ ప్రాంతాలకు ప్రయాణం చేయాల్సి వచ్చేది. ఇది ఆరోగ్య రీత్యా శ్రమతో కూడినదే అయినప్పటికీ మంచి ఫలితాలు సాధిస్తూ ముందుకు కొనసాగుతున్నాము అనే ఉత్సాహం నన్ను ముందుకు నడిపించింది. ఇన్ని కార్యక్రమాలు ఉన్నప్పటికీ మా సంస్థ తరఫున చిత్ర నిర్మాణం కొనసాగుతూనే ఉంది.

☆☆☆

### నేషనల్ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్.ఎఫ్.డి.సి.) ఆవిర్భావం

యావత్ భారత దేశంలోని ఫిలిం పరిశ్రమకు విస్తృత పరిధిలో సేవలు అందించే దృక్పథంతో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఈ సంస్థను

ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావించింది. అప్పట్లో పనిచేస్తున్న 'ఫిలిం ఫైనాన్స్ కార్పొరేషన్', 'ఇండియన్ మోషన్ పిక్చర్స్ ఎక్స్‌పోర్ట్ కార్పొరేషన్' అనే రెండు సంస్థలను ఏకం చేసి 'నేషనల్ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్' అనే సంస్థను నెలకొల్పటానికి రంగం సిద్ధమయింది.

అప్పట్లో ఢిల్లీలో జరిగిన నేషనల్ ఫిల్మ్ అవార్డు ఫంక్షన్‌లో పాల్గొనటానికి ఫిలిం ఫెడరేషన్ అధ్యక్షుని హోదాలో ఢిల్లీ వెళ్ళాను. ఆ ఫంక్షన్ ముగిశాక నాటి కేంద్ర సమాచార శాఖ మంత్రి శ్రీ వసంత్ సాథే గారు విందు ఏర్పాటు చేసారు. ఆ విందు పూర్తయి అందరి వద్ద సెలవు తీసుకొంటున్న సమయంలో సమాచార శాఖ కార్యదర్శి శ్రీ మిత్రా, సహాయ కార్యదర్శి శ్రీ ఎస్.ఎల్. కపూర్ - వారు ఉభయులూ మర్నాడు నేను వెళ్ళబోయే ముందు వారి కార్యాలయం ఉన్న శాస్త్రి భవన్‌కు వచ్చి కలిసి వెళ్ళమని నన్ను కోరారు. నాకు ఎలాగూ ఫెడరేషన్ పనులమీద ఆ కార్యాలయంకు వెళ్ళటం ఆనవాయితీ కనుక తప్పక కలుస్తానని చెప్పాను.

మర్నాటి ఉదయం 11 గం॥కు శాస్త్రి భవన్‌లో అడుగుపెట్టి సమాచార శాఖ డైరెక్టర్ అయిన శ్రీ శర్మగారి గదిలోకి ముందు వెళ్ళాను. "రండి రాజుగారూ మీకోసమే ఎదురు చూస్తున్నాము" అన్నారు. ఫిలిం పరిశ్రమకు సంబంధించి కొన్ని విజ్ఞప్తులు నేను మంత్రి వర్గానికి అందజేసిన విషయాలు గూర్చి చర్చించాము. ఆ సమయంలో ఆయన పి.ఎ.ని పిలిచి నాకు ఉద్దేశించిన ఉత్తరం తెప్పించి "మిస్టర్ రాజు, ఈ ఉత్తరం మీకోసమే - మీరు స్వయంగా తీసుకొంటారా లేక పోస్టులో పంపించమంటారా" అన్నారు. "ప్రభుత్వానికి మళ్ళీ పోస్టల్ ఖర్చులు ఎందుకు స్వయంగా తీసుకొంటాలెండి" అని చెప్పగా, "Do you know the contents of the letter?" అని ప్రశ్నించారు. "ఏమిటి వింతగా మాట్లాడతారు అందులో ఏముంటుంది నేను వ్రాసిన లేఖలకు సమాధానమే గదా" అన్నాను. అది కాదంటూ ఉత్తరం చూడమని నా చేతిలో పెట్టారు. దాంతో కొంత క్యూరియాసిటీ పెరిగి తెరిచి చూసాను. కొత్తగా భారత ప్రభుత్వం ప్రారంభిస్తున్న 'నేషనల్ ఫిలిం



కేంద్ర సమాచార శాఖామంత్రి శ్రీ వసంత్ సాథేగారితో...



కళాత్మక చిత్రాల దర్శకుడు శ్యామ్ బెనగల్‌తో...

డెవలప్‌మెంట్ కార్పొరేషన్' సంస్థకు తొలి చైర్మన్‌గా నేను ఉంటే బాగుంటుందని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు నా అంగీకారం తెలపాలి. ఇది ఆ లేఖ సారాంశం. నేను అత్యంత ఆశ్చర్యానికి లోనయ్యాను. కారణం అంతకుముందు జనతా ప్రభుత్వంలో శ్రీ ఎల్.కె. అద్వానీగారు సమాచార శాఖ మంత్రిగా ఉండగా ఎన్.ఎఫ్.డి.సి.లో నన్ను ఒక డైరెక్టర్‌గా నియమిస్తున్నాం కాబట్టి అంగీకారం తెలపవలసిందిగా కోరారు. అది అమలు జరిగేలోగా కొత్త ప్రభుత్వం వచ్చింది.

ఇప్పుడు ఈ ప్రతిపాదన రావటం నా జీవితంలో ఎదురుచూడని, ఊహించని మలుపు. నేను వెంటనే "మంత్రి గారిని చూడాలి. వారి పి.ఏ.కు ఫోన్ చేయండి'' అని చెప్పగా శ్రీ శర్మగారు వెంటనే అపాయింట్‌మెంట్ ఫిక్స్ చేశారు. నేను ఆ ఉత్తరం తీసుకొని శ్రీ వసంత్ సాథేగారి గదిలో అడుగు పెట్టగా అప్పుడే ఆయన ఇంటికి బయలుదేరబోతూ ఎదురు వచ్చారు. "కమాన్ మిస్టర్ రాజూ'' అంటూ అభినందన పూర్వకంగా కౌగలించుకొన్నారు. నా పట్ల ఆయనకు గల నమ్మకానికి కృతజ్ఞతలు తెలియజెప్పి "అటువంటి గురుతర బాధ్యతను నాకు ఒప్పజెప్పారు. ఎంత వరకు నెరవేర్చగలనో'' అన్నాను. ఆయన భుజం తట్టి " నేను మీకు అన్ని విధాలా అండగా ఉంటాను, మీకు భయం ఏమిటి? నేను ఫిలిం పరిశ్రమకు చెందిన అనేక కేంద్రాలు సందర్శించిన సందర్భాలలో పలువురు మిత్రులతో సంభాషించినప్పుడు ఈ సంస్థకు అధ్యక్షులుగా మీరు ఉంటే వివాద రహితంగా సమర్థవంతంగా నిర్వహించగలరు. అనే అభిప్రాయం వ్యక్తం అయింది. ఇందుకు ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధి గారి వద్ద అనుమతి తీసుకొన్నాను. మీరు వెంటనే అంగీకారం తెలియచేయండి'' అని ప్రోత్సహించి పంపారు. ఢిల్లీనుంచి నేను బొంబాయి ప్రయాణం అయ్యాను. కాబట్టి అక్కణ్ణుంచి నా అంగీకారాన్ని తెలియజేస్తానని చెప్పి ఆయన దగ్గర శెలవు తీసుకున్నాను. ఇతర అధికార మిత్రులను కూడా కలిసి బొంబాయి వెళ్ళాను.

నేను విమానంలో ప్రయాణం చేస్తున్నంత సేపూ నా ఆలోచన ఈ కొత్త పదవి గురించే ఇంత పెద్ద బాధ్యత ఎలా నిర్వహించగలనా అనే సంశయం. బొంబాయి లోని మిత్రులు మరియు చిత్ర పరిశ్రమకు చెందిన ఇతర కేంద్రాలలో మిత్రులు ఈ విషయం తెలుసుకొని నన్ను అభినందించారు.

ఇలా ఉండగా...

ఆర్ట్ ఫిలింస్ నిర్మాతలు కొంతమంది శ్రీ సత్యజిత్‌రే గారికి ఆ పదవి ఇస్తే బావుంటుందని ప్రతిపాదించి, పత్రికా ప్రకటనలు ఇచ్చి, సమాచార శాఖ మంత్రికి, ప్రధానమంత్రికి వినతి పత్రాలు సమర్పించారు. వ్యాపారాత్మకంగా చిత్రాలు నిర్మించేది నేను - కళాత్మకంగా చిత్రాలు తీసేది సత్యజిత్ రే కాబట్టి ఆయన ఆ పదవిలో ఉండాలని వారి భావన. దీనికి ప్రతిగా చిత్ర పరిశ్రమకు చెందిన కొందరు ప్రముఖులు మరికొన్ని సంస్థలు నన్ను సమర్థిస్తూ ప్రకటనలిచ్చారు. ఇది ఒక వివాదంగా మారి నేను దానిలో చిక్కుకోవడం నాకు ఇష్టం లేదు. ఆ విషయాన్ని తెలియజేస్తూ "శ్రీ సత్యజిత్ రే వంటి గొప్ప వ్యక్తి ఎన్.ఎఫ్.డి.సి. తొలి అధ్యక్షుడిగా ఉండటం అన్ని విధాలా సమంజసం అని నేను కూడా భావిస్తున్నాను. మీరు అంగీకరిస్తే నేను బోర్డులో ఒక డైరెక్టర్‌గా ఉంటాను" అని సమాచార శాఖా మంత్రి గారికి ఉత్తరం వ్రాసాను.

కొన్ని రోజుల తర్వాత నేషనల్ ఫిలిం పాలసీ వర్కింగ్ గ్రూప్ నివేదికను సమర్పించటానికి ఢిల్లీలో మంత్రిగారిని సభ్యులందరం కలిసాము. ఆ నివేదిక సమర్పించి బయటకు వస్తుంటే మంత్రిగారు నన్ను తనతో కార్యాలయానికి రావలసిందిగా తీసుకెళ్ళారు.

ఆయన గదిలోకి వెళ్ళాక "మిస్టర్ రాజూ, సత్యజిత్ రే నిజంగా గ్రేట్‌మాన్" అన్నారు. "అందుకే కదా ఆయన్ను ఛైర్మన్‌గా వేయండి అని నేను కోరాను" అన్నాను.

"అదికాదు ఈ ఉత్తరం చూడండి" అంటూ టేబుల్ సొరుగు లోంచి ప్రధానమంత్రికి సత్యజిత్ రే వ్రాసిన ఉత్తరం తీసి నా చేతిలో పెట్టారు.

దాని సారాంశం ఏమిటంటే...

"ఎన్.ఎఫ్.డి.సి ప్రారంభిస్తున్నందుకు అభినందిస్తున్నాను. కొంత మంది మిత్రులు నా అనుమతి లేకుండా ఛైర్మన్‌గా నా పేరును ప్రస్థావించినందుకు చింతిస్తున్నాను. శ్రీ డి.వి.యస్. రాజుగారితో నాకు పరిచయం లేదు. ఇటీవల నా సొంత చిత్రం రికార్డింగ్ కోసం మద్రాసు వెళ్ళాను అక్కడ కొంతమంది మిత్రులతో పరిచయం ఉంది. వారి వద్ద ఈ విషయం ప్రస్థావనకు రాగా వారందరూ రాజుగారి సామర్థ్యం గురించి నిష్పక్షపాత వైఖరి గురించి, కార్యదీక్ష గూర్చి తెలిపారు. నేను కేవలం చిత్రాల సృష్టికర్తను మాత్రమే! ఇతర వ్యాపార వ్యవహారాలు పరిశ్రమ పట్ల అవగాహన లేనివాణ్ణి రాజు గారిని ఛైర్మన్‌గా నియమించాలని మీరు తీసుకొన్న నిర్ణయం సరియైనది. మీ నిర్ణయాన్ని మార్చుకోవద్దు."

సత్యజిత్ రే వ్రాసిన ఆ ఉత్తరంపై ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరా గాంధిగారు "For necessary action" అనే నోట్ పెట్టి శ్రీ సాథేగారికి పంపించారు. నేను ఉత్తరం చదివాక సాథేగారు 'మీ నియామకం ఉత్తర్వులు ప్రాసెస్ అవుతాయి త్వరలోనే వీటిని పంపిస్తాను. మీరు వెనుకడుగు వేయకండి" అంటూ మరోసారి నాకు ధైర్యం చెప్పారు. ఆయన అన్న విధంగానే **1980** సెప్టెంబర్‌లో నాకు నియామకపు ఉత్తర్వులు అందాయి. అప్పట్లో ఎన్.ఎఫ్.డి.సి ప్రధాన కార్యాలయం బొంబాయిలోనూ ప్రాంతీయ కార్యాలయాలు మద్రాసు, కలకత్తా, ఢిల్లీలలో ఉండేవి. నేను మద్రాసు కార్యాలయంలో ఛార్జి తీసుకొని తరువాత బొంబాయి వెళ్ళాను. నాతో పాటు సభ్యులుగా సినీరంగంలో ఉద్దండులైన శ్రీయుతులు రామానంద్ సాగర్, మృణాల్ సేన్, శ్యాం బెనగల్, బాసూ భట్టాచార్య, ఆదూర్ గోపాలకృష్ణన్, శాంత చౌదరి, ఎం. భక్తవత్సలం, మన్‌మోహన్ కృష్ణ, శ్రీమతి సాయీ

పరాంజపే నియమింపబడ్డారు. వీరితో పాటు మహారాష్ట్ర ప్రభుత్వంలో కార్యదర్శిగా పనిచేస్తున్న సీనియర్ ఐ.ఏ.ఎస్. ఆఫీసర్ శ్రీమతి మాలతి తంబేవైద్య కూడా మేనేజింగ్ డైరెక్టర్‌గా బోర్డులో ఉన్నారు. నాకు దక్కిన ఈ అపూర్వ గౌరవం పట్ల పరిశ్రమలోని వారే గాక పలు ప్రాంతాలలోని నా ఆత్మీయులు, చిన్ననాటి మిత్రులు ఎందరో అభినందనలు అందజేసారు.

**గాంధి చిత్ర నిర్మాణం :**

'నేషనల్ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్' ఏర్పడటానికి 15 ఏళ్ళ ముందే సర్ రిచర్డ్ అటన్‌బరో 'మహాత్మా గాంధి జీవిత చరిత్ర' స్క్రిప్టును తయారు చేసి కేంద్ర ప్రభుత్వ సహకారంతో చిత్రాన్ని నిర్మించటానికి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ గారి హయాం నుంచి ప్రయత్నాలు ప్రారంభించారు. దానికి శ్రీమతి ఇందిరా గాంధి ప్రధానమంత్రి అయ్యాక (1980 ప్రాంతంలో) అనుమతి లభించింది. నాటి సమాచార శాఖ మంత్రి వసంత్ సాథేగారు ప్రధానమంత్రి సలహాపై ఆ స్క్రిప్టును, బడ్జెట్‌ను పరిశీలించి, సూచనలివ్వ వలసిందిగా ఒక కమిటీని వేశారు. అందులో శ్రీయుతులు ఎల్.వి. ప్రసాద్, రామానంద్ సాగర్, జి.పి. సిప్పి, నేనూ, భక్తవత్సలం, బి.ఆర్. చోప్రా సభ్యులం. మేము నాలుగైదు సమావేశాల్లో బడ్జెట్ వివరాలు, కోప్రొడక్షన్‌గా నిర్మించబడే అవకాశాలు చర్చించి తగు సూచనలను రూపొందించి మంత్రి గారికి నివేదిక సమర్పించాము. ప్రభుత్వం తరఫున ఈ చిత్ర నిర్మాణంలో ఎన్.ఎఫ్.డి.సి భాగస్వామ్యం వహించి నిర్మాణ వ్యవహారాలను పర్యవేక్షించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఈ ప్రతిపాదన ఎన్.ఎఫ్.డి.సి బోర్డు మొదటి మీటింగులోనే ఒక ప్రధానాంశంగా చర్చకు వచ్చింది. అయితే అప్పటికే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఆక్షేపిస్తూ పలువురు చిత్ర ప్రముఖులు (కొంతమంది ఎన్.ఎఫ్.డి.సి సభ్యులు కూడా వారిలో ఉన్నారు.) ప్రకటనలు ఇచ్చారు.

మనదేశంలో ఎందరో నిష్ణాతులైన అనుభవం ఉన్న నిర్మాతలు, దర్శకులు ఉండగా 'గాంధి' చిత్రాన్ని నిర్మించే అవకాశం మనం వదులుకొని ఒక విదేశీయునికి ఇవ్వటం ఎంతవరకు సమంజసం అన్నది ఆ ప్రకటనల సారాంశం.

సున్నితమైన ఈ సమస్య బోర్డు తొలి సమావేశంలోనే చర్చకు రావటం పట్ల నేను కొంత ఇబ్బంది పడాల్సి వచ్చింది. బోర్డు సమావేశాన్ని ప్రారంభించాల్సిందిగా కోరుతూ మంత్రిగారిని ఆహ్వానించాను.

ఆ ఆహ్వానాన్ని మన్నించి మంత్రి శ్రీ సాథేగారు, ఐ & బి కార్యదర్శి శ్రీ మిత్రాగారు హాజరయ్యారు. శ్రీ సాథేగారు ప్రారంభ ఉపన్యాసంలో 'గాంధీ' చిత్రం గూర్చి ప్రస్తావించారు. బోర్డు సభ్యులలో చాలా మంది ఈ ప్రతిపాదనను గట్టిగా వ్యతిరేకించారు. అంతటి భారీ బడ్జెట్‌తో కూడిన బాధ్యత ఎన్.ఎఫ్.డి.సి ఒప్ప చెపితే, ఎన్.ఎఫ్.డి.సి ప్రధాన లక్ష్యాలలో ఒకటైన చిన్న చిత్రాలు నిర్మించే వారికి ఆర్థిక సహాయాన్ని అందించటంలో ఇబ్బందులు ఎదురవుతాయని అంతేగాక ఒక భారతీయునికి ఈ అవకాశం ఇవ్వటం సమంజసం అనే వాదన వినిపించారు. శ్రీ సాథేగారు, శ్రీ మిత్రాగారు ఉభయులూ వారికి నచ్చ జెప్పటానికి ప్రయత్నించి చివరకు బోర్డువారే చర్చించి నిర్ణయం తీసుకొమని చెప్పి వెళ్ళిపోయారు. వారిద్దరనూ సాగనంపటానికి ఎన్.ఎఫ్.డి.సి కార్యాలయం క్రిందకు వచ్చి వీడ్కోలు చెబుతుండగా శ్రీ సాథేగారు "ఈ నిర్ణయంలో మీరు స్థిరంగా ఉండండి. ఇది ప్రభుత్వ నిర్ణయం. సభ్యులలో ఏర్పడ్డ అపోహలు సరియైనవి కావు" అని నాతో చెప్పి వెళ్ళారు.

నేను తిరిగి వచ్చి బోర్డు సమావేశానికి అధ్యక్షత వహించి 'గాంధి' ప్రాజెక్టు మీద అందరి సభ్యుల సందేహాలను, అభిప్రాయాలను వివరించవలసిందిగా కోరాను. వారందరూ మంత్రిగారి ముందు చెప్పిన విషయాలనే పునరుద్ఘాటించారు. అది విన్నాక నేను కొద్దిసేపు నా మాటలు

శ్రద్ధగా వినాల్సిందిగా కోరుతూ నా అభిప్రాయాన్ని స్థూలంగా ఈ విధంగా బోర్డు ముందు ఉంచాను.

"ఎన్ఎఫ్‌డిసి నిర్వహించవలసిన బాధ్యతల్లో చిన్న నిర్మాతలకు ఆర్థిక సహాయం అందించటంతో పాటు పలు అంశాలు ఉన్నాయి. వాటిల్లో ఇతర దేశాల కో-ప్రొడక్షన్‌తో చిత్రాలు నిర్మించాలి అనేది చాప్టర్ లో ఒక ప్రధానాంశంగా ఉంది. సభ్యులు భయపడ్డట్టు ఎన్.ఎఫ్.డి.సి ఫండ్స్ నుంచి ఒక్క పైసా కూడా మనం 'గాంధీ' చిత్రానికి మళ్ళించవలసిన అవసరం లేదు. కేంద్ర ప్రభుత్వం వారు 'స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' వారికి గ్యారంటీ ఇచ్చి అయిదారు కోట్లు ఎన్.ఎఫ్.డి.సి.కి అప్పుగా ఇవ్వాల్సిందిగా ఆర్డర్స్ ఇచ్చి ఉన్నారు. అంచేత ఆ డబ్బుతోనే మన దేశం తరఫున మొత్తం ఖర్చులో 33% పెట్టుబడి పెట్టడం జరుగుతుంది. చిత్రం విజయవంతమైతే వచ్చే లాభాలు అన్నీ ఎన్.ఎఫ్.డి.సి.కి చెందుతాయి. ఒకవేళ నష్టం వస్తే ప్రభుత్వమే స్టేట్ బ్యాంక్ వారి అప్పు తీరుస్తుందని హామీ ఇచ్చారు. ఇటువంటి పెద్ద ప్రతిష్టాత్మక చిత్రంలో ఎన్.ఎఫ్.డి.సి.కి భాగస్వామ్యం ఉంటే ఇతర దేశాల్లో మన సహకారంతో నిర్మించే చిత్రాలకు గిరాకీ ఏర్పడుతుంది. అంతేకాక మనం ఎన్.ఎఫ్.డి.సి సహకారంతో తీసే చిన్న చిత్రాలు మరియు పరిశ్రమలోని వారు తీసే చిత్రాలు ఎగుమతిచేసే బాధ్యత ఎన్.ఎఫ్.డి.సి.పై ఉంది కాబట్టి ఈ దిశగా 'గాంధీ' వంటి పెద్ద బడ్జెట్ చిత్ర నిర్మాణం మనకు సహకరిస్తుంది. మనదేశంలోని సాంకేతిక నిపుణులు సెకండ్ యూనిట్‌లో పనిచేసే విధంగా నిర్మాతతో అంగీకారం ఏర్పరచుకొన్నాయి. ఆ విధంగా మన సాంకేతిక నిపుణులు ఈ బృహత్ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం రావటం గర్వకారణం అవుతుంది. మీరంతా చెబుతున్నట్టు ఇండియాలో ఇటువంటి చిత్రాలు నిర్మించే సమర్థులు లేరా అంటే గత పదిహేను సంవత్సరాలుగా ప్రయత్నిస్తూ ఉంటే ఒక్కరూ ముందుకు రాలేదుకదా! మనం పెట్టే 33 శాతం పోను మిగతా 67 శాతం పెట్టుబడి లండన్ కేంద్రంగా ఏర్పడ్డ 'Financial Concerns' చేస్తాయి కాబట్టి మనం భయపడాల్సిన

అవసరం లేదు. ఒకవేళ భారత ప్రభుత్వం ఇచ్చిన అంగీకారానికి మన ఎన్.ఎఫ్.డి.సి బాధ్యతలు తీసుకోకపోతే ప్రభుత్వం వెనుకంజ వేయదు సరిగదా ఈ కో-ప్రొడక్షన్ మా ద్వారా జరగాలని కోరుతున్న ఫిలిమ్స్ డివిజన్‌కు గాని, ప్రభుత్వానికి చెందిన మరో సంస్థకు కాని ఈ బాధ్యతను ఒప్పజెప్పటానికి అవకాశాలు ఉన్నాయి. కాబట్టి మనం ఈ అవకాశం వదులుకోవద్దు. ఈ చిత్ర నిర్మాణం వలన మనకు అనేక విధాలుగా మంచి జరుగుతుంది గాని చేటు లేదు'' అని చెప్పాను. ఈ వివరణతో సభ్యుల దృక్పథంలో మార్పు వచ్చి చివరకు అందరూ అంగీకరించారు.

అప్పటికి లంచ్‌టైమ్ కావటం వల్ల మేమంతా దగ్గరలోనే ఉన్న "కాపర్‌చిమ్నీ'' అనే రెస్టారెంట్‌కు భోజనానికి వెళ్ళాము. అక్కడ కొందరు అంటే 'గాంధి' ప్రాజెక్టును ముందు గట్టిగా వ్యతిరేకించిన శాంతిచౌదరి, బాసూ భట్టాచార్య నా వద్దకు వచ్చి "మీరు కూలంకషంగా చర్చించి వివరించడం వల్ల మాలో ఏర్పడ్డ సందేహాలు తొలగిపోయాయి. మీరు ఒప్పించిన విధానం గొప్పగా ఉంది'' అని అభినందించారు. ఈ ఘట్టం ప్రపంచఖ్యాతి వహించి, పలు ఆస్కార్ అవార్డులు గెలుచుకొన్న ప్రతిష్ఠాత్మక 'గాంధి' చిత్ర నిర్మాణంలో ఎన్.ఎఫ్.డి.సి భాగస్వామి కావటానికి తొలి మెట్టుగా చెప్పుకోవాలి.

☆☆☆

ఎన్.ఎఫ్.డి.సి నిర్వహించవలసిన ప్రధాన బాధ్యతల్లో - దేశంలో ఉన్న చిత్రనిర్మాణ కేంద్రాలలో తగినంత ఆధునిక, సాంకేతిక సదుపాయాలను అభివృద్ధి చేయటం ఒక ముఖ్య అంశం. ఇందుకు అనుగుణంగా కలకత్తా, బొంబాయి, మదరాసు వంటి తదితర చిత్ర నిర్మాణకేంద్రాలలో ప్రస్తుతం ఉన్న సదుపాయాలను పరిశీలించాము. ఇతర కేంద్రాలతో పోల్చినప్పుడు కలకత్తాలో ఉన్న స్టూడియోస్‌ను పరిశీలిస్తే అవి చాలా వెనుకబడి ఉన్నట్టు గమనించాము. అక్కడ ఉన్న అతి పురాతనమైన స్టూడియోలను, రికార్డింగ్, డబ్బింగ్, ఎడిటింగ్ వంటి సదుపాయాలు సమగ్రంగా లేకపోవటంతో అభివృద్ధి




కేంద్ర సమాచార శాఖామంత్రి సుబోధ్‌కాంత్ సహాయ్‌గారితో NFDC ఛైర్మన్‌గా చిత్ర పరిశ్రమ సమస్యలు చర్చిస్తున్న సందర్భంలో...

కార్యక్రమాల్లో ప్రాధాన్యతా క్రమంలో కలకత్తాకు మొదటి స్థానం ఇవ్వాలనుకున్నాము.

ఈస్టర్న్ ఇండియా పరిధిలో బెంగాల్‌తోపాటు ఒరిస్సా, అస్సాం కేంద్రాలుగా చిత్రనిర్మాణం సాగుతుండేది. ఆయా భాషల్లో ఎక్కువగా చిన్న నిర్మాతలు కావటం వల్ల ఆర్థికంగా వనరులు అంతంత మాత్రమే అవటంతో తగిన వసతులు ఏర్పాటు చేసుకోవటంలో ఆ ప్రాంతం వెనుకబడిపోయింది. ఎన్.ఎఫ్.డి.సి బోర్డులో ఉన్న ప్రముఖులతో పాటు శ్రీ సత్యజిత్ రే గారితో మరియు రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులతో కూడా చర్చలు జరిపాము. ఇప్పటి బెంగాల్ ముఖ్యమంత్రి బుద్దదేవ్ భట్టాచార్య అప్పట్లో సమాచార శాఖామంత్రిగా ఉండేవారు. వారిని కూడా పలుసార్లు కలిసి తగిన వసతి చూపితే అక్కడ ఆధునిక సౌకర్యాలతో రికార్డింగ్, డబ్బింగ్, ఎడిటింగ్, ఔట్‌డోర్ యూనిట్స్ వగైరా సదుపాయాలు ఎన్.ఎఫ్.డి.సి ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉందని చెప్పాము. అందుకు ఆయన సానుకూలంగా స్పందించి కలకత్తా దక్షిణప్రాంతంలో ఉన్న 'బెహలా ఇండస్ట్రియల్ ఎస్టేటు'లో కొంత స్థలం ప్రత్యేకించటానికి సుముఖత చూపారు. స్థానిక బోర్డు డైరెక్టర్లు సత్యజిత్ రే, మృణాళ్‌సేన్, శాంతిచౌదరి గార్లతో సంప్రదించి స్థల నిర్ణయం, థియేటర్ నిర్మాణం వగైరా చేపట్టడానికి ఏర్పాట్లు జరిగాయి. ఫలితంగా ఆధునిక పద్ధతులతో రికార్డింగ్, డబ్బింగ్, అవసరాలకు తగ్గ ఎక్యుప్‌మెంట్ దిగుమతి చేసుకొన్నాము.

అప్పట్లో చిన్న నిర్మాతలు ముడి ఫిల్మ్ ఖర్చు తగ్గించటం కోసం 16 ఎం.ఎం. చిత్ర నిర్మాణం చేసి 35 ఎం.ఎం.లో బ్లో అప్ చేసే అవకాశాలు కావాలని కోరారు. దానిని దృష్టిలో పెట్టుకొని 35 ఎం.ఎం.తో పాటు 16 ఎం.ఎం.లో కూడా చిత్రాల నిర్మాణం జరగటానికి తగ్గట్టుగా థియేటర్ నిర్మించాము. దానితో పాటు అప్పుడే రష్యాలో డెవలప్ అయిన ఆధునిక ఎడిటింగ్ (స్టీమ్‌బెక్) పరికరాలని కూడా తెప్పించటానికి ఏర్పాట్లు జరిగాయి. ఆ ఎడిటింగ్ టేబుల్ మీద 16 ఎం.ఎం. మరియు 35 ఎం.ఎం. చిత్రాలు

రెండూ ఎడిట్ చేసుకోవటానికి అవకాశం ఉంది. రికార్డింగ్ అండ్ డబ్బింగ్ థియేటర్‌లో 16 ఎం.ఎం. ఫిలిం మీద కూడా డబ్బింగ్, రికార్డింగు చేసుకొనే సాంకేతిక సదుపాయాలను ఏర్పాటు చేసాము. 35 ఎం.ఎం. మరియు 16 ఎం.ఎం. చిత్రాల నిర్మాణానికి అనువుగా కెమెరాలు తెప్పించాము. ఈ సదుపాయాలన్నీ ఆ ప్రాంతంలో, పొరుగున ఉన్న ఇతర రాష్ట్రాల నిర్మాతలందరికీ ఎంతో ఉపయోగపడ్డాయి.

మనదేశంలో సబ్ టైటిలింగ్ యూనిట్ లేదు. విదేశాలకు ఎగుమతి చేసే చిత్రాలకు అదే విధంగా టి.వి. ద్వారా ప్రదర్శించే ప్రాంతీయ భాషా చిత్రాలకు సబ్ టైటిలింగ్ చేయాలంటే లండన్ పంపించాల్సి వచ్చేది. అందువల్ల వ్యయప్రయాసలు అధికమయ్యేవి. ఈ అవసరాన్ని గుర్తించిన ఎన్.ఎఫ్.డి.సి సబ్ టైటిలింగ్ యూనిట్‌ను దిగుమతి చేసుకొని బొంబాయిలో ఏర్పాటు చేసింది. ఆ యూనిట్ ఈనాడు ఎంతగానో ఆధునీకరించబడి ఎలక్ట్రానిక్ సబ్ టైటిలింగ్ విధానం ద్వారా ప్రపంచస్థాయికి తగ్గ సాంకేతిక పరిజ్ఞానం సంతరించుకొని సేవలందిస్తుంది. అలాగే మా బోర్డు అప్పుడే ప్రవేశపెట్టబడిన 'టెలిసింక్' అనే ఎక్విప్‌మెంట్‌ను ఎన్.ఎఫ్.డి.సి కార్యాలయంలో ఏర్పాటు చేశాము. దీనివల్ల ఫిలింను వీడియో టేప్స్‌కు ట్రాన్స్‌ఫర్ చేసే సౌకర్యం ఏర్పడింది. ఆక్కణ్ణుంచే మొదట 'యుమాటిక్ టేప్' మీద ఫిలిం ట్రాన్స్‌ఫర్ చేసి వేల సంఖ్యలో వి.హెచ్.ఎస్. క్యాసెట్టులు తయారు చేయటం జరుగుతుంది. ఈ విధంగా ఆనాడు దేశంలో లేని ఆధునిక సాంకేతిక సౌకర్యాలు మన చిత్ర పరిశ్రమకు అందించటంలో ఎన్.ఎఫ్.డి.సి ప్రశంసనీయమైన పాత్ర పోషించింది.

☆☆☆

**ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ :**

అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల నిర్వహణ బాధ్యత ఫిలిం ఫెస్టివల్ డైరక్టరేట్ ద్వారా జరుగుతుండేది. ఈ సంస్థ కేంద్ర ప్రభుత్వ

సమాచార శాఖలో ఒక అంతర్భాగంగా పనిచేసేది. మేమంతా ఆలోచించి యాంత్రికంగానూ, మొక్కుబడిగానూ జరిగే ఈ చిత్రోత్సవాలు నిర్వహిస్తున్న విధానం సరిచేయాలనే ఆలోచనతో కేంద్ర మంత్రి శ్రీ సాథేగారితో ఫెస్టివల్ డైరెక్టరేట్‌ను ప్రభుత్వ శాఖలో కాక ఎన్.ఎఫ్.డి.సి ఆధ్వర్యంలోకి తీసుకువస్తే చిత్రసీమలోని వారందరికీ అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల ద్వారా ఎక్కువ సదుపాయాలు కలిగించటంతో పాటు మనదేశంలోని వివిధ భాషల్లో తయారవుతున్న చిత్రాలను విదేశాలకు ఎగుమతి చేసేందుకూ, ఫిలిం మార్కెట్‌ను మరింత ప్రయోజనకరంగా అభివృద్ధి చేయటానికి, త్వరితగతిని నిర్ణయాలను తీసుకోవటానికి అవకాశం ఉంటుందని వివరించాము.

ఆయన మేము చెప్పిన దానికి సానుకూలంగా స్పందించి "ఇకపై ఫెస్టివల్ డైరక్టరేట్‌ను ఎన్.ఎఫ్.డి.సి యాజమాన్యంలోనికి తీసుకువస్తాము. తద్వారా ఇక ముందు జరగబోయే 'ఫిలిం ఫెస్టివల్స్' అన్నీ ఎన్.ఎఫ్.డి.సి సహకారంతో నిర్వహించబడతాయి" అని ప్రకటించారు. ఆ నిర్ణయానికి చిత్రపరిశ్రమలోని ప్రముఖులందరూ హర్షం వెలిబుచ్చారు. కాని దురదృష్టవశాత్తు ఫిలిం ఫెస్టివల్ డైరక్టరేట్‌లో అప్పుడు పనిచేస్తున్న అధికారులు ఈ మార్పును వ్యతిరేకిస్తూ ఈ విషయాలను ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధి దృష్టికి తీసుకు వెళ్ళారు. వారి వాదన విన్న ప్రధానమంత్రి - సమాచార శాఖా మంత్రి గారి నిర్ణయం వెంటనే అమలు చేయవద్దని సందేశం పంపారు. అయితే కేంద్రమంత్రి శ్రీ వసంత్ సాథేగారు, నాతోపాటు ఎన్.ఎఫ్.డి.సి బోర్డు సభ్యులు గట్టిగా కృషిచేసి, ఫిలిం ఫెస్టివల్ డైరక్టరేట్ వ్యవస్థ ఎన్.ఎఫ్.డి.సి ఆధ్వర్యంలో పనిచేయటానికి తగిన ఉత్తర్వులు పొందటంలో సఫలీకృతులమైనాము.

ఎన్.ఎఫ్.డి.సి ఆధ్వర్యంలో 1982 చిత్రోత్సవం కలకత్తా నగరంలోనూ 1983 అంతర్జాతీయ చలనచిత్రోత్సవం ఢిల్లీలోనూ, మరింత శోభాయమానంగా ప్రయోజనకరంగా ఉండేలా నిర్వహించాము. దీని




ఢిల్లీలో అంతర్జాతీయ ఫిల్మోత్సవాల సందర్భంగా కేంద్ర సమాచార మంత్రి ఎన్.కె.పి. సాల్వే, మాలతీ తంబే వైద్య లతో...

ఫలితంగా అంతర్జాతీయ ఫిలిం మార్కెట్‌కూడా గణనీయంగా అభివృద్ధి చెందింది.

ఈ సందర్భంగా ఎన్.ఎఫ్.డి.సి చేసిన కృషిని యావత్ భారతదేశంలోని చిత్ర పరిశ్రమ హరించటమే గాక సహకారం అందించి ఆ వేడుకల్లో ఎంతగానో ఇన్‌వాల్వ్ అయింది. ఈ విధానం 1988 వరకు కొనసాగింది. తరువాత తిరిగి ఫిలిం ఫెస్టివల్ డైరెక్టరేట్‌ను ప్రభుత్వ ఆధ్వర్యంలోకి తీసుకోవటం జరిగింది.


☆☆☆

**'గాంధి' ఘన విజయం**

సర్ రిచర్డ్ ఎటెన్‌బరో దర్శకత్వంలో 'గాంధి' చిత్ర నిర్మాణం ప్రారంభించబడింది. లండన్ నుంచి యూనిట్ సభ్యులు చిత్ర నిర్మాణానికి కావలసిన యంత్ర సామాగ్రితో సహా ఢిల్లీ చేరారు. అశోకా హోటల్‌లో వారందరికీ వసతి సౌకర్యం ఏర్పరచటంతో పాటు ఆ హోటల్ లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో మొత్తం ప్రొడక్షన్ మెటీరియల్ ఉంచటానికి కేటాయించారు.

ఆయన బ్రిటీష్ జాతీయుడే అయినా ఎక్కడా వాస్తవాలకు దూరంగా వెళ్ళకుండా సహజంగా ఉండే విధంగా అంకిత భావంతో అంతర్జాతీయ స్థాయిలో అత్యున్నత సాంకేతిక విలువలతో చిత్ర నిర్మాణం కొనసాగించారు. ఎన్.ఎఫ్.డి.సి తరఫున ఒక ప్రత్యేక యూనిట్‌ను ఏర్పాటు చేసి దానిని ఎన్.ఎఫ్.డి.సి ఆఫీసుకు అనుసంధానం చేసి అటన్‌బరోగారికి అన్ని విధాలా అందుబాటులో వుండే ఏర్పాట్లు చేసాము.

చిత్ర నిర్మాణంలో చారిత్రాత్మక సంఘటనలను చిత్రీకరించటంలో రాజీపడకుండా తగిన కాస్ట్యూమ్స్, ఫర్నీచర్ లండన్ నుండి దిగుమతి చేసుకోవటంతోబాటు ఇండియాలో కూడా అటువంటి వస్తువుల్ని సేకరించి వారికి అందజేశాము. ఉదాహరణకు కథలో గాంధిగారు వైస్రాయ్‌ను కలవటం



1986 ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్‌ను విజయవంతంగా నిర్వహించిన
శ్రీ రాజుగారికి యన్.టి.ఆర్ అబినందన సత్కారం



నేషనల్ ఫిలిం ఫెస్టివల్ బహుమతుల ప్రధానోత్సవ సందర్భంగా అప్పటి రాష్ట్రపతి
శ్రీ ఆర్. వెంకట్రామన్ నుండి అవార్డు అందుకుంటున్న సందర్భం

కోసం ప్రయాణించిన పాత రోల్స్‌రాయిస్ కారులో వెళ్ళారు కాబట్టి సహజత్వం కోసం అటువంటి కారును సంపాదించటం కోసం ఎంతో కష్టపడాల్సి వచ్చింది. ప్రొడక్షన్ యూనిట్ సభ్యుల్ని పంపి లక్నో నుంచి ఒక కారు, పంజాబు నుంచి ఒక కారు, ఢిల్లీలో లభ్యమైన ఒక కారు మూడు కార్లను పరిశీలించిన ఆటన్‌బరో వాటినన్నింటినీ కొనాల్సిందిగా సూచించారు. ఆ తరువాత ఆ మూడు కార్ల విభాగాలను వేరుచేసి వాటితో తిరిగి ఆనాటి వాతావరణం వచ్చేలా ఒక కారుగా మలిచారు.

జలియన్ వాలాబాగ్ సీను చిత్రీకరించటంలో వేలకొలది జూనియర్ ఆర్టిస్టులతోబాటు పౌరుల్ని కూడా సమీకరించి వాస్తవికతకు దగ్గరగా ఉండటం కోసం ఆ సంఘటన జరిగిన ప్రాంతంలోనే చిత్రీకరించారు. ఆనాటి రైలు బోగీలు సేకరించటంలో కూడా ఎంతో శ్రద్ధ తీసుకొన్నారు. వారికి కావలసిన తిను బండారాలు (టిన్‌ఫుడ్) కూడా లండన్ నుంచే దిగుమతి చేసుకొన్నారు. చిత్రం షూట్ చేసిన భాగం రష్ చూడటానికి అశోకా హోటల్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ప్రొడక్షన్ ఏర్పాట్లు ఉన్నాయి.

ఈ సందర్భంలో ఓ చిన్న సంఘటన ఉదహరించాలి. ఎన్.ఎఫ్.డి.సి భాగస్వామ్యం వుంది గాబట్టి ఒక రోజు నన్ను, మా మేనేజింగ్ డైరెక్టరు గారిని అటెన్ బరో వారితో తీసుకెళ్ళి అంతవరకూ చిత్రీకరించిన భాగాలను 'రష్' చూపే ఏర్పాట్లు చేశారు. మేమంతా 'రష్' చూడటానికి వెళ్ళాము. ఆయన లండన్ నుంచి తెచ్చిన ప్రొజక్షన్ ఎక్విప్‌మెంట్ పనిచేయకుండా మొరాయించింది. ఆయన చాలా నిరుత్సాహపడి "మొదటిసారిగా మీరు రావటం, ఇప్పుడే ఎక్విప్‌మెంట్ పనిచేయకపోవడం ఎంతో బాధగా ఉంది. అది సరిచేసేలోపల చిత్రీకరించిన సన్నివేశాల తాలూకు స్టిల్స్ చూడండి". అంటూ ఆల్బమ్స్ తెచ్చి మమ్మల్ని చూడమన్నారు. వారి సహాయకులు ఎంత ప్రయత్నించినా ప్రొజక్షన్ ఎక్విప్‌మెంట్ దారిలోకి రాలేదు. అప్పుడు నేను వారితో నవ్వుతూ 'మీరు ఇండియాలో వున్న ప్రొజక్షన్ ఎక్విప్‌మెంట్ యొక్క సామర్థ్యాన్ని నమ్మకుండా లండన్ నుంచి దిగుమతి చేసుకొన్నారు. అయినా

పడ్డశ్రమ ఫలించలేదు. చివరకు స్టిల్స్ చూసే భాగ్యం మాత్రమే మాకు దక్కింది." అని చమత్కరించాను. ఆయన "నిజమే, ఇండియాలో మూవబుల్ ప్రొడక్షన్ సిస్టమ్ అందుబాటులో ఉందనే విషయం అంగీకరిస్తున్నాము. రేపే అటువంటి ఎక్విప్‌మెంట్ తెప్పించే ఏర్పాటు చేసి మీకు రషెస్ చూపిస్తాను" అన్నారు. అదేవిధంగా 'రషెస్' చూపించారు. ఈ విధంగా ఇండియాలో వివిధ లొకేషన్‌తోబాటు, సౌత్ ఆఫ్రికా, లండన్ మొదలైన ప్రాంతాలలో చిత్రనిర్మాణం పూర్తి చేసుకొంది.

1982లో విడుదలకు సిద్ధం చేసి మొదటి ప్రింటును ఢిల్లీ విజ్ఞాన కేంద్రంలో మొట్టమొదటి సారిగా కొద్దిమంది ప్రత్యేక ఆహ్వానితులకు చూపించారు. అప్పటి మన దేశాధ్యక్షులు జైల్‌సింగ్, ప్రధానమంత్రి, కేంద్ర మంత్రి వసంత సాథే, నిర్మాణంలో సహకరించిన యితర సభ్యులు, అధికారులు చూసారు. అందరూ ముక్తకంఠంతో మెచ్చుకొని సర్ రిచర్డ్ అటన్‌బరోను ఎంతగానో అభినందించారు. గాంధి పాత్ర ధారి బెన్‌కింగ్‌స్లే నటనను అందరూ ప్రత్యేకించి ప్రశంసించారు.

చిత్రం విడుదల తేదీ విషయం చర్చకు వచ్చింది. అప్పుడు అటెన్‌బరో మనం నాలుగైదు నెలలపాటు ఆగి ఆస్కార్ ఎవార్డ్‌లకు ఈ చిత్రాన్ని పంపించి, ఫలితాలు వెలువడ్డ తరువాత విడుదల ఏర్పాటు చేద్దాం. అంతవరకు ఆగివలసి ఉంటుందని ప్రతిపాదించగా దానికి మేమంతా అంగీకరించాము.

ఆయన ఎదురు చూసినట్లు, ఊహించినట్లు 'గాంధి' చిత్రానికి ఉత్తమ చిత్రం, దర్శకుడు, నటుడు మొదలైన పదమూడు ఆస్కార్ ఎవార్డ్‌లు లభించాయి. దాంతో ప్రపంచ వ్యాప్తంగా 'గాంధి' చిత్రం పట్ల మోజు పెరిగింది. అన్ని దేశాల్లోనూ చిత్రం విడుదలయింది. ప్రజాదరణతోబాటు ఆర్థికంగా ఘనవిజయం సాధించింది.

అమెరికా, యూరప్ దేశాల్లో, ముఖ్యంగా యువత అత్యధిక సంఖ్యలో రోజుల తరబడి నిరీక్షించి చిత్రం చూడటానికి పోటీ పడ్డారు.

'గాంధి' ఫిలాసఫీ గూర్చి విన్నవారు, చదివినవారు, చిత్రాన్ని చూసి ఎక్కువగా తెలుసుకోవాలనే ఆసక్తి ఎందరిలోనో కల్గించింది. ఈ చిత్రం ద్వారా భారతదేశం గూర్చి, భారతీయ సంస్కృతి, జీవనశైలి, స్వాతంత్ర్య పోరాట ఘట్టాలు ప్రపంచ ప్రజలందరి దృష్టికి తీసుకు వెళ్ళటం జరిగింది.

చిత్రనిర్మాణ దశలోనే హిందీలోకి డబ్బింగ్ చేపి మనదేశంలో కూడా హిందీ చిత్రాన్ని ఎన్.ఎఫ్.డి.సి ద్వారా విడుదల చేసాము. కానీ ఇంగ్లీషు భాషలో ఉన్న చిత్రానికి దక్కిన ఆదరణ హిందీ చిత్రానికి లభించలేదు. అందువల్ల కొంత నిరుత్సాహపడ్డాము.

☆☆☆

**ఎన్.ఎఫ్.డి.సి సాధించిన ఫలితాలు :**

ఎన్.ఎఫ్.డి.సి ఆర్థిక సహాయంతో పలువురు యువ నిర్మాతలు తక్కువ బడ్జెట్‌తో అనేక మంచి చిత్రాలు నిర్మించటం, అవి ఎన్నో ప్రభుత్వ అవార్డులు పొందటం విదేశాల్లో ప్రత్యేకించి యూరప్ దేశాల్లో అవార్డులు గెలుచుకోవటం ఎన్.ఎఫ్.డి.సి చేసిన కృషికి లభించిన ప్రతిఫలం.

ఎన్.ఎఫ్.డి.సి సహాయంతో మా కోరికపై శ్రీ సత్యజిత్ రే రెండు, మూడు చిత్రాలను ఎన్.ఎఫ్.డి.సి తరఫున నిర్మించారు. గోవింద్ నిహలానీ, శ్యాం బెనగల్ వంటి ప్రముఖులు ఎన్.ఎఫ్.డి.సి సహాయంతో చిత్రాలు నిర్మించారు.

ప్రముఖ నటుడు శశికపూర్ ఎన్.ఎఫ్.డి.సి ఆర్థిక సహకారంతో అపర్ణాసేన్ దర్శకత్వంలో జెన్నిఫర్ ప్రధాన పాత్రలో నిర్మించిన "36 చౌరంగి లేన్" చిత్రం మనీలా ఫిలిం ఫెస్టివల్‌లో ప్రథమ బహుమతి పొందింది. ఇంకా ఎన్.ఎఫ్.డి.సి మన చిత్రాలను విదేశాలకు ఎగుమతి చేయటానికి, విదేశాలలో




NFDC బిల్డింగ్ కాంప్లెక్స్ శంఖుస్థాపన చేసిన నాటి ముఖ్యమంత్రి యన్.టి.ఆర్.తో



APFDC బోర్డు సభ్యులతో సమావేశమైన ఛైర్మన్ రాజుగారు

నిర్మించిన చిత్రాలను దిగుమతి చేసుకొని మనదేశంలో ప్రదర్శించటానికి తగు చర్యలు తీసుకొంది.

చిత్ర నిర్మాణానికి, సహకరించటంతో పాటు థియేటర్స్ లేని ప్రాంతాల్లో థియేటర్లు నిర్మించటానికి ముందుకు వచ్చిన వారికి ఋణసహాయం అందజేస్తూ ఉండేది.

అంతర్జాతీయ చిత్రోత్సవాలలో మనదేశం తరఫున చిత్రాలు ప్రదర్శించటానికి గాను ఆయా సంవత్సరాలలో ఉత్తర అభిరుచితో నిర్మించబడ్డ 21 చిత్రాలను ఎంపికచేసి ఒక ప్యాకేజీగా "ఇండియన్ పనోరమా" ప్యాకేజీని దేశంలోని ఇతర ప్రధాన కేంద్రాలలో అందరూ ఆ చిత్రాలను చూసే విధంగా చర్యలు తీసుకున్నాము.

పలు విధాలుగా ఎన్ఎఫ్‌డిసి ప్రతిష్ఠాత్మకంగా జాతీయ చలనచిత్ర అభివృద్ధి మండలిగా మలచబడి సినీరంగానికి పలు సేవలు అందుబాటులోనికి తేవటానికి చేసిన కృషి మేము పడ్డ శ్రమకు, తపనకు తగ్గ ఫలితాలు లభించటం ఎంతో తృప్తినిచ్చింది. మా కృషిలో మా మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి మాలతి తంబే వైద్య, ఇతర బోర్డు సభ్యులు ఎంతో శ్రమించారు.

నేను మూడు సంవత్సరాల పదవీకాలం పూర్తి చేసుకోవటం అదే సమయంలో మన రాష్ట్రంలో శ్రీ యన్.టి.ఆర్. నేతృత్వంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావటం దాదాపు ఒకేసారి జరిగింది.

☆☆☆

**ఆంధ్రలో ఎఫ్.డి.సి వ్యవహారం**

శ్రీ యన్.టి.రామారావుగారు నాపై ఉన్న అభిమానంతో నన్ను సంప్రదించకుండానే ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్

అధ్యక్షునిగా నన్ను ప్రకటించి 1984లో ఆ బాధ్యతలు నాకు ఒప్పజెప్పారు. అంతేకాకుండా "మీరు కేంద్రంలో చేసిన కృషి మన రాష్ట్రంలో చిత్ర పరిశ్రమ అభివృద్ధి కోసం జేయాలి. కనుక మీరు నాకు అందుబాటులో ఉండాలి." అన్నారు.

అప్పట్లో ఎఫ్.డి.సి కి ఉన్న ముఖ్య విధుల్లో కొన్ని...

- చిత్ర నిర్మాతలకు సబ్సిడీలు అందించటం.
- షూటింగ్‌లకు పర్మిషన్‌లు మంజూరు చేయటం
- ఉత్తమ సాంకేతిక విలువలతో స్టూడియో, రికార్డింగ్, డబ్బింగ్ థియేటర్, అవుట్‌డోర్ ఎక్విప్‌మెంట్ వసతులు మెరుగు పరచటం.

అంతేకాక ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు తగు సూచనలు ఇస్తూ ఆయా యూనిట్స్‌కు స్థలసేకరణజరపటం ద్వారా ఫిలింనగర్‌లో పరిశ్రమ ప్రగతికి, స్థిరత్వానికి చర్యలు తీసుకోవటం. ప్రత్యేకించి మండల స్థాయిలో థియేటర్లు ఉండాలనే ధ్యేయంతో ఎంతో మంది ఔత్సాహికులకు ఆర్థిక వనరులను సమకూర్చటం జరిగింది. ప్రజల్ని చైతన్య పరిచే దిశగా ప్రభుత్వం తరఫున వివిధ శాఖలకు కావలసిన డాక్యుమెంటరీలు తయారు చేయటంలో ఎఫ్.డి.సి ప్రముఖ పాత్ర పోషించింది. నాతో పాటు చిత్ర పరిశ్రమలో అనుభవజ్ఞులైన శ్రీయుతులు దుక్కిపాటి మధుసూదనరావు, యు. విశ్వేశ్వరరావు, కె. రాఘవేంద్రరావు, డి.వి.నరసరాజు, చిరంజీవి, ఎస్. గోపాలరెడ్డి, ఎ. కోదండరామిరెడ్డి, శ్రీమతి భానుమతి, శారద మొ॥వారు దఫదఫాలుగా ఈ ఎఫ్.డి.సి బోర్డులో సభ్యులుగా వ్యవహరించారు.

ఒకరోజు ముఖ్యమంత్రి శ్రీ రామారావుగారితో మీరు అనుమతిస్తే 1986 జనవరిలో జరగాల్సిన 'అంతర్జాతీయ ఫిల్మోత్సవాలు' హైద్రాబాదులో జరపటానికి ఏర్పాట్లు చేస్తామని చెప్పగా ఆయన ఎంతో సంతోషించి "వెంటనే ఆ ఏర్పాట్లు చూడండి, మీకు ఏ సదుపాయం కావాలన్నా అందజేయటానికి ప్రభుత్వ పరంగా నేను సంసిద్ధంగా ఉన్నాను" అన్నారు.

నేను వెంటనే ఎన్.ఎఫ్.డి.సికి నా తరువాత అధ్యక్షునిగా నియమించబడ్డ శ్రీ హృషికేశ్ ముఖర్జీ గారికి బొంబాయి ఫోన్ చేసి నా కోరికను తెలుపగా ఆయన ఎంతో ఆదరంగా "రాజుగారూ, ఈ చిత్రోత్సవాలను ఎన్.ఎఫ్.డి.సి పరిధిలోకి తెచ్చింది మీరు, మీరే స్వయంగా యన్.టి.ఆర్. ఆధ్వర్యంలో నిర్వహించాలనుకొని ముందుకు రావటం నాకు ఎంతో సంతోషంగా ఉంది. ఎన్.ఎఫ్.డి.సి బోర్డు ఈ నెలలోనే సమావేశం కానుంది. ఆ సమావేశానికి మీరు ప్రత్యేక ఆహ్వానితులుగా రావాలి'' అని ఆహ్వానించారు. నేను ఆ సమావేశానికి బొంబాయి వెళ్ళి "చిత్రోత్సవ్-86'' హైదరాబాదులో నిర్వహించటానికి బోర్డు అంగీకారం పొందాను. దీనికి కేంద్ర ప్రభుత్వం అనుమతి కూడా లభించింది.

శ్రీ హృషికేశ్ ముఖర్జీగారి పట్ల నాకెంతో అభిమానం. అలాగే వారికి నాపట్ల ఎంతో వాత్సల్యం ఉండేవి. ఆయన చాలాసార్లు ఎన్.ఎఫ్.డి.సి.లో నేను ఏర్పరిచిన విధానాలు, ఇప్పుడు చైర్మన్‌గా ఉన్న ఆయనకు అమలు చేయటం ఎంతో సంతోషంగా ఉందని చెబుతుండేవారు. వారిని హైద్రాబాదు ఆహ్వానించి శ్రీరామారావుగారితో సమావేశం ఏర్పాటు చేసి 'చిత్రోత్సవ్-86'' కు తగిన ప్రయత్నాలు ప్రారంభించాము. ఆయన తిరిగి బొంబాయి వెళుతూ వారి కోసం ఎదురుచూడకుండా నేనే NFDC 'Defacto Chairman' గా అన్ని నిర్ణయాలు తీసుకోమని ప్రోత్సహించి వెళ్ళారు.

**లలిత కళాతోరణం - ఓ అద్భుత సృష్టి :**

అప్పటికి "చిత్రోత్సవ్-86'' జరపటానికి మూడు నెలలు మాత్రమే వ్యవధి ఉంది. చేయవలసిన ఏర్పాట్లను గురించి యన్.టి.ఆర్. నన్ను ప్రశ్నించారు.

"ఈ చిత్రోత్సవం మనదేశంలో ఎప్పుడూ జరగనంత ఘనంగా మీ నాయకత్వంలో జరగాలి. దీనికి ప్రధానంగా కావలసింది కనీసం 2500

మందికి పైగా ఫిలిం డెలిగేట్స్ పాల్గొనే థియేటర్ సదుపాయం తప్పనిసరిగా ఉండాలి. ఇంతకు ముందు ఢిల్లీలో గాని ఇతర కేంద్రాలలోగాని చలన చిత్రోత్సవాలు నిర్వహించిన సందర్భాలలో-అందుబాటులో ఉన్న థియేటర్లలో దేశ విదేశాల డెలిగేట్స్‌కు, పాత్రికేయులకు తగిన వసతి ఉండేది కాదు. థియేటర్ల కెపాసిటీ వెయ్యి, పన్నెండు వందలు మాత్రమే. అందుచేత ప్రారంభ ముగింపు ఉత్సవాలలో అందరూ పాల్గొనటానికి అవకాశం లభించేది కాదు. ఈ అసౌకర్యాన్ని మనం సరిదిద్దితే చిత్రోత్సవ్ విజయానికి దోహదపడుతుంది. ఉదాహరణకు రవీంద్రభారతి వంటి కేంద్రమైతే చాలా చక్కగా ఉంటుంది.'' అని నేను చెప్పగా ఆయన వెంటనే స్పందించి మరుసటి రోజు ఉదయం ఆనాటి చీఫ్ సెక్రటరీ బి.వి.రామన్ గారిని ఇతర శాఖాధికారుల్ని రవీంద్రభారతిలో సమావేశ పరిచారు. నన్ను, శ్రీ యు. విశ్వేశ్వరరావుగారిని తనతోపాటు రవీంద్ర భారతికి తీసుకు వెళ్ళారు. అక్కడ తగిన ప్రొజెక్టర్ సౌకర్యం లేని విషయం, సీటింగ్ కెపాసిటీ తక్కువ అనేది గమనించి థియేటర్‌ను extend చేద్దాం అని ప్రతిపాదించారు. ఆ సమావేశంలో పాల్గొన్న ఇంజనీర్లందరూ రవీంద్రభారతి నిర్మాణంలో పాటించిన ప్రమాణాలరీత్యా దానిని విస్తరించటం వాంఛనీయం కాదని తెలిపారు. అప్పుడు నేను పబ్లిక్ గార్డెన్స్ వెళ్ళి చూద్దాం. ఓపెన్ థియేటర్ అయినా ఫరవాలేదు. అని సూచించాను. వెంటనే రామారావుగారు మమ్మల్నందర్నీ తీసుకొని పబ్లిక్ గార్డెన్స్‌లో ఉన్న జూబిలీహాలు వద్దకు వెళ్ళి దానికి ముందు ఉన్న లాన్‌కు తూర్పు భాగంలో నిర్మిస్తే బాగుంటుందనే అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు. అప్పుడు ఛీఫ్ సెక్రటరీ మొదలైన అధికారులు "పబ్లిక్ గార్డెన్స్‌కు ఇది కీలక స్థలం సాయంత్రం కాగానే పౌరులు వచ్చి ఈ లాన్‌లో సేద తీర్చుకోవటం అలవాటు కనుక ఇక్కడ థియేటర్ నిర్మించటం బాగుండదు.'' అన్నారు. అలా అయితే ముందుకు వెళ్ళి చూద్దాం అంటూ అక్కణ్ణించి కదిలాం. మేము పరిశీలించగా ఇప్పటి లలిత కళాతోరణం ఉన్న ప్రదేశం చాలా లోతట్టుతో నిరుపయోగంగా ఉండటం

గమనించాము. శ్రీ రామారావు గారితో పాటు నేను, శ్రీ యు. విశ్వేశ్వరరావుగారు ఈ ప్రాంతం అన్ని విధాల ఓపెన్ ఎయిర్ థియేటర్‌కు చాలా బాగుంటుందని, అయిదారువేల మంది పడతారని అనుకున్నాము. అయితే వ్యవధి తక్కువ కావటం వల్ల ఆ పల్లపు ప్రాంతంలో నిర్ణీత గడువులో నిర్మాణం పూర్తి చేయగలమా అనే సందేహం వచ్చింది. "ఎందుకు సాధ్యం కాదు? దానికి తగ్గ అన్ని ఏర్పాట్లు చేద్దాం" అన్నారు. శ్రీ రామారావుగారు ఈ నిర్ణయానికి కూడా కొందరు అధికారులు అడ్డుపెట్టడానికి ప్రయత్నం చేశారు. ఇది చారిత్రాత్మకమైన హైదరాబాదులో "చైనీస్ గార్డెన్" గా పిలువబడే ప్రాంతం గనుక దీనిని వేరే విధంగా ఉపయోగిస్తే ప్రజల్లోంచి వ్యతిరేకత వస్తుందేమో అని కొందరు సందేహం వెలిబుచ్చారు. అప్పుడు నేను "నిజంగా ఇది చైనీస్ గార్డెనా! చూడండి, అటు ఏ విధంగా దుర్వాసనలో దుర్వినియోగ పడుతున్నాదో చూడండి. పైగా నాంపల్లి రైల్వే స్టేషన్ నుంచి ఉన్న గోడలకు పెద్ద రంధ్రం చేయబడి, జనం బహిర్భూమి ప్రదేశంగా వాడుకొంటున్నారో చూడండి! దీనికి కూడా మీరు అభ్యంతరం చెపితే ఎట్లా?" అన్నాను. వెంటనే శ్రీ ఎన్.టి.ఆర్. ఆగ్రహంతో స్పందించి అధికారులను మందలించే ధోరణిలో "ఇక్కడే థియేటర్ మూడునెలల్లో మనం నిర్మించాలి. ఈ నిర్మాణంలో మీ బ్యూరోక్రసీ విధానాలను పక్కనపెట్టి ముందుగా ఈ గోతిని పూడ్పించండి. అందుకు కార్పొరేషన్ అధికారులు అయిదారుగురు ఎస్టాబ్లిష్డ్ కాంట్రక్టర్లను పూడిక బాధ్యతను ఒప్పజెప్పి పదిహేను రోజుల్లో పని పూర్తి చేయాలి" అని ఆదేశించారు. ఇంజనీర్లు అక్కడే ఉండి పనులను చూసుకునేందుకు వీలుగా మరునాడే కేంప్ ఆఫీస్ ఏర్పాటు చేసుకోమని సూచించారు. నావైపు తిరిగి "రాజుగారూ, ఇప్పుడు జూబ్లీహాలు అంతర్భాగంలో ఉన్న లెజిస్లేటివ్ కౌన్సిల్ పనిచేయటం లేదు. అందులో ముఖ్యమంత్రిగా నేను కూర్చొనే గది ఉంది. రేపటినుంచి మీరు ఆ రూమ్‌లో కూర్చొని మీ కార్యాలయం ఏర్పాటు చేసుకోండి. ఈ నిర్మాణకార్యక్రమం యావత్తు పర్యవేక్షిస్తూ ఇక్కడ నుంచే మీ ఎఫ్.డి.సి వ్యవహారాలు చూసుకోవచ్చు. నేను ప్రతిరోజు వచ్చి చూస్తుంటాను"

అని అందరి ఆఫీసర్ల ముందు చెప్పగా ప్రతి ఒక్కరిలోను కదలిక వచ్చి చురుకుగా పనులు ప్రారంభమయ్యాయి. వారి సూచనల ప్రకారం ఇంజనీర్ల కోసం మరునాడే కాంప్ ఆఫీస్ ప్రారంభమయింది.

మర్నాడు ఉదయం నన్ను, శ్రీ యు. విశ్వేశ్వరరావుగారిని వారింట్లో కలవమని చెప్పి టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ శ్రీ వెంకట్రామా రెడ్డి గారిని, మున్సిపల్ కార్పొరేషన్ శాఖాధిపతుల్ని శ్రీ యన్.టి.ఆర్. వారింటిలో సమావేశపరిచారు.

ఆయన స్వయంగా కాగితంపై ఓపెన్ ఎయిర్ థియేటర్ ఎలా ఉండాలో రఫ్‌గా స్కెచ్ వేసి శ్రీ వెంకట్రామా రెడ్డిగారికి వప్పజెప్పి నాలుగు రోజుల్లో మీరు సంపూర్ణమైన ప్లాన్‌తో నా ముందుకు రండి అని ఆదేశించారు. అన్నిటికంటే ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఆ సమావేశానికి ప్రముఖ శిల్పాచార్యులు శ్రీ గణపతిస్తపతిని కూడా పిలిచారు. ఆయనతో థియేటర్ ప్రాంగణంలోకి ప్రవేశించే ప్రాంతంలో పెద్ద నంది విగ్రహాలను రెండు నెలలలోగా అక్కడ ప్రతిష్టించాలని సూచించారు. “దానికి తగ్గ శిల ఎక్కడ నుంచి సేకరిస్తారో మీరు నిర్ణయించండి అందుకు అనువైన ఆదేశాలు నేను జారీ చేస్తాను'' అన్నారు. దీనిని బట్టి థియేటర్ కళాత్మకంగా రూపొందించాలనే ఆయన అభిరుచి మమ్మల్ని ముగ్దుల్ని చేసింది. వారందర్నీ పంపించి తర్వాత మనకు ఎటువంటి ప్రొజక్షన్స్ సిస్టమ్ కావాలని నన్ను ప్రశ్నించారు. అంటే ప్రొజక్టర్‌కూ తెరకు ఉన్న దూరం దృష్ట్యా ఎక్విప్‌మెంట్ ప్రత్యేకంగా ఉండాలేమో అన్న భావన వెల్లడయింది. వెంటనే ఆయనకు ఏదో స్ఫురణకు వచ్చి “డాక్టర్ అడెల్జా అనే ఎక్విప్‌మెంట్ సప్లయిర్ మీకు తెలుసుకదా, మా థియేటర్‌కు ఆయన సప్లయ్ చేశారు'' అని చెపుతూ బొంబాయిలో ఉన్న ఆయనతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే బయలుదేరి రమ్మని కోరారు. డాక్టర్ అడెల్జా ఆ మరునాడే హైదరాబాదు వచ్చి థియేటర్ వాతావరణం పరిశీలించి దానికి తగిన ఎక్విప్‌మెంట్ నిర్ణయిస్తానన్నారు. ఆ కార్యక్రమం నలభై అయిదు రోజుల గడువు లోనే పూర్తి చేయాలని శ్రీ యన్.టి.ఆర్. సూచించారు.

శరవేగంతో జరుగుతున్న ఆ థియేటర్ నిర్మాణం పనులను ప్రతిరోజూ రామారావుగారు వచ్చి పరిశీలించి తగు సూచనలిస్తుండేవారు. నేను కూడా రోజూ మూడు నాలుగు సార్లు జూబ్లీహాలు నుంచి ఆ ప్రాంతానికి వెళ్ళి పనులను సమీక్షిస్తుండేవాడిని. అప్పుడప్పుడు నగరంలో ఉండే శ్రీ విశ్వేశ్వరరావుగారు కూడా వచ్చి నాకు సహకరిస్తుండేవారు.

శ్రీ యన్.టి.ఆర్.గారి ఊహాచిత్రాన్ని అత్యంత పట్టుదలతో కృషిచేసి అక్కడ ఒపెన్ ఎయిర్ థియేటర్ మూడు నెలల నిర్ణీత వ్యవధిలో నిర్మాణం పూర్తిచేసుకొని 90వ రోజున మొదటి స్క్రీన్ టెస్ట్ చూడటం జరిగింది.

"చిత్రోత్సవ్-86" ప్రారంభానికి ఇంకా వారం రోజులే వ్యవధి ఉంది. సౌండ్ సిస్టమ్ పరిశీలించి దానిలో కొన్ని మార్పులు సూచించి వెంటనే అమలు జరిగేలా చర్యలు తీసుకొన్నారు. ఈ థియేటర్‌కు శ్రీ యన్.టి.ఆర్. స్వయంగా "లలిత కళాతోరణం" అని నామకరణం చేసారు. ఆ విధంగా రూపుదిద్దుకున్న "లలిత కళాతోరణం" కేవలం 90 రోజుల్లో పూర్తి కావటం నమ్మశక్యం కాని ఒక అద్భుత సృష్టి. శ్రీ యన్.టి. రామారావుగారి విజన్‌కు, కార్యదీక్షకు అది కలకాలం నిలిచిపోయింది. నిజానికి కళాకారులు, ప్రజలు ఆయనకు ఎంతో ఋణపడి ఉంటారనే నా వ్యక్తిగత భావన. ఆ యజ్ఞంలో చెప్పుకోదగ్గ పాత్ర నిర్మించినందుకు నాకు ఎంతో తృప్తి, ఆనందం మిగిలాయి.

☆☆☆

## "చిత్రోత్సవ్-86"

ఆ 'చిత్రోత్సవ్-86'కు ఒక ప్రాధాన్యత యివ్వటం కోసం శ్రీ యన్.టి.ఆర్. ఆయన సమకాలికులైన నటులను ప్రారంభోత్సవానికి ఆహ్వానిస్తే ఒక ప్రత్యేకత వస్తుందని నేను సూచించగా వెంటనే ఆయన సంతోషించి అప్పటికప్పుడు జాబితా తయారు చేసి బొంబాయి నుంచి

శ్రీ అశోక్‌కుమార్, శ్రీ దిలీప్‌కుమార్, శ్రీ రాజ్‌కపూర్, మద్రాసు నుంచి శ్రీ యం.జి. రామచంద్రన్, శ్రీ శివాజీగణేశన్, బెంగుళూరు నుంచి శ్రీ రాజ్‌కుమార్, త్రివేండ్రం నుంచి శ్రీ ప్రేమ్‌నజీర్, కలకత్తానుంచి శ్రీ సత్యజిత్ రే గార్లను ఆహ్వానిస్తూ ముఖ్యమంత్రి హోదాలో లేఖ వ్రాసారు.

ఆయన ఆహ్వానాన్ని మన్నించి శ్రీ శివాజీ గణేశన్, శ్రీ సత్యజిత్ రే తప్ప మిగతా వారందరూ రావటానికి అంగీకరించారు. శ్రీ యం.జి. రామచంద్రన్ మాత్రం మద్రాసు విమానాశ్రయం దాకా వచ్చి అనివార్య కారణాలవల్ల వెనుకకు తిరిగివెళ్ళారు. మిగతా వారందరూ మాత్రం పాల్గొన్నారు.

సాధారణంగా యిటువంటి చిత్రోత్సవ ప్రారంభ కార్యక్రమంలో దేశాధ్యక్షులు, కేంద్ర సమాచార శాఖామంత్రులు, రాష్ట్ర రాజధానుల్లో జరిగితే ముఖ్యమంత్రి, గవర్నర్ వంటి ప్రముఖులు మాత్రమే వేదికపై ఆసీనులవటం గతంలోని సాంప్రదాయం. దానికితోడు కళాకారుల్ని కూడా ఆహ్వానించటం జరుగుతోంది కాబట్టి నేను యీ వివరాల్ని శ్రీ హృషికేశ్ ముఖర్జీ గారికి ఫోనులో దెలపగా ఆయన హర్షం వ్యక్తం చేశారు.

చిత్రోత్సవ ప్రారంభానికి ఒక రోజు ముందు సాయంత్రమే పైన పేర్కొన్న ప్రముఖులందరూ వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాదుకు చేరుకొంటారు గనుక శ్రీ యన్.టి. రామారావు వారికి స్వయంగా స్వాగతం చెప్పటానికి నన్ను వెంటపెట్టుకొని ఎయిర్‌పోర్టుకు తీసుకెళ్ళారు. బొంబాయి నుంచి వచ్చిన రాజ్‌కపూర్, అశోక్‌కుమార్, దిలీప్ కుమార్ వంటి చిత్ర ప్రముఖులందరూ విమానం దిగుతూ మెట్లదగ్గర స్వయంగా శ్రీ యన్.టి.ఆర్. వేచి ఉండి స్వాగతం పలకటం చూసి ఆశ్చర్యపోయారు.

ఈ చిత్రోత్సవం విజయవంతం చేయడంలో ఎందరో ప్రముఖుల కృషి ఉంది. ముఖ్యమంత్రి గారికి నేను ఇచ్చిన ప్రతిపాదనల వల్ల ఆ ఉత్సవం జరిగిన పది రోజులూ విమానశ్రయం నుంచి, రైల్వేస్టేషన్ నుంచి వచ్చే

మార్గంలో వివిధ సెంటర్లను చక్కగా అలంకరించటం వల్ల నగరానికి కొత్త శోభ, కళ చేకూరాయి.

యావత్ కార్యనిర్వహణకు శ్రీ యన్.టి.ఆర్. కొన్ని కమిటీలను నియమించారు. పట్టణ అలంకరణ పబ్లిసిటీ చూసే బాధ్యత శ్రీ రామోజీరావు గారికి ఒప్పజెప్పారు. అలాగే ఆతిధ్యం, రవాణా, రిసప్షన్ తదితర ఏర్పాట్ల కోసం కొన్ని కమిటీలు ఏర్పడ్డాయి. రిసెప్షన్ కమిటీ బాధ్యతతో పాటు మిగతా కమిటీలన్నిటికీ సమన్వయకర్తగా ఉండే బాధ్యతను నాకు వప్పజెప్పారు. శ్రీ యు. విశ్వేశ్వరరావుగారు చిత్రోత్సవ్‌లో ప్రదర్శించబోయే చిత్రాలను ఎంపిక చేయటం కోసం ఏర్పాటు చేసిన కమిటీలో సభ్యులుగా ఉండి సహకరించారు.

నేను వివిధ ఫిలిం పరిశ్రమకు చెందిన వ్యక్తుల వివరాలు గల డైరక్టరీలు సేకరించి ప్రముఖులందరికీ ప్రభుత్వం తరఫున ఆహ్వానసంఘ అధ్యక్షునిగా వేలకొలది ఆహ్వాన పత్రాలు పంపాము. వారు వచ్చే తేదీ, సమయం, కావలసిన వసతి, రవాణా సదుపాయాలు వీటికి సంబంధించిన సమాచారం పంపవలసిందిగా ఆ లేఖల్లో కోరాము. దానికి స్పందించి ఎందరో జాబులు వ్రాసి ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆ తరహా ప్రయత్నం విజయవంతమైనందుకు సంతోషించాము. వచ్చిన వారందరికీ వీలునుబట్టి నేను, లేకపోతే ఆహ్వాన సంఘ సభ్యులైన శ్రీయుతులు కె. చటర్జీ, హరికృష్ణ, భరద్వాజ ఎప్పటికప్పుడు విమానాశ్రయానికి, రైల్వేస్టేషనుకు వెళ్ళి అక్కడ ఏర్పాటు చేసిన రిసెప్షన్ కౌంటర్ వద్ద నిలచి దేశ, విదేశాల నుంచి వచ్చిన అతిథులకు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలుకుతూ తగిన ట్రాన్స్‌పోర్ట్ ఏర్పాట్లు చేసాము. ఈ సందర్భంగా మేము ఎంపికచేసిన హోటల్ మేనేజ్‌మెంట్ స్కూల్ విద్యార్థులు మాకు ఎంతగానో సహకరించారు.

జూబిలీహాలును ప్రధాన కార్యనిర్వాహక కేంద్రంగా ఏర్పాటు చేసుకొని పత్రికా విలేకరులకు కావలసిన సమాచారం అందుబాటులో ఉంచుతూ అక్కడ నుంచి ప్రతినిధులు రామక్రిష్ణా 70 ఎం.ఎం. థియేటరుకు

రాకపోకలకు గాను తగు సదుపాయం కల్పించాము. ప్రతి అరగంటకు ప్రత్యేకంగా బస్సుల రాకపోకలకు ఏర్పాటు చేశాము. ఈ విషయంలో శ్రీ యన్.టి.ఆర్. సూచనపై మాజీ తమిళనాడు గవర్నర్, ఆనాడు ఆర్.టి.సి. మేనేజింగ్ డైరక్టరుగా వ్యవహరించిన శ్రీ రామ్‌మోహన్‌రావు గారు ప్రతినిత్యం మాతో సంప్రదిస్తూ రవాణాపరంగా బస్సులు, కార్లు సమకూర్చటంలో ఎంతగానో సహకరించారు. వచ్చిన ప్రతినిధులకు రామక్రిష్ణా థియేటర్ వద్ద చక్కటి సదుపాయాలు ఏర్పాటు చేశాము. ఈ ఏర్పాట్లకు ఎ.పి. ఫిలిం ఛాంబర్ వారు ఎంతగానో సహకరించారు. అప్పటి ఫిలిం ఛాంబర్ అధ్యక్షులు శ్రీ యు. విశ్వేశ్వరరావు, ఎ.పి. ఫిలిం ఛాంబర్ తరఫున కార్యదర్శి తమ్మారెడ్డి కృష్ణమూర్తిగారు, వగైరా మిత్రల పర్యవేక్షణలో జరిగిన ఏర్పాట్లను ప్రతినిధులంతా ఎంతగానో ప్రశంసించారు. భోజన సదుపాయాన్ని థియేటర్ వద్ద ఏర్పాటు చేశారు. సిటీ అలంకరణలో శ్రీ రామోజీరావు తీసుకొన్న శ్రద్ధ కారణంగా ఆహ్వానం పలుకుతూ అనేక కూడళ్ళలోనూ, ట్రాఫిక్ ఐలాండ్స్ వద్ద, పెట్రోలు బంకులవద్ద విద్యుత్ దీపాలతో అలంకరించి పట్టణమంతా శోభాయమానంగా తీర్చిదిద్దబడింది. మొదటిరోజు ప్రారంభోత్సవం ఎంతో ఘనంగా నిర్వహించబడి శ్రీ రామారావుగారు నిలబడి ఉండి స్వయంగా పర్యవేక్షించి విజయవంతం చేశారు. ఆ రాత్రి జూబ్లీహాలు వద్ద నున్న మైదానంలో వచ్చిన ప్రతినిధులందరికీ శ్రీ యన్.టి.ఆర్. విందు భోజనం ఏర్పాటు చేశారు. దాంతో పాటు తూర్పుగోదావరి జిల్లా నుంచి బాణాసంచా పేల్చటంలో ప్రసిద్ధిగాంచిన వారిని రప్పించి అద్భుత విన్యాసాలతో కనువిందు చేశారు. ఈ చిత్రోత్సవం విజయానికి కృషిచేసిన నన్ను, ఇతర మిత్రులను శ్రీ రామారావుగారు జూబిలీ హాలులో ప్రత్యేకంగా సభ ఏర్పాటు చేసి మనసారా అభినందించారు. ఆ విధంగా 10 రోజుల పాటు ఆనాటి చిత్రోత్సవ వేడుకలు ఈ రోజువరకు దేశ, విదేశ ప్రతినిధులు మరీ మరీ తలచుకొనే విధంగా "చిత్రోత్సవ్-86" విజయవంతంగా ముగిసింది. ఇది యన్.టి.ఆర్. కార్యదీక్షకు, కళాభిరుచికి అద్దం పట్టిన సన్నివేశం.

**మా కుటుంబ సభ్యులు**

మా డి.వి.యస్. పతాకంపై నిర్మించిన చిత్రాలకు సంబంధించిన నిర్మాణవ్యవహారాల్లో మా కుటుంబ సభ్యుల ఇన్‌వాల్వ్‌మెంట్ గూర్చి ముచ్చటించాల్సి వస్తే... నాకు అయిదుగురు పిల్లలు. మొదటి ముగ్గురు అమ్మాయిలు - లక్ష్మి, రమాదేవి, సుభద్ర. ఇద్దరు అబ్బాయిలు - బుచ్చి వెంకటపతిరాజు (డి.బి.వి.రాజు), వెంకటకృష్ణంరాజు (డి.వి.కె. రాజు). అబ్బాయిలు ఇద్దరూ నేను ముమ్మరంగా చిత్రాలు నిర్మించే రోజుల్లో విద్యాభ్యాసం చేస్తూండేవారు.

1981 ప్రాంతంలో నేను ఎన్.ఎఫ్.డి.సి ఛైర్మన్‌గా తీరికలేకుండా ఉన్న సమయంలో 'ప్రణయగీతం' అనే చిత్రం పూర్తిగా కోనసీమ ప్రాంతంలో అవుట్‌డోర్‌లో నిర్మించతలపెట్టాము. ఆ చిత్ర నిర్మాణవ్యవహారాలు అప్పుడే డిగ్రీ తీసుకొన్న మా పెద్దబ్బాయి డి.బి.వి. రాజుకు ఒప్పజెప్పాము. అతను ఎంతో పద్ధతిగా ఆ చిత్ర నిర్మాణవ్యవహారమంతా దగ్గరుండి చూసుకున్నారు. నేను అప్పుడప్పుడు తీరిక సమయంలో నిర్మాణం జరిగే ప్రాంతానికి వెళ్లి సూచనలిస్తూండేవాణ్ణి. అతను చిత్ర యూనిట్ విషయంలో తీసుకున్న శ్రద్ధ, వారిపట్ల చూపిన ఆప్యాయతకు యూనిట్ సభ్యులంతా ఎంతగానో మెచ్చుకున్నారు.

ఈ చిత్రం వెదిరేశ్వరం, కోసూర్‌నగర్ మొ॥ ప్రాంతాలలో ఎక్కువగా చిత్రీకరించబడింది. శ్రీ గుమ్మడి, సుజాత, చంద్రమోహన్ నటించగా శ్రీ పి. సాంబశివరావు దర్శకత్వం వహించారు. ఈ చిత్రనిర్మాణంలో మాకు అన్ని విధాలా శ్రీయుతులు కోసూరి రామకృష్ణంరాజు, సుబ్బరాజు, చిలువూరి వెంకటరాజు, బంగారురాజు మొ॥ ప్రముఖులు ఎంతగానో సహకరించారు. కాని చిత్రం విడుదలయ్యాక ఆర్థికపరమైన ఫలితాలు మమ్మల్ని నిరుత్సాహపరిచాయి. ఇది భాగ్యరాజా తమిళంలో తీసిన చిత్రానికి రీమేక్. చిత్రం విజయవంతం కాకపోవటంతో చిత్రనిర్మాణ పద్ధతులు నాకు

సరిపడవని మా పెద్దబ్బాయి నిరుత్సాహపడి ఇక చిత్రనిర్మాణం జోలికి నేను వెళ్ళనని ఇతర వ్యాపారాలపై దృష్టి మరల్చాడు. మా రెండవ అబ్బాయి డి.వి.కె. రాజు అప్పుడప్పుడు హిందీ చిత్రనిర్మాణ సమయంలో నాతో కూడా షూటింగ్ వ్యవహారాలు చూస్తుండేవాడు. అతను చదువు పూర్తయ్యాక చిత్ర నిర్మాణంలో నాకు సహకరించటానికి ముందుకు వచ్చాడు. అప్పటినుండి నేను నిర్మించిన ఐదారు చిత్రాలకు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా నిర్మాణ బాధ్యతలు చక్కగా నిర్వహించాడు.

మా పెద్దమ్మాయి చి॥ లక్ష్మికి ప్రముఖ దంతవైద్యులు డాక్టర్ ఎ.ఎస్. రాజుతోనూ, రెండో అమ్మాయి చి॥ రమాదేవికి శ్రీ కె.ఎల్.ఎన్. రాజుతోనూ (మొదట బ్యాంక్ ఆఫీసరు, తరువాత చిత్ర నిర్మాత మరియు ఫైనాన్సియర్), మూడవ అమ్మాయి చి॥ సుభద్రకు విజయకుమార్ రాజుతోనూ వివాహం జరిపించాము. వీరి తండ్రిగారిది పొగాకు వ్యాపారం కాగా ప్రస్తుతం పవర్ యూనిట్స్‌ను కొందరు మిత్రులతో నిర్వహిస్తున్నారు. మా పెద్దబ్బాయి చి॥ బుచ్చి వెంకటపతి రాజుకు ప.గో.జిల్లా మొగల్తూరు రాజా కుటుంబానికి చెందిన చి॥ అరుణకుమారికిచ్చి వివాహం చేశాము. ఇతను ఇండియన్ గ్యాస్ ఏజన్సీతోపాటు బయోటెక్నాలజీ రంగంలో వ్యాపారం చేస్తున్నాడు.

1986లో శ్రీ చిరంజీవి, విజయశాంతి కాంబినేషన్‌లో శ్రీ కె. రాఘవేంద్రరావు దర్శకత్వంలో 'చాణక్య శపథం' చిత్రనిర్మాణం ప్రారంభయింది. అప్పుడే మాస్టర్ డిగ్రీ తీసుకొన్న మా చిన్నబ్బాయి చి॥ డి.వి.కె. రాజు చిత్రనిర్మాణ వ్యవహారాలన్నీ ప్రారంభదశ నుంచి దగ్గరుండి శ్రద్ధగా చూసుకునేవాడు. ఆ విధంగా నాకు కొంత వెసులు బాటు చిక్కి చిత్ర నిర్మాణంతోపాటు, చిత్ర పరిశ్రమ వ్యవహారాలు చూసుకునేవాడిని. ఈ చిత్రం ఊహించినంత సక్సెస్ కాకపోయినా ఆర్థికంగా లాభాలు తెచ్చిపెట్టింది. ఈ చిత్రం తరువాత శ్రీ బాలక్రిష్ణ- విజయశాంతి కాంబినేషన్‌లో 'భానుమతిగారి మొగుడు' నిర్మించాము. ఈ చిత్రం ఎక్కువగా కోనసీమలోనే చిత్రీకరించాము. ఇది కూడా లాభాలు సంపాదించి పెట్టింది.

'చాణక్య శపథం' నిర్మాణసమయంలో మా రెండో అబ్బాయి డి.వి.కె. రాజుకు మా బంధువర్గానికి చెందిన చి॥ సౌ॥ సుభద్రా కృష్ణవేణితో మద్రాసు విజయా శేష్‌మహల్‌లో వివాహం జరిపించాము. దాదాపు మా పిల్లలకు అన్ని సంబంధాలు కూడా మాకు అంతకుముందు ఏదోరకంగా బంధువర్గంలోని వారే కావటం విశేషం. మా తండ్రి శ్రీ బలరామరాజుగారే ఈ వివాహాల విషయంలో కుటుంబ పెద్దగా నిర్ణయాలు తీసుకొంటుండేవారు.

మా తండ్రిగారికి మేము ముగ్గురు కుమారులం. పెద్దవాడినైన నేను కాలేజి నుంచి వ్యాపారం నిమిత్తం మద్రాసులో అడుగుపెట్టాను. అప్పటికి నా వయసు 22 సంవత్సరాలు మాత్రమే. నా తరువాత సోదరుడు కృష్ణంరాజు అమలాపురంలో స్థిరపడి వ్యవసాయపు పనులు చూసుకునేవాడు. ఇతనికి మా చిన్నమేనమామ గారి అమ్మాయి చి॥ శకుంతలతో వివాహం జరిగింది. రెండవ తమ్ముడు చి॥ బుచ్చి వెంకటపతిరాజు కాంట్రాక్టర్‌గా వ్యాపార రంగంలో అడుగుపెట్టాడు. ఇతనికి మాకు దగ్గర బంధువర్గంనుంచి పెదపుల్లేరు గ్రామస్థులైన శ్రీ కలిదిండి నారాయణరాజు గారి కుమార్తె రాజేశ్వరికిచ్చి వివాహం చేశాము. మా కుటుంబం వారు చేస్తున్న వ్యాపారాలకు అనుగుణంగా కవిటం గ్రామం నుంచి రాజమండ్రికి మకాం మార్చటం జరిగింది. మా తాతగారు, నాయనమ్మ కవిటంలో ఉండడం వలన మా తల్లితండ్రులు కొన్ని రోజులు కవిటింలోనూ, కొన్ని రోజులు రాజమండ్రిలోనూ ఉంటూండేవారు.

మా ముగ్గురు సోదరులు తరువాత పెద్ద చెల్లెలు ప్రభావతికి చెరుకుమిల్లి గ్రామస్థులైన శ్రీ సత్యనారాయణరాజుగారితో వివాహం కాగా వారు రాజమండ్రిలో స్థిరపడ్డారు. రెండో చెల్లెలు సీతామణికి లంకలకోడేరు గ్రామస్థులైన శ్రీ అల్లూరి వెంకటపతిరాజు గారితో వివాహం కాగా వారు కొంతకాలం హైద్రాబాదులో లాయర్‌గా ప్రాక్టీసు చేసి తరువాత రాజమండ్రి మకాం మార్చారు. ఈ విధంగా మొత్తం మా కుటుంబానికి రాజమండ్రి

కేంద్రమయింది. నేను సినిమా రంగంలో ఉన్నా, వ్యాపార రంగంలో ఉన్నా నాకు అన్ని విధాలా అండదండలందిస్తూ మా చిత్రాల ఔట్‌డోర్ షూటింగ్ సందర్భంలో నిర్మాణబాధ్యతలు నిర్వహిస్తూ సహకరించినవారు నా చిన్నతమ్ముడు చి॥ బుచ్చి వెంకటపతి రాజు, నా బావమరిది (నా భార్య సోదరుడు, మేనమామ గారి అబ్బాయి) చి॥ వెంకట సూర్యనారాయణ రాజు. వీరిద్దరూ కుటుంబ సభ్యులుగా ఉండటమే గాక నాకు ఆత్మీయులుగా ఉంటూ నాటినుంచి నేటిదాకా ఆంతరంగిక సహచరులుగా ఉన్నారు. నరసాపురం తాలూకా బల్లిపాడు గ్రామస్థులు చి॥ లక్ష్మీపతిరాజు మా అవుట్‌డోర్ షూటింగ్ సందర్భాల్లో ఎంతగానో సహకరించారు.

మా కుటుంబంలో జరిగిన వివాహాలన్నింటికీ శ్రీ ఎన్.టి. రామారావు, శ్రీ త్రివిక్రమరావు సోదరులు దగ్గరుండి వచ్చిన వారందరినీ సాదరంగా ఆహ్వానిస్తూ భోజన సదుపాయాలు వగైరాల్లో ఏ లోటూ రాకుండా స్వయంగా పర్యవేక్షించి తమ ఇంట్లో జరిగిన శుభకార్యంగా భావించి నాకు తోడ్పడుతుండేవారు. వారితో పాటు ఆత్మీయ మిత్రులైన శ్రీ పుండరీకాక్షయ్య, శ్రీ బలరామ్ సోదరులు, శ్రీ యు. విశ్వేశ్వరరావు ఎంతగానో సహకరించేవారు. ఇతర పరిశ్రమ పెద్దలు అండగా వుండేవారు. ఈ సందర్భంగా మరువలేని ఒక సంఘటన ఉదహరించాలి.

1986లో మా చిన్నబ్బాయి వివాహం విజయా శేష్‌మహల్‌లో జరిగిందని చెప్పాను. అక్కడ అలంకరణ వ్యవహారాలన్నీ శ్రీ బి. నాగిరెడ్డిగారు స్వయంగా పర్యవేక్షించారు. అప్పట్లో శ్రీ యన్.టి. రామారావుగారు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి. వారు ఈ వివాహానికి స్వయంగా హాజరవటం కోసం హైదరాబాదు నుంచి విమానంలో మద్రాసు రావలసి ఉంది. అదే విమానంలో అప్పటి లోకాయుక్త, ఛీఫ్ జస్టిస్ శ్రీ ఆవుల సాంబశివరావు గారు, శ్రీ రామోజీ రావుగారు యీ వివాహం కోసం బయల్దేరారు. ముహూర్తం ఉదయం తొమ్మిది గంటలకు కాబట్టి వారందరూ ఉదయం ఆరుగంటలకు

బయల్దేరే ఫ్లయిట్‌లో రావటానికి ఏర్పాట్లు చేసుకున్నారు. వీరంతా బయలుదేరిన విషయం మాకు వర్తమానం అందింది. ముహూర్తం దగ్గరపడుతుంది. కానీ హైదరాబాదు నుంచి రావల్సిన విమానం మద్రాసు చేరలేదని తెలుసుకొని ఆందోళపడ్డాము. నేను, త్రివిక్రమరావుగారు హైదరాబాదుకు ఫోన్ చేయగా వారంతా ఏడుగంటలకే విమానం ఎక్కినట్లు సమాచారం. అయితే ఎనిమిది గంటలకు రావలసిన విమానం ముహూర్తం టైము 9 గంటలకు కావస్తున్నా రాకపోవటంతో ఆందోళన చెందాము.

ఆ తరువాత విచారించగా మాకు తెలిసినదేమిటంటే విమానం బయలుదేరబోతుండగా చెక్‌ఇన్ అయిన ఒక ప్రయాణికుడి లగేజీ లోడ్ అయింది కాని అతడు రాలేదు. దాంతో సెక్యూరిటీ సిబ్బంది యావత్తూ ఆందోళన చెంది మొత్తం విమానంలోని వారందరినీ దింపి, అందరి సామానులు తిరిగి చెక్ చేసి, గైర్ హాజరయిన ప్రయాణికుని లగేజ్ వేరుచేసిన తరువాత విమానం బయలుదేరిందని, ఈ అనివార్య కారణం వల్ల వారు ముగ్గురూ వివాహ వేదికవద్దకు ఆలస్యంగా చేరుకోబోతున్నారన్న వార్త అందింది. ఎందరో సినీ ప్రముఖులు ఆ వివాహానికి విచ్చేసి వధూవరుల్ని ఆశ్వీర్వదించి శ్రీ రామారావుగారి రాకకోసం ఎదురు చూస్తున్నారు. నేను ఆ నూతన వధూవరుల్ని శ్రీ యన్.టి.ఆర్., శ్రీ రామోజీరావు, శ్రీ ఆవుల సాంబశివరావు వచ్చి ఆశీర్వదించేవరకు ఆ పీటల మీదే కూర్చొబెట్టి వారి ఆశీర్వాదం పూర్తయ్యాకనే మిగతా తంతు జరిపించాము. తరువాత భోజన కార్యక్రమాలు పూర్తిచేసుకొన్నాము. ఆ విధంగా శ్రీ రామారావు సోదరులిద్దరూ మా ఇంట్లో జరిగిన ప్రతి కార్యక్రమానికీ వచ్చి ఆశీస్సులు అందించేవారు.


★★★



పెద్ద కుమార్తె చి॥ లక్ష్మి, డా॥ ఎ.ఎస్. రాజుతో వివాహం




పెద్ద కుమార్తె శ్రీమతి లక్ష్మి కుటుంబం



రెండవ కుమార్తె చి॥ రమాదేవి, చి॥ కె.ఎల్.ఎన్. రాజుతో వివాహం.



రెండవ కుమార్తె శ్రీమతి రమాదేవి కుటుంబం




చిన్న కుమార్తె చి॥ సుభద్ర, చి॥ విజయ్‌కుమార్ రాజుతో వివాహం




చిన్న కుమార్తె శ్రీమతి సుభద్ర కుటుంబం




పెద్ద కుమారుడు చి॥ బుచ్చి వెంకటపతిరాజుతో, చి॥ అరుణకుమారి దేవి వివాహం




పెద్ద కుమారుడు చి॥ బుచ్చి వెంకటపతిరాజు కుటుంబం




చిన్న కుమారుడు చి॥ డి.వి.కె. రాజుతో చి॥ సౌ॥ సుభద్రా కృష్ణవేణి వివాహం




చిన్న కుమారుడు చి॥ డి.వి.కె. రాజు కుటుంబం




మనవడు డా॥ చి॥ సురేంద్రకుమార్, చి॥ విజయల వివాహం




ముని మనవడు చి॥ సాకేత్, తల్లిదండ్రులు డా॥ సురేంద్ర, చి॥సౌ॥ విజయ




మనవరాలు చి॥ సౌ॥ స్వరూపతో చి॥ రవీంద్ర వివాహం



ముని మనవడు చి॥ సిద్దార్థ, తల్లిదండ్రులు చి॥సౌ॥ స్వరూప, చి॥ రవీంద్ర




మనవడు చి॥ సతీష్ కుమార్, చి॥ సౌ॥ సునయనల వివాహం




ముని మనవడు చి॥ అర్మాన్, తల్లిదండ్రులు చి॥ సతీష్, చి॥సౌ॥ సునయన




మనవరాలు చి॥ సౌ॥ ప్రశాంతి, చి॥ మధుల వివాహం



మనవరాలు చి॥ సౌ॥ దివ్యతో చి॥ తేజ వివాహం



మనవడు చి॥ ప్రదీప్ కుమార్‌తో, చి॥ సౌ॥ దీప్తి వివాహం




షష్టిపూర్తి సందర్భంగా



షష్ఠిపూర్తి సందర్భంగా





70వ జన్మదినోత్సవ సందర్భంగా కుటుంబ సభ్యులతో




మద్రాసులోని
స్వగృహంలో
నా కుమార్తెలు,
నా తమ్ముని
కుమార్తెలు,
నా సోదరీమణులు,
మేనకోడళ్ళు




కుమార్తె చి॥ సుభద్రతో నా తమ్ముని కుమార్తెలు, నా మేనకోడళ్ళు



సోదరులు చి॥ కృష్ణంరాజు, చి॥ బుచ్చి వెంకటపతిరాజులతో




సోదరుడు చి॥ బుచ్చి వెంకటపతిరాజు కుటుంబం



సోదరి చి॥ ప్రభావతి, బావగారు ఎం. సత్యనారాయణ రాజుగారు



ద్వితీయ సోదరి చి॥ సీతామణి, బావగారు వెంకటపతి రాజుగారు




వియ్యంకుడు శ్రీ కలిదిండి సత్యనారాయణరాజుగారి కుటుంబ సభ్యులు




నా తల్లిదండ్రులతో, నా బావమరిది నడింపల్లి వెంకట సూర్యనారాయణరాజు,
అతని శ్రీమతి చి॥ సౌ॥ లక్ష్మి



కోడైకెనాల్‌లో కుటుంబ సభ్యులతో




షిర్డి యాత్రలలో నేను, నా కుటుంబ సభ్యులు,
నా సోదరులు బుచ్చి వెంకటపతిరాజు, అతని శ్రీమతి రాజేశ్వరి, నా సోదరి సీతామణి




శ్రీ నీలం సంజీవరెడ్డిగారు రాష్ట్రపతిగా ఎన్నికైన సందర్భంలో అభినందనలు అందజేస్తున్న మాజీ ఎం.పి. శ్రీ బలరామరాజుగారు( డి.వి.ఎస్. రాజుగారి తండ్రి), కుటుంబసభ్యులు



తండ్రి శ్రీ బలరామరాజుగారి 90వ జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినప్పుడు కుటుంబ సభ్యులందరి అపురూప కలయిక



'మార్చండి మన చట్టాలు' రికార్డింగ్ సందర్భంగా విజయా పిక్చర్స్ (డిస్ట్రిబ్యూటర్) పూర్ణచంద్రరావుగారితో కో-ప్రొడ్యూసర్ డి.వి.కె.రాజు (డి.వి.ఎస్.రాజుగారి కుమారుడు)



చిత్రనిర్మాణంలో సహకరించిన బావమరిది వెంకట సూర్యనారాయణ రాజు, సోదరుడు బుచ్చి వెంకటపతి రాజు లతో...



నా తల్లిదండ్రులతో నా చినబావమరిది త్రినాధ సోమరాజు అతని శ్రీమతి విజయ

1989లో శోభన్‌బాబు, సుమన్ హీరోలుగా శ్రీ వై. నాగేశ్వరరావు దర్శకత్వంలో 'దోషి-నిర్దోషి' చిత్రాన్ని నిర్మించగా అది విజయం సాధించి శతదినోత్సవం జరుపుకొంది. దాంతోపాటు మా డి.వి.యస్. సంస్థ ప్రారంభించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సంస్థ రజతోత్సవం కావడం యాదృచ్ఛిక సంఘటన. నాకూ, మా కుటుంబానికి, మా యూనిట్ సభ్యులందరికీ ఎంతో ఆనందాన్నిచ్చిన సందర్భం అది.

తరువాత 'ఛాంపియన్' చిత్రాన్ని వినోద్ కుమార్, శోభన కాంబినేషన్‌తో శ్రీ వై.నాగేశ్వరరావు దర్శకత్వంలో నిర్మించాము. దానికి మంచి చిత్రంగా టాక్ వచ్చినా ఆర్థికంగా మమ్మల్ని నిరుత్సాహ పరిచింది. అప్పుడు కథకోసం అన్వేషించి మళయాళంలో విజయవంతమైన చిత్రాన్ని తెలుగుకు తగ్గట్టు మార్పుచేసి శ్రీ కోడిరామకృష్ణ దర్శకత్వంలో వినోద్‌కుమార్, యమున జంటగా 'రాజధాని' అనే చిత్రాన్ని 1993లో నిర్మించాము. ఇది డి.వి.యస్. పతాకంపై నిర్మించబడ్డ ఆఖరి చిత్రం.

☆☆☆

## మిత్రులతో కలసి చిత్ర నిర్మాణం

మా సంస్థ నిర్మించిన చిత్రాలలో నాతోబాటు నాకు స్నేహపాత్రులైన శ్రీ డి.యస్. రాజుగారు నాకు చేదోడువాదోడుగా ఉండేవారు. ఆయనకు నా సహకారంతో చిత్రం నిర్మించాలని అభిలాష కలిగింది. అప్పుడు మా కుమారులిద్దరినీ వారితో భాగస్థులుగా చేర్చి పూర్ణిమా పిక్చర్స్ బ్యానర్‌పై శ్రీ డి.యస్.రాజు నిర్మాతగా 1972లో 'శ్రీకృష్ణాంజనేయ యుద్ధం' తీశారు. ఇందులో శ్రీయుతులు యన్.టి.రామారావు, యస్.వి. రంగారావు, రేలంగి, వాణిశ్రీ మొ॥వారు నటించగా శ్రీ సి.యస్.రావు దర్శకత్వం వహించారు. ఈ చిత్రం విజయవంతమై విజయవాడలో నూరు రోజులు పూర్తి చేసుకుంది. ఇదే పతాకంపై శ్రీ కృష్ణ-మంజుల కాంబినేషన్‌లో సి.యస్.రావు దర్శకత్వంలో 'దేవుడులాంటి మనిషి' చిత్రం నిర్మించాము. దానికి మాతృక కన్నడంలో రాజ్‌కుమార్ నటించిన 'బంగారద మనిష్య'. ఆ తరువాత కొంతకాలానికి శ్రీ డి.యస్. రాజుగారు అనారోగ్యంతో చనిపోయారు.

మరొక ఆప్తమిత్రులు చిలువూరి సీతారామరాజుగారు మా ప్రక్క గ్రామస్థులు కావటం వల్ల నాతో బాటు ఉంటూ నేను సొంతంగా చిత్రనిర్మాణం ప్రారంభించిన తొలిరోజుల్లో భాగస్తులుగా ఉన్నారు. వీరు కూడా సొంతంగా చిత్రం నిర్మించాలని అభిలాషతో నా ఆధ్వర్యంలో ఓ సంస్థను ప్రారంభించి 'దోస్తి' హిందీ చిత్రం ఆధారంగా శ్రీ బాపు దర్శకత్వంలో 'స్నేహం' చిత్రం నిర్మించారు. బేబి రోజారమణి ప్రధానపాత్రగా 'భాగ్యవంతుడు' అనే మరో చిత్రాన్ని కూడా సీతారామరాజు నిర్మించారు. ఆ రెండు చిత్రాలు ఆర్థికంగా దెబ్బతిన్నాయి. శ్రీ సీతారామరాజుగారు నా ఎడల సోదరభావంతో ఆప్యాయంగా ఉండేవారు. దురదృష్టవశాత్తూ అనుకోని విధంగా ఆయన ఆరోగ్యం దెబ్బతినటంతో చిన్న వయసులోనే కీర్తిశేషులయ్యారు.

☆☆☆

## 1981 భారతీయ సినిమా స్వర్ణోత్సవం

1931లో తొలి తెలుగు (భక్త ప్రహ్లాద), హిందీ (అలం ఆరా), తమిళ (కాళిదాసు) టాకీ చిత్రాలు విడుదలయ్యాయి. ఆ విధంగా 1981 సంవత్సరం భారతీయ టాకీ సినిమాకు స్వర్ణోత్సవం. ఆ వేడుకలు మద్రాసులో యూనివర్సిటీ సెంటినరీ హాలులో 'సౌత్ ఇండియన్ ఫిలిం ఛాంబర్' ఆధ్వర్యంలో జరిగాయి. అప్పట్లో తమిళనాడు ముఖ్యమంత్రి యం.జి. రామచంద్రన్ ఆ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొనవలసిందిగా నాటి రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి గారిని ఆహ్వానించాము. వారితో మాతండ్రిగారికి, మా కుటుంబానికి ఉన్న సన్నిహిత పరిచయం వల్ల నేను అప్పటి ఛాంబర్ ప్రెసిడెంటుగా ఉన్న రామానుజంను తీసుకొని ఢిల్లీ వెళ్ళి 'స్వర్ణోత్సవ' వేడుకకు రావలసిందిగా కోరుతూ స్వయంగా ఆహ్వానించాము. దానికి వారు అంగీకరించి ఆ కార్యక్రమం జయప్రదం కావటానికి కారకులయ్యారు.

కర్నాటక, కేరళ ముఖ్యమంత్రులను కూడా ఆహ్వానించాము. అవి నేను ఎన్.ఎఫ్.డి.సి ఛైర్మన్‌గా పనిచేస్తున్న రోజులు. నా ఆహ్వానంపై బొంబాయి తదితర ప్రాంతాలకు చెందిన సినీ ప్రముఖులు ఎందరో ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీ ఎన్టీఆర్, కుమారి జయలలిత ప్రధాన ఆకర్షణగా నిలిచారు. ఆ సందర్భాన్ని పురస్కరించుకొని దక్షిణ భారత దేశానికి చెందిన ఫిలిం పరిశ్రమలోని కొందరు ప్రముఖుల్ని సన్మానించాము. అదే విధంగా హైద్రాబాద్‌లో ఆంధ్రప్రదేశ్ ఫిలిం ఛాంబర్ ఆధ్వర్యంలో నాటి ముఖ్యమంత్రి శ్రీ టి. అంజయ్య గారి సమక్షంలో స్వర్ణోత్సవ వేడుకల్ని ఘనంగా జరుపుకొన్నాము. ఇక్కడ కూడా తెలుగు సినిమా పరిశ్రమకు చెందిన సీనియర్ వ్యక్తులను సన్మానించాము. ఈ వేడుకల్లో సీనియర్ నటులు శ్రీ అక్కినేని నాగేశ్వరరావు ఉత్సాహంగా పాల్గొని ఎంతగానో సహకరించారు. ఇది నాకు ఎంతో తృప్తిని, ఆనందాన్ని ఇచ్చిన సంఘటన.

దీని తరువాత **1991** ప్రాంతంలో తెలుగు టాకీ **60** సంవత్సరాల రజితోత్సవ వేడుకల్ని జరిపితే బాగుంటుందని సూచనలు వచ్చాయి. కాని కారణాంతరాలవల్ల అది సాధ్యపడేలేదు. ఇప్పటికీ అది జరుపుకోలేక పోయామనే దిగులు నాలో ఉంది. కారణం యిటువంటి చారిత్రాత్మకమైన సందర్భాలు తిరిగి మనకు లభించవు. కనీసం ప్లాటినం జూబిలీ వేడుకలైనా ఘనంగా జరిగితే బాగుండుననే ఆశ నాలో ఉంది.

☆☆☆

దేశం లోని ఫిలిం పరిశ్రమకు చెందిన సంస్థల్లో అతి పురాతనమైన సంస్థ 'సౌత్ ఇండియన్ ఫిలిం ఛాంబర్'. ఈ 'సౌత్ ఇండియన్ ఫిలిం ఛాంబర్'కు ఒక పెద్ద ప్రివ్యూ థియేటర్‌తోపాటు, నూతన భవన సముదాయం ఫిలిం ఛాంబర్ కాంపౌండ్‌లో నిర్మించి నాటి తమిళనాడు ముఖ్యమంత్రి శ్రీ అన్నాదురై గారిచే ప్రారంభోత్సవం జరిపించాము. ఇది నేను ఆ సంస్థకు



నాటి రాష్ట్రపతి శ్రీ నీలం సంజీవరెడ్డిగారితో...



కర్ణాటక ముఖ్యమంత్రి శ్రీ గుండూరావుగారితో...

సెక్రటరీగా ఉన్న తరుణంలో జరగటం నాకు ఆనందదాయకం. ఆ సంస్థ యాభై సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నాటి తమిళనాడు ముఖ్యమంత్రి గౌ॥ జయలలితగారు ముఖ్య అతిథిగా మద్రాసు సెంటినరీ హాలులో ఘనంగా ఫంక్షన్ జరుపుకొన్నాము. ఆనాటి ఫిలిం ఛాంబర్ అధ్యక్షులు శ్రీ రమేష్ ప్రసాద్‌గారు అండగా నిలిచి ఉత్సవ నిర్వహణలో చురుకైన పాత్ర నిర్వహించారు. ఇవన్నీ సినీ చరిత్రలో నిలిచిపోయే ముఖ్య ఘట్టాలుగా, మధుర స్మృతులుగా నేను భావిస్తాను.


☆☆☆

**'గాంధి' చిత్ర లాభాలు - వృద్ధకళాకారుల సహాయనిధి**

1989 డిసెంబర్‌లో మన రాష్ట్ర శాసనసభకు, పార్లమెంట్‌కు ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో దురదృష్టవశాత్తు శ్రీ యన్.టి.ఆర్ విజయం సాధించలేకపోయారు. అప్పట్లో నేను రాష్ట్ర చలనచిత్ర అభివృద్ధి సంస్థలో ఛైర్మన్‌గా ఉన్నాను. ఎన్నికల ఫలితాలు వెల్లడికాగానే కొత్త ప్రభుత్వం ఏర్పాటు కాబోతున్న సందర్భంలో నైతిక బాధ్యతగా భావించి నేను నా ఛైర్మన్ పదవికి రాజీనామా చేశాను. ఆ వెంటనే 1990లో శ్రీ విశ్వనాధ ప్రతాప్‌సింగ్ ప్రధానమంత్రిగా కేంద్రంలో నేషనల్‌ఫ్రంట్ ప్రభుత్వం ఏర్పడింది. ఆ ప్రభుత్వంలో శ్రీ పర్వతనేని ఉపేంద్రగారు సమాచార శాఖామాత్యులుగా నియమితులయ్యారు. ఆయన ప్రమాణస్వీకారం చేసిన తర్వాత తిరుపతి వెళ్ళి మద్రాసు మీదుగా ఢిల్లీ వెళుతూ మద్రాసులో ఒకరోజు విడిది చేశారు. 'సౌత్ ఇండియన్ ఫిలిం ఛాంబర్' తరపున చక్కని విందు ఏర్పాటు చేశాము. 1990 జనవరి ప్రథమార్థంలో 'ఇంటర్‌నేషనల్ ఫిలిం ఫెస్టివల్' కలకత్తాలో జరపాలనుకున్నాము. అప్పుడు శ్రీ ఉపేంద్రగారు "నేను కొత్తగా సమాచార శాఖమంత్రిగా బాధ్యతలు స్వీకరించాను. నా ఆధ్వర్యంలో మొదటిసారి ఫిల్మోత్సవ్ కలకత్తాలో జరగబోతుంది. అది చక్కగా నిర్వహించాల్సిన



నాటి ముఖ్యమంత్రి శ్రీ టి. అంజయ్యగారిని సత్కరిస్తున్న దృశ్యం



ఫిలిం పరిశ్రమ సమస్యలు గూర్చి నాటి ప్రధానమంత్రి
శ్రీ వి.పి. సింగ్‌గారితో చర్చిస్తున్న సందర్భంలో...

బాధ్యత నాపై ఉంది. కాబట్టి అనుభవజ్ఞులైన మీరు నాకు సహకరించాలి కనుక మీరు వెంటనే కలకత్తా వెళ్ళి అధికారులకు తగిన సూచనలిచ్చి 'చిత్రోత్సవ్' విజయానికి కృషిచేస్తే నేను సంతోషిస్తాను'' అన్నారు. వారి సూచనల ప్రకారం నేను వెంటనే కలకత్తా వెళ్ళి గత అనుభవం దృష్ట్యా తగిన ఏర్పాట్లు చేశాను. అప్పట్లో బెంగాల్ ప్రభుత్వంలో సమాచార శాఖమంత్రిగా ఉన్న శ్రీ బుద్దదేవ్ భట్టాచార్యగారి సూచనలతోనూ ప్రభుత్వ అధికారులతోనూ చిత్ర పరిశ్రమ ప్రముఖులతోనూ నాకు గతంలో గల సాన్నిహిత్యం వల్ల తగిన ఏర్పాట్లు చేశాను.

చిత్రోత్సవం కలకత్తాలో జరుగుతున్న సందర్భంగా ప్రారంభసభకు శ్రీ ఉపేంద్రగారు వచ్చారు. వారికి నన్ను తిరిగి ఎన్.ఎఫ్.డి.సి అధ్యక్షునిగా నియమించాలనే ఉద్దేశ్యం కలిగి అక్కడకు వచ్చిన చిత్ర పరిశ్రమ ప్రముఖులతో చెప్పి వారి అభిప్రాయాలు కోరారు. వారందరూ ఆ ప్రతిపాదనపట్ల సుముఖత వ్యక్త పరిచారు. దానికి అనుగుణంగా కలకత్తాలోనే తిరిగి ఎన్.ఎఫ్.డి.సి బాధ్యతలు నేను స్వీకరించాలి అని సూచన చేశారు. నాకు జనవరి నెలాఖరుకు ఉత్తరువులు వెలువడటం, ఫిబ్రవరి నెలలో నేను ఛార్జి తీసుకోవడం జరిగింది.

1980 నుంచి 1983 వరకు ఎన్.ఎఫ్.డి.సి తొలి ఛైర్మన్‌గా వ్యవహరించిన రీత్యా 1990కల్లా ఆ సంస్థకు దశాబ్దం పూర్తి కావటం, తిరిగి నేను ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించటం, ఆ సందర్భంగా ఎన్.ఎఫ్.డి.సి దశమ వార్షికోత్సవం శ్రీ ఉపేంద్రగారి సమక్షంలో బొంబాయిలో గొప్పగా నిర్వహించడం చెప్పుకోదగ్గ విశేషం.

ఒకరోజు ఉపేంద్రగారిని ఢిల్లీలో కలిసి వారు సమాచార శాఖామంత్రి అయినందుకు చిత్రపరిశ్రమ వర్గాలు సంతోషిస్తున్నాయని తెలిపి ఆనాటికి పరిశ్రమ ప్రగతికి ప్రతిబంధకంగా మారిన రెండు ముఖ్య సమస్యలను వారి దృష్టికి తీసుకువెళ్లాను. అవి...

1. దేశంలో ముడి ఫిలిం తయారీ కోసం ఊటీలో ఏర్పాటు కావబడిన హిందుస్తాన్ ఫోటో ఫిలిమ్స్ సంస్థ ఎన్నో సంవత్సరాలు గడిచినా అంతవరకు కలర్, బ్లాక్ అండ్ వైట్ నెగిటివ్ గాని పాజిటివ్ గాని తయారు చేయలేకపోయింది. ఆ ఫలితంగా హెచ్చు మొత్తంలో కస్టమ్స్ డ్యూటి చెల్లించి విదేశాల నుంచి ఫిలిం దిగుమతి చేసుకోవాల్సి వచ్చింది.

2. అదే విధంగా ఎప్పుడో యుద్ధ సమయంలో శ్రీ మొరార్జీ దేశాయి గారు ప్రవేశపెట్టగా విడుదల చేసే ప్రతి ప్రింటుపైన పెద్ద మొత్తంలో ఎక్సైజ్ డ్యూటీ చెల్లింపు ఇంకా కొనసాగుతోంది. - ఈ రెండింటి ఫలితంగా విపరీతమైన ఆర్థిక భారం నిర్మాతపై పడటం. కనుక ఈ రెండు డ్యూటీలు రద్దు చేయించి నిర్మాతలను ఆదుకోవాలని వారికి విజ్ఞప్తి చేశాను. వెంటనే శ్రీ ఉపేంద్రగారు సానుకూలంగా స్పందించి ఆయనకు ఆత్మీయులైన ఆనాటి ఆర్థిక మంత్రి శ్రీ మధూ దండావతే గారి దృష్టికి ఈ సమస్యలను తీసుకువెళ్లి వారి సహాయం కోరారు. అప్పుడు ఆర్థిక మంత్రి శ్రీ ఉపేంద్రగారితో రెండు డ్యూటీలు ఒకేసారి రద్దు చేయటం కష్టం కనుక ఒక డ్యూటి ఆ సంవత్సరం బడ్జెట్‌లోనూ, రెండోది మరుసటి సంవత్సరం రద్దు చేస్తాము అని చెప్పారు. వెంటనే మద్రాసులో ఉన్న నాకు ఉపేంద్రగారు ఫోన్ చేసి ఆర్థిక మంత్రిగారి ఉద్దేశ్యం వివరించి రెండు పన్నులలో ముందుగా దేనికి వెసులుబాటు కల్పించాలి అని అడిగారు. ఎక్కువ భారం పడుతున్న ఎక్సైజ్ డ్యూటీ ముందుగా రద్దు చేయండని కోరాను. ఆ విధంగానే ఆ సంవత్సరం బడ్జెట్‌లో ఎక్సైజ్ డ్యూటీ రద్దు చేయబడింది. ఫలితంగా శ్రీ ఉపేంద్రగారి సహాయం వల్ల నిర్మాతలకు ఎంతో మేలు జరిగింది. ఈ దిశగా నా కృషి ఫలించినందుకు ఎంతో ఆనందించాను.

ఎన్ఎఫ్‌డిసి తొలి ఛైర్మన్‌గా ఉన్న కాలంలో (1980-83) గాంధి చిత్రం నిర్మించిన సందర్భంగా ఆ చిత్ర నిర్మాత అటెన్‌బరో గారితో చేసుకున్న ఎగ్రిమెంట్ రీత్యా ఆ చిత్రానికి వచ్చిన లాభాల్లో 5 శాతం ఇండియాలోని వృద్ధ సినీకళాకారులకు ఒక నిధిని ఏర్పాటుచేసి దానికి ఆ

ఫండ్ వినియోగించాలని ఒప్పందం. రెండోసారి అంటే 1990లో నేను ఛార్జి తీసుకొన్న వెంటనే ఆ దిశగా జరిగిన పురోగతి గూర్చి ఆరాతీయగా - తరువాత ఏమీ జరగలేదని, ఆ అంశం వివాదంలో పడి మూడుకోట్ల రూపాయల నిధి ఇంగ్లాండ్ బ్యాంకులో జమకట్టబడిఉందని దానిపై వడ్డీ రూపంలో జమపడ్డ మొత్తం దాదాపు 2 కోట్ల వరకు ఉంటుందని తెలుసుకొన్నాను. వివాదం ఏర్పడటానికి గల కారణాలను విచారించగా పరిశ్రమలోని కొంతమంది మిత్రులు ఆ నిధి ఒక కళాకారులకు మాత్రమే కాక సినీ కార్మికులందరికీ చెందాలని ప్రతిపాదన తీసుకురావటం, ఆ ప్రతిపాదనను శ్రీ అటెన్‌బరో తిరస్కరించి ఆ నిధికి మరో విధంగా ఖర్చు చేసే ఉద్దేశ్యంతో ఉన్నట్లు తెలుసుకొన్నాను. ఈ విషయంలో ఎన్.ఎఫ్.డి.సి తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్న సొలిసిటర్‌తో సంప్రదించి వెంటనే ఎన్.ఎఫ్.డి.సి సినిమా వృద్ధ కళాకారుల సంక్షేమనిధి (ఇండియన్ ఫిలిం ఆర్టిస్ట్ వెల్ఫేర్ ఫండ్ ట్రస్టు) అనే పేరుతో నేను అధ్యక్షుడిగా ఒక ట్రస్టు ప్రారంభించాము. ఆ విషయం అటన్‌బరోకు తెలియపరిచి వెంటనే ఇంగ్లాండ్ బాంకులో ఉన్న సొమ్మును ట్రస్టుకు జమ చేయవలసిందిగా కోరాను. దానిని ఆయన తిరస్కరిస్తూ ఎగ్రిమెంట్ అయిన నాటికి లేకుండా తరువాత ఏర్పడ్డ ట్రస్టుకు ఎందుకు ఇవ్వాలి - దానికి బదులు ఇండియాలో ఉన్న మదర్ థెరిస్సా ట్రస్టు, లండన్‌లో ఉన్న ఇండియన్ స్టేజ్ ఆఫ్ యాక్టింగ్ వంటి సంస్థలున్నాయి. వాటిలో తాను కూడా ట్రస్టీ కనుక వాటి అభివృద్ధికి ఖర్చు పెట్టాలని ప్రతిపాదించారు. ఈ వివాదం పెరిగి కళాకారులకు సహాయం జరగడం లేదన్న ఉద్దేశ్యంతో నాటి సమాచార శాఖతో సంప్రదించి ఏదోవిధంగా రాజీదృక్పథంతో లండన్ బ్యాంకులో జమపడ్డ సొమ్మ ఎన్.ఎఫ్.డి.సి.కి మళ్ళించటానికి ప్రయత్నించాలని చెప్పాను. దానికి మంత్రి శ్రీ అజిత్ కుమార్ పంజా గారు కావాలంటే నేను వాదిస్తాను (ఆయన బార్-ఎట్-లా) రాజీ పడాల్సిన అవసరం లేదని చెప్పారు. అప్పటికే చాలా కాలాతీతం అయిందన్న భావంతో నాకెందుకో ఆ సూచన నచ్చలేదు.



కలకత్తాలలో జరిగిన అంతర్జాతీయ చలన చిత్రోత్సవ ఏర్పాట్లు గూర్చి అప్పటి సమాచార శాఖమంత్రి ఉపేంద్రగారితో ముచ్చటిస్తున్న సందర్భంగా...



NFDC ప్రాంతీయ కార్యాలయం బెంగుళూరులో ప్రారంభించిన కేంద్రమంత్రి శ్రీ ఉపేంద్ర, కర్ణాటక ముఖ్యమంత్రి శ్రీ బంగారప్పలతో ఛైర్మన్ శ్రీ డి.వి.ఎస్.

మా ఎన్.ఎఫ్.డి.సి మేనేజింగ్ డైరక్టర్ శ్రీ రవి గుప్తాను సొలిసిటర్‌తో కలిసి ఓ ప్రతినిధి వర్గాన్ని లండన్ పంపించి అక్కడ ఉన్న సొలిసిటర్‌తో ఆ నిధిని ఎలా మనదేశానికి తీసుకురాగలము అనే విషయం సంప్రదించి రండి, తరువాతనే నిర్ణయం తీసుకొందాము అని కోరాము. ప్రతినిధి బృందం సూక్ష్మంగా అక్కడ ఉన్న పరిస్థితులన్నీ పరిశీలించి ఇండియన్ లా వేరు బ్రిటీష్ లా వేరు అని చెపుతూ ఈ వివాదం కోర్టులో గెలవటానికి అవకాశాలు 50-50 మాత్రమే ఉన్నాయి. ముందుగా ఒక దావా వేయటానికి కోటి రూపాయలు ఖర్చు అవుతుందనీ చెప్పారు. ఈ వివాదం ఇలా కొనసాగటం మంచిది కాదనే ఉద్దేశ్యంతో నేను ఎన్.ఎఫ్.డి.సి బోర్డు లోని ఇతర సభ్యులను సంప్రదించి - మనం 'ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నది మూడు కోట్ల రూపాయలు మాత్రమేకదా! ఈ వ్యవధిలో వచ్చిన వడ్డీ అటెన్‌బరో చేసిన ప్రతిపాదనకు అనుగుణంగా లండన్‌లో ఉన్న ఇండియన్ స్టేజికి మథర్ థెరిస్సా సంస్థకు ఖర్చుపెట్టటానికి ఆయన వెసులుబాటు కల్పించి అసలు మూడు కోట్లు ఇండియాకు రప్పించటంతోపాటు ఇకపై ఆ చిత్రం మీద వచ్చే లాభాలలో అయిదు శాతం క్రమం తప్పకుండా మేము ఏర్పాటు చేసిన ట్రస్టుకు జమ చేయాలి అని సూచించాము. ఈ ప్రతిపాదన అందరికీ ఆమోదయోగ్యమై అటెన్‌బరోతో చర్చించి ఆయనను అందుకు ఒప్పించటంలో సఫలీకృతులమైనాము.

ఆ విధంగా వచ్చిన మూడుకోట్ల రూపాయలను ట్రస్టు తరపున బ్యాంక్‌లో డిపాజిట్ చేసి నెలనెలా దానిపై వచ్చే వడ్డీని దానితోబాటు ఇక ముందు రాబోయే సొమ్ముపై కూడా వచ్చే వడ్డీని కలిపి వెంటనే దేశంలో ఉన్న ఫిలిం పరిశ్రమ కేంద్రాలు అంటే బొంబాయి, మద్రాసు, కలకత్తా, బెంగుళూరు, హైద్రాబాదు, త్రివేండ్రం, మొ॥ నగరాలలో నున్న సినీ పరిశ్రమకు చెందిన పేద కళాకారులకు ట్రస్టు నుంచి నెలనెలా ఆర్థిక సహాయం అందించటంతో పాటు వారికీ వారి కుటుంబ సభ్యులకు విద్యా, వైద్య సౌకర్యాలకు సహాయ పడాలని నిర్ణయించాము.



త్రివేండ్రం (కేరళ)లో NFDC ప్రాంతీయ కార్యాలయం ప్రారంభోత్సవ సందర్భంగా...



నేను స్వయంగా పైన ఉదహరించిన కేంద్రాలలో ఉన్న వృద్ధకళాకారుల్ని ఇంటర్వ్యూచేసి వారికి ఆర్థిక సహాయం నెలనెలా అందే విధంగా ఏర్పాట్లు చేసి ఆ మేరకు అర్హులైన కళాకారుల్ని ఎంపిక చేశాము. ఈ రోజు దేశం మొత్తంమీద దాదాపు వెయ్యిమంది వృద్ధ కళాకారులకు ఎన్ఎఫ్‌డిసి ద్వారా ఆర్థిక సహాయం అందజేస్తున్నారు.

ఇటువంటి ముఖ్యమైన వివాదాస్పదమైన సున్నిత సమస్యను పరిష్కరించి వృద్ధ కళాకారులకు సహాయం అందించటానికి జరిగిన కృషిలో చొరవచూపి ప్రధాన పాత్ర పోషించినందుకు, అటువంటి అవకాశం లభించటం నాకెంతో ఆనందాన్నిచ్చింది.

ఎన్.ఎఫ్.డి.సి వివిధ భాషల్లో చిత్రాలు నిర్మించే వారికి స్క్రిప్ట్ ఆధారంగా ఎంపిక చేసుకొని ఆర్థిక సహాయం అందించటం, అలాగే థియేటర్స్ నిర్మించే వారికి లోన్ రూపేణా ఆర్థికంగా సహకరించటం జరిగేవి. ఇటువంటి సహాయం పొందటానికి గతంలో దరఖాస్తులు ప్రాసెసింగ్‌కు బొంబాయి మీద ఆధారపడాల్సి వచ్చేది. ఈ కార్యక్రమాన్ని వికేంద్రీకరించి అందరికీ అందుబాటులో ఉండే లాగున ప్రతి చిత్ర నిర్మాణకేంద్రంలోనూ ఎన్.ఎఫ్.డి.సి కార్యాలయాలు ఏర్పాటు చేస్తే బాగుంటుందని భావించాము. ఆ దిశగా దృష్టిపెట్టి అంతకుముందే కార్యాలయాలు ఉన్న బొంబాయి, ఢిల్లీ, మద్రాసు కలకత్తాలతోపాటు హైదరాబాదు, బెంగుళూరు, త్రివేంద్రం, గౌహతి, కటక్, పాట్నాలలో ఎన్.ఎఫ్.డి.సి ప్రాంతీయ కార్యాలయాలు ఏర్పాటు చేశాను. నేను రెండవసారి ఛైర్మన్‌గా ఉన్న కాలంలో బోర్డులోని ఇతర సభ్యుల సహకారంతో ఈ కార్యాలయాలు ఏర్పాటు కావటం చెప్పుకోదగ్గ విశేషం.

☆☆☆

## ఫిలింనగర్ కల్చరల్ సెంటర్ ఆవిర్భావం :

ఫిలిం పరిశ్రమకు చెందిన పెద్ద, చిన్న అందరూ కలిసి ఒక చోట ఉండాలనే తలంపుతో ఈ ఫిలింనగర్ ఏర్పాటు చేసుకోవటం జరిగింది. ఆనాటి నుంచి నాకు ఫిలింనగర్‌లోనూ, పరిశ్రమలోనూ ఉన్న పదిమంది సాయంత్రం పూట ఒక చోట చేరి అనుభవాలను పంచుకుంటూ, విశ్రాంతి తీసుకోవటానికి ఒక కల్చరల్ సెంటర్ ఉండాలని నా ప్రగాఢ వాంఛ. కాని నేను ఇతరత్రా వ్యాపకాలలో పడి అటువంటి కేంద్రం పట్ల ఎక్కువగా శ్రద్ధ చూపలేకపోయాను. అయితే నా మిత్రులు ప్రత్యేకించి శ్రీయుతులు ఎ. గోపాలరావు, కె. సూర్యనారాయణ, హరికృష్ణ మొ॥ వారికి అటువంటి కేంద్రం ఏర్పాటుకు ప్రయత్నించమని సలహా ఇస్తుండేవాడిని. ఫిలింనగర్ సొసైటీ అధ్యక్షులైన శ్రీ వి.బి. రాజేంద్ర ప్రసాద్‌గారితో కూడా ఒకటి, రెండు పర్యాయాలు ఈ విషయం ప్రస్తావించాను. 1993లో నేను 'రాజధాని' చిత్రం నిర్మిస్తున్న సమయంలో వైజాగ్‌లో షూటింగ్ జరుగుతుండగా శ్రీ గోపాలరావుగారు, శ్రీ కె. సూర్యనారాయణగారు నన్ను కలవటానికి వైజాగ్ వచ్చారు. వారు, శ్రీ రాజేంద్రప్రసాద్‌గారు అందరూ కలిసి చర్చించి కల్చరల్ సెంటర్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని నిర్ణయించినట్టు, అయితే గతంలో ఫిలింనగర్ విషయంలో నేను ఎలా బాధ్యత వహించానో, ఈ సెంటర్ విషయంలో కూడా నేనే బాధ్యత తీసుకొని ఏర్పాటు చేస్తే బాగుంటుందనే అభిప్రాయానికి వారు వచ్చినట్టూ తెలిపారు. ఈ వార్త విన్న నాకు ఎంతో సంతోషం కలిగి షూటింగ్ పూర్తికాగానే హైద్రాబాదు వచ్చి "తదుపరి కార్యక్రమం నిర్ణయిద్దాం. ఈలోగా ఎక్కడ ఏర్పాటు చేస్తే బాగుంటుందో ఆలోచించండి" అన్నాను. అనుకున్నట్టుగానే 1993 చివరి భాగంలో ఫిలింనగర్ సొసైటీ ఆఫీసుకు ఎదురుగా ఉన్న రెండు బిల్డింగులు అద్దెకు తీసుకొని దానిలో ఫిలిం నగర్ కల్చరల్ సెంటర్' ప్రారంభించాము. దీని నిర్వహణ బాధ్యతకోసం నా అధ్యక్షతన ఒక వర్గం ఏర్పాటు చేశాము. శ్రీ వి.బి. రాజేంద్రప్రసాద్ ఉపాధ్యక్షులుగా, శ్రీ ఎ. గోపాలరావు కార్యదర్శిగా,

శ్రీ కె.యస్. రామారావు సహాయ కార్యదర్శిగా, శ్రీ కె. సూర్యనారాయణ కోశాధికారిగా, శ్రీయుతులు పి. గంగాధరరావు, డి. రామానాయుడు, ఎ. సూర్యనారాయణ, కె. రాఘవేంద్రరావు, కుమార్జీ, రమేష్ ప్రసాద్, జి. హనుమంతరావు మొ॥ మిత్రులు కార్యవర్గ సభ్యులుగా ఒక కమిటీ ఏర్పడింది.

ఆ బిల్డింగులో చక్కని వాతావరణంలో సాయంత్రం సమయంలో టిఫిన్ తీసుకోవటానికి డిన్నర్, లంచ్ వంటి పార్టీలు జరుపుకోవటానికి చక్కని లాన్, ప్రక్క బిల్డింగ్ వెనుక స్థలంలో రెండు బాడ్మింటన్ కోర్ట్స్ ఏర్పాటు చేశాము. వీటితో పాటు జిమ్, క్యారమ్స్, ప్లేయింగ్‌కార్డ్స్, చెస్ వగైరా ఇండోర్ గేమ్స్ కూడా ఏర్పాటు చేసుకొని చిత్ర పరిశ్రమలో ప్రత్యేకించి ఫిలింనగర్‌లో నివసించేవారికి ఈ సౌకర్యం అందుబాటులో ఉండేటట్లు అన్ని హంగులతో రూపుదిద్దుకుంది. మరోవైపు సొసైటీ ఆఫీసు వెనుక ప్రక్కన ఉన్న ఒక రాళ్ళ, గుట్టప్రాంతం రాక్ గార్డెన్, పార్కు వగైరా ఏర్పాట్లు కోసం ఆ మూడున్నర ఎకరాల గుట్టప్రాంతం సొసైటీ ప్రభుత్వానికి (మున్సిపల్ కార్పొరేషన్) అప్పట్లో స్వాధీనం చేయడం జరిగింది. ఎత్తైన ప్రదేశంలో కల్చరల్ సెంటర్ ఉంటే బాగుంటుందనే అభిప్రాయం నాకు రాగా దానికి మా కమిటీ సభ్యులు హర్షించారు. అప్పుడు మేము ఆ స్థలాన్నే మాకు కేటాయించ వలసిందిగా కోరాము.

శ్రీ యన్.టి. రామారావు గారు తిరిగి ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించాక ఒక దరఖాస్తు వ్రాసి ఆ స్థలం మా కల్చరల్ సెంటర్‌కు కేటాయించ వలసిందిగా కోరుతూ స్వయంగా వారికి అందజేశాము. ఆయన వెంటనే నామీద ఉన్న అభిమానంతో సానుకూలంగా స్పందించి ఆ ధరఖాస్తుపై అనుకూలంగా నోట్ వ్రాసి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్టుమెంటుకు పంపారు. కొంతకాలం తరువాత జరిగిన రాజకీయ పరిణామాల రీత్యా ఆయన స్థానంలో శ్రీ చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రి అయ్యారు. అప్పుడు మరొక దరఖాస్తు తయారు చేసి శ్రీ చంద్రబాబు నాయుడు గారిని కలిసి కల్చరల్ సెంటర్ విషయంలో గతంలో




ఫిలింనగర్ కల్చరల్ సెంటర్ ప్రారంభిస్తున్న
నాటి ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబునాయుడుగారు



ఫిలింనగర్ కల్చరల్ సెంటర్ అధ్యక్షులుగా ఇతర కార్యవర్గ సభ్యులతో

శ్రీ యన్.టి.ఆర్. ఏ విధంగా స్పందించారో వారికి విశదీకరించి ఆ స్థలం మాకు ఒప్పగించడంలో సహకరించవలసిందిగా కోరాను. ఆయన కూడా సానుకూలంగా స్పందించి వెంటనే నా విజ్ఞప్తిని ఉదహరించి ఉత్తర్వులు జారీ చేస్తూ ఆ స్థలం మాకు స్వాధీనం చేయాలని, కల్చరల్ సెంటర్‌కు అవసరమైన ఇతర పర్మిషన్‌లు వగైరా ఇవ్వాల్సిందిగా జి.వో. విడుదల చేశారు. కాని మున్సిపల్ ఎడ్మినిస్ట్రేషన్ శాఖవారు హైదరాబాదు మున్సిపల్ కార్పొరేషన్‌వారు ఆ స్థలం కార్పొరేషన్ అధీనంలో ఉంది, అంచేత ఇచ్చిన జీ.వో. ప్రకారం ఆ స్థలం మీరు తీసుకోవటానికి వీలులేదు, మాతో ఎగ్రిమెంట్ కావాలి అంటూ అభ్యంతరం తెలిపారు. ఈ విషయం తిరిగి శ్రీ చంద్రబాబుగారి దృష్టికి తీసుకెళ్ళాము.

ఆయన కార్పొరేషన్ స్పెషల్ ఆఫీసర్ మహంతిగారిని పిలిచి ఆ మూడున్నర ఎకరాల స్థలాన్ని కల్చరల్ సెంటర్‌కు వెంటనే స్వాధీనం చేయాలని చెప్పారు. తరువాత నేను నా మిత్రులు శ్రీ మహంతిగారిని కలిసి మాట్లాడాము. అప్పుడు ఆయన సర్వహక్కులతో స్థలం ఇవ్వటానికి కార్పొరేషన్‌కు అధికారం లేదు, లీజు ప్రాతిపదికపై ఇవ్వగలమన్నారు. అప్పుడు మేము 99 సంవత్సరాలకు లీజు కోరాము. కాని వారు కార్పొరేషన్ బాడీ తీసుకున్న నిర్ణయం ప్రకారం కార్పొరేషన్ స్థలాలు ముప్పై సంవత్సరాలకు మించి లీజుకు ఇవ్వటానికి వీలులేదు కనుక ముప్పై సంవత్సరాల లీజుపై ఆ స్థలం మీకు అప్పగిస్తాం. సంవత్సరపు అద్దె మీకు తోచిన విధంగా నిర్ణయించండి అని మాతో చెప్పారు. అప్పుడు మేము సంవత్సరానికి నామమాత్రపు అద్దె రూ. అయిదువేలు చొప్పున ఇవ్వటానికి పరస్పరం అంగీకారం కుదుర్చుకున్నాము.

ఈ ఉత్తర్వులతో పాటు ఇతర అనుమతులు పొందటానికి ప్రభుత్వ శాఖలతో సంప్రదించటానికి శ్రీ గోపాలరావు గారు, శ్రీ సూర్యనారాయణ గారు ఎంతో కృషి చేశారు. మధ్య మధ్యలో నేను ముఖ్యమంత్రి గారి వద్దనుంచి జాప్యం నివారించటానికి తగు సూచనలు ఆయా శాఖలకు వెళ్ళేలా

చూసేవాణ్ణి. మరోవైపు కొండలతో, గుట్టలతో నిండిన ప్రదేశం కాబట్టి ఆర్కిటెక్ట్ గారిని నియమించి ప్లాన్స్ తయారు చేయించాము. పని ప్రారంభమయింది. దీనికి కావలసిన నిధుల కోసం సభ్యులుగా అనేకమందిని చేర్చుకొని తద్వారా లభించిన సొమ్ముతో కల్చరల్ సెంటర్ ప్రథమ దశ పూర్తి చేశాము. అప్పటి ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడుగారే ఈ బిల్డింగ్ సముదాయానికి శంఖుస్థాపన చేశారు. ఒకటిన్నర సంవత్సర కాలంలోనే సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది వారిచేతనే ప్రారంభోత్సవం చేయించటం ఒక మధుర ఘట్టం. ఆ కల్చరల్ సెంటర్‌లోనే స్పోర్ట్స్ కాంప్లెక్స్, రూఫ్ గార్డెన్ వగైరా ఏర్పాటు చేసుకోవటం కోసం పనులు ప్రారంభించాము. నాతోపాటు శ్రీయుతులు రాజేంద్రప్రసాద్, గోపాలరావు, కె.యస్. రామారావు, కె. సూర్య నారాయణ, హరిక్రిష్ణ తదితర సభ్యులు సహకరిస్తూ ఈ కల్చరల్ సెంటర్‌ను అభివృద్ధి చేస్తూ వచ్చాము.

మేము తలపెట్టిన ఈ కల్చరల్ సెంటర్‌లో వివిధ విభాగాల నిర్మాణ నిమిత్తం పార్లమెంట్, రాజ్యసభ్యులు అయిన శ్రీయుతులు డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు, మోహన్‌బాబు, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, సి. నారాయణరెడ్డి ప్రభృతులు వారి ఎం.పి. లాడ్ ఫండ్స్ నుంచి కొంత మొత్తాన్ని కేటాయించారు. వీరితో పాటు భాగ్యనగర్ స్టూడియో అధినేత శ్రీ బాదం రామస్వామిని నేను, శ్రీ హరికృష్ణ స్వయంగా కలిసి "మీ దాతృత్వంతో ఎన్నో మంచి పనులు చేశారు. మా ఫిలింనగర్ కల్చరల్ సెంటర్ కమ్యూనిటీ హాలు నిర్మించటానికి ఆర్థిక సహాయం చేయాలని" కోరగా ఆయన సహృదయంతో పదిలక్షల రూపాయల విలువైన పనిని వారి సంస్థ ద్వారా చేపట్టి పూర్తి చేశారు. ఆ విధంగా అభివృద్ధి పరంగా ముందుకు సాగుతూ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు కూడా ప్రాథమిక రూపం ఇవ్వటం జరిగింది. దీనిలో స్విమ్మింగ్ పూల్, జిమ్, స్క్వాష్ కోర్ట్, రెండు షటిల్ కోర్ట్స్ ఏర్పాటు చేసుకోవటానికి తగిన వసతులు సమకూర్చుకొనే దిశగా చర్యలు తీసుకొన్నాము.

ఈ విధంగా ఫిలిం పరిశ్రమలోని వారికి, ఆ ప్రాంతంలో నివసిస్తున్న ఇతర పరిశ్రమల వారికి అన్ని సదుపాయాలు ఈ ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌లో కల్పించాలి అన్న ఉద్దేశ్యం చాలా వరకు నెరవేరింది. నేను, నాతో పాటు పైన ఉదహరించిన ఇతర మిత్రులు దాదాపు పది సంవత్సరాలు శ్రమించగా ఆ సముదాయానికి ఒక సుందర రూపం వచ్చింది.

ఆ పదిసంవత్సరాల కృషి వృధా కాకూడదు అనే భావనతో 2003 సెప్టెంబర్ నెలలో జరిగిన సర్వసభ్య సమావేశంలో డాక్టర్ కె.ఎల్. నారాయణగారి అధ్యక్షతన యువకులు ఉత్సాహవంతులతో కూడిన నూతన కార్యవర్గాన్ని ఏర్పరిచాము. వీరు చాలా చురుగ్గా పనిచేస్తూ అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తూ ముందుకు నడిపిస్తున్నారు. ఆ విధంగా ఫిలింనగర్‌లో కల్చరల్ సెంటర్ ఏర్పాటు చేయాలనే తలంపు కార్యరూపంలోకి రావటం వ్యక్తిగతంగా నాకెంతో తృప్తిని మిగిల్చిన సంఘటన.

ఫిలింనగర్ సొసైటీ కార్యాలయ సముదాయంలో ఆంధ్రప్రదేశ్ ఫిలించాంబర్ వారు ఒక అధునాతనమైన ప్రివ్యూ థియేటర్, ఛాంబర్ సభ్యులకు వసతి ఏర్పాట్లు, వీటితో పాటు ఛాంబర్ కార్యాలయం ఏర్పరిచారు.

ఫిలించాంబర్ కాంప్లెక్స్‌లోనే తెలుగు ప్రొడ్యూసర్స్ కౌన్సిల్, మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా), ఫిలిం డైరక్టర్స్ అసోసియేషన్ మొ॥ సంస్థలు తమ కార్యాలయాలు ఏర్పాటు చేసుకున్నాయి.

ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌కు ప్రక్కగా ఉన్న సొసైటీ బిల్డింగ్‌కు మధ్యనున్న స్థలంలో దేవాలయాల సముదాయాన్ని నిర్మించాలని ఫిలింనగర్ సొసైటీ నిర్ణయం తీసుకుంది. దానికి అనువుగా ఒక ట్రస్టు బోర్డు ఏర్పడింది. ఆ బోర్డు శ్రీ వి.బి. రాజేంద్రప్రసాద్ గారి ఆధ్వర్యంలో ఆ ప్రాంతీయులకే కాక నగరంలోని వారందరికీ ఉపయోగపడే విధంగా సర్వాంగసుందరంగా తొమ్మిది దేవాలయాల సముదాయాన్ని తీర్చిదిద్దారు. ఈ దేవాలయ

సముదాయం నిర్మాణం ద్వారా ఫిలింనగర్‌కు ఒక సంపూర్ణత సిద్ధించింది. ఈ దిశగా శ్రీ వి.బి. రాజేంద్ర ప్రసాద్ గారు చూపిన శ్రద్ధాసక్తులు ప్రశంసనీయం.

☆☆☆

**ప్రపంచ తెలుగు సమాఖ్య ఆవిర్భావం :**

నాతోపాటు మదరాసులో ఉన్న తెలుగు ప్రముఖులు కొంతమంది ప్రత్యేకించి శ్రీయుతులు వి.యల్.దత్, గెంగుస్వామినాయుడు, యు. విశ్వేశ్వరరావు, నందగోపాల్ (ఆడిటర్) డాక్టర్ చిట్టూరి సత్యనారాయణ, శంభు ప్రసాద్ మొ॥ వారు ఆంధ్రప్రదేశ్, తమిళనాడులతోపాటు తెలుగు భాషావ్యాప్తికి దేశ విదేశాల్లో కృషి చేస్తున్న వివిధ సంస్థలను విలీనం చేసి ఒక కేంద్ర సంస్థ ఏర్పాటు చేస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డాము. అదే సమయంలో న్యూయార్కులో "తానా" సభలు జరుగబోతున్నాయి. ఆ కార్యక్రమ ఏర్పాట్ల కోసం అప్పటి తానా అధ్యక్షులైన శ్రీ నల్లమోతు సత్యనారాయణగారు మా అభిప్రాయం విని ఎంతో సంతోషించి ఆ తరహా సంస్థ నిర్మాణంలో పాలుపంచుకోవటానికి సంసిద్ధత వ్యక్తం చేశారు.

మా యీ కృషిలో శ్రీ గోపాలరెడ్డిగారు, శ్రీమతి లక్ష్మీ రఘురామ్ గారు, శ్రీ బి.యస్.ఆర్. క్రిష్ణగారు కూడా ఎంతో ఉత్సాహంగా పాల్గొని సంస్థ ఆవిర్భావించటానికి ఎంతగానో తోడ్పడ్డారు. ఈ దిశగా దఫదఫాలుగా చర్చలు జరిగి ఒక శుభ ముహూర్తాన మద్రాసులో మా ఇంటి వద్ద పెద్దలందరూ సమావేశమయ్యారు. ఈ సమావేశంలోనే "ప్రపంచ తెలుగు సమాఖ్య" అనే పేరు మీద సంస్థ ఏర్పాటుకు అంకురార్పణజరిగింది. శ్రీ గెంగుస్వామి నాయుడు అధ్యక్షుడుగా శ్రీ వి.ఎల్. దత్ ఉపాధ్యక్షులుగా, శ్రీ నల్లమోతు సత్యనారాయణ సెక్రటరీ జనరల్‌గా, శ్రీ యు. విశ్వేశ్వరరావు కార్యదర్శిగా, శ్రీ శంభు ప్రసాద్ కోశాధికారిగా తాత్కాలిక కార్యవర్గం

ఏర్పడింది. డా॥ చిట్టూరి సత్యనారాయణ, శ్రీమతి లక్ష్మీ రఘురాం, నేనూ, శ్రీ నందగోపాల్, శ్రీ జె.యం. నాయుడు శ్రీ రంగ భాష్యం, శ్రీ యల్.వి. రామయ్య, శ్రీ బి.యస్.ఆర్. కృష్ణ కార్యవర్గ సభ్యులు. దీనికి బైలాస్. (నియమ నిబంధనలు) తయారు చేయటానికి నా అధ్యక్షతన ఒక కమిటీ ఏర్పడింది. ఈ సంస్థలో జీవిత సభ్యత్వానికి రూ. పదివేలు, అదే మహిళలకు, యువతకు అయితే రూ. అయిదువేలు, సాంస్కృతిక అనుబంధ సంస్థలకు రూ. 1500గా నిర్ణయించాము. శ్రీ యు. విశ్వేశ్వరరావు కార్యదర్శిగా ఎంతో పట్టుదలతో ఈ సంస్థ నిర్వహణ బాధ్యతలు నిర్వహించారు.

1993 జూన్ మొదటి వారంలో "తానా" మహాసభలు న్యూయార్క్ మహానగరంలోని లాంగ్ ఐలాండ్‌లో జరుగుతున్న సమయంలో తానా వారి ఆహ్వానంపై మేమంతా న్యూయార్క్ వెళ్ళి "ప్రపంచ తెలుగు సమాఖ్య" లాంఛనప్రాయంగా శ్రీ యన్.టి. రామారావు గారి చేతుల మీదుగా ప్రారంభించాము. దీని కార్యాలయం మద్రాసు మౌంట్‌రోడ్‌లోని కె.సి.పి. బిల్డింగ్‌లో ఏర్పాటు చేసుకొని కార్యక్రమాలు ప్రారంభించాము. దేశ విదేశాల్లోని సాంస్కృతిక సంస్థల్ని సంధానపరుస్తూ జీవిత సభ్యుల్ని చేరుస్తూ ముందుకు సాగింది. రెండు సంవత్సరాల కొకసారి ప్రపంచ తెలుగు మహాసభలు జరపాలని నిర్ణయించి 1994లో ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభలు మద్రాసు మహానగరంలో శ్రీ వి.ఎల్.దత్‌గారు అధ్యక్షులుగా నాటి ముఖ్యమంత్రి శ్రీ యన్.టి. రామారావు ప్రారంభించారు. మూడు రోజులపాటు జరిగిన ఆ మహాసభల్ని తెలుగు సాహితీ, సంస్కృతులకు అద్దంపట్టే పలు కార్యక్రమాలు అంటే - సాహిత్య గోష్ఠి, వివిధ రంగాలకు చెందిన సెమినార్స్, లలిత కళలు, అవధానాలు, హస్తకళలు, పెయింటింగ్స్, ఒకటేమిటి ఇంచుమించు సాంస్కృతిక రంగానికి చెందిన వివిధ అంశాల మీద సెమినార్స్, చర్చలు, దేశవిదేశాలకు చెందిన ఆయా రంగాలలోని ప్రముఖులు వాటిలో పాల్గొనటం చెప్పుకోదగ్గ విశేషం.

ఇదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ ఈ మహాసభల్ని తిరిగి 1996లో హైదరాబాదు లలిత కళాతోరణంలోనూ, 1998లో ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లోనూ నిర్వహించాము.

ప్రపంచ తెలుగు సమాఖ్య నిబంధనల ప్రకారం రెండేళ్ళ కొకసారి కార్యవర్గాన్ని ఎన్నుకోవాలి. అలాగే అనుబంధ విభాగాలకు కూడా కార్యవర్గాన్ని ఎన్నుకోవటం ఆనవాయితీ. ఈ సంస్థలో మహిళా విభాగం చాలా చురుకుగా పనిచేస్తుండేది. దానికి తొలి అధ్యక్షురాలిగా శ్రీమతి లక్ష్మీ రఘురామ్‌గారు తరువాత శ్రీమతి ఇందిరాదత్ గారు, శ్రీమతి సుచరితారెడ్డి గారు అధ్యక్షులుగా వ్యవహరించారు.

హైదరాబాదు కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ విభాగం పనిచేస్తోంది. 1996 హైదరాబాదులో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల్లో శ్రీ వి.యల్. దత్‌గారు అధ్యక్షులుగా, నేను ఉపాధ్యక్షునిగా శ్రీ యు. విశ్వేశ్వరరావుగారు సెక్రటరీ జనరల్‌గా, ఐ.టి.సి.కి చెందిన శ్రీ చిత్తరంజన్ గారు కార్యదర్శిగా శ్రీ శంభు ప్రసాద్‌గారు కోశాధికారిగా కార్యవర్గం ఏర్పడింది. హైదరాబాదులో సంస్థ వ్యవహారాలు చూడటంలో బ్రహ్మయ్య అండ్ కంపెనీకి చెందిన శ్రీ సీతా రామయ్యగారు, ప్రగతి సంస్థ అధినేత శ్రీ హనుమంతరావుగారు, శ్రీ అట్లూరి సుబ్బారావుగారు, శ్రీ యం.యస్. రెడ్డి గారు, శ్రీమతి సుచరితా రెడ్డిగారు, శ్రీమతి మంజులతగారు, శ్రీమతి రమాదేవి గారు ఎంతగానో సహకరించారు. హైద్రాబాద్ మహాసభలు విజయవంతం కావటంతో శ్రీ అంజిరెడ్డిగారు తదితర పెద్దలు ప్రముఖపాత్ర వహించారు. 1998లో ఢిల్లీలో జరిగిన మహాసభల్లో నన్ను అధ్యక్షునిగా ఎన్నుకొన్నారు. ఉపాధ్యక్షులుగా శ్రీమతి ఇందిరాదత్‌గారిని, శ్రీ నాగేంద్ర ప్రసాద్‌గారిని ప్రధాన కార్యదర్శిగా, శ్రీ జె.యం. నాయుడుగారిని కార్యదర్శిగా, శ్రీ శంభుప్రసాద్‌గారిని కోశాధికారిగా, శ్రీ రంగ భాష్యంగారు, ఇతర ప్రముఖులతో కార్యవర్గం ఏర్పడింది.

ఈ సమాఖ్య ఆధ్వర్యంలో శ్రీ వి.యల్. దత్ గారు అధ్యక్షులుగా, శ్రీ యు. విశ్వేశ్వరరావు మేనేజింగ్ ట్రస్టీగా నేను, శ్రీ నందగోపాల్, శ్రీ శంభు ప్రసాద్, బి.యస్.ఆర్. కృష్ణ ట్రస్టీలుగా **1994**లో ఒక ట్రస్టు ఏర్పడి, ఆ ట్రస్టు తరుపున ఒక మంచి గ్రంథాలయం కూడా ఏర్పాటు చేసుకొన్నాము. ఈ ప్రపంచ తెలుగు సమాఖ్య కోసం మదరాసులో టి.నగర్, జి.యన్. చెట్టి రోడ్‌లో అంకుర్ ప్లాజా రెండవ అంతస్థులో కొంత భాగం కొని సొంత కార్యాలయం, గ్రంథాలయం ఏర్పాటు చేశాము. ఈ బిల్డింగ్ సేకరణవిషయంలో శ్రీ యు. విశ్వేశ్వరరావు, శ్రీ నందగోపాల్ ప్రధాన పాత్ర వహించారు.

నా అధ్యక్షతన ఏర్పడ్డ కార్యవర్గం **2000** సం॥లో విశాఖ పట్టణంలోనూ, **2002**లో సింగపూర్‌లోనూ, మహాసభలు దిగ్విజయంగా నిర్వహించింది. విశాఖపట్టణంలో నాటి పార్లమెంట్ సభ్యులు శ్రీ యం.వి.యస్. మూర్తి అధ్యక్షులుగా శ్రీ వి. సీతారామయ్య గారు (బ్రహ్మయ్య కంపెనీ), శ్రీ తిరుపతిరాజు గారు కార్యదర్శులుగా ఆహ్వాన సంఘం మరియు ఇతర కమిటీలు ఏర్పడి అంతకు ముందు జరిగిన సభల కంటే అద్భుతంగా నిర్వహించబడ్డాయని దేశ, విదేశ ప్రతినిధులు ప్రశంసలందుకున్నాయి. ఈ వేడుకలు విజయవంతం కావటానికి పార్లమెంటు సభ్యులు శ్రీ మూర్తి చూపిన శ్రద్ధ మరువలేనిది.

సింగపూర్‌లో జరిగిన సభలకు శ్రీయుతులు బి.వి.ఆర్. చౌదరి, ప్రకాశరావు, సాంబశివరావు, సత్యమూర్తి మొ॥ వారు ఆ సభలు విజయవంతం కావటానికి ఎంతగానో సహకరించారు.

ఈ ప్రపంచ తెలుగు సమాఖ్య సభల్లో చెప్పుకోదగ్గ విశేషం ఏమిటంటే **1994**లో మదరాసు ప్రారంభోత్సవ సభల్లో మంత్రి హోదాలోనూ, మిగతా మహాసభల్లో ముఖ్యమంత్రి హోదాలోనూ శ్రీ చంద్రబాబు నాయుడు గారు పాల్గొనటం ఒక చరిత్రాత్మక సంఘటనగా చెప్పుకోవచ్చు.



1998లో ఢిల్లీలో జరిగిన 'ప్రపంచ తెలుగు సమాఖ్య' వార్షికోత్సవ సందర్భంలో
శ్రీ వి.ఎల్. దత్‌గారి నుండి అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీ డీవీఎస్



కేంద్ర సమాచార శాఖ మంత్రి శ్రీ అజిత్ కుమార్ పాంజాతో

సింగపూర్‌లో జరిగిన మహాసభల్లో శ్రీమతి ఇందిరాదత్ గారు అధ్యక్షులుగాను, శ్రీ బి.యస్.ఆర్. కృష్ణ గారు ప్రధాన కార్యదర్శిగాను తదితర సభ్యులతో కార్యవర్గం ఏర్పడింది. సాంప్రదాయ సిద్ధంగా ప్రతి ఉప ఖండం నుంచి ఒక ఉపాధ్యక్షుడు ఎన్నుకోబడటం ఆనవాయితీ ఇండియాతో పాటు ఏషియా, యూరప్, అమెరికా, ఆఫ్రికా ఖండాల నుంచి ఒక్కొక్క ఉపాధ్యక్షుణ్ణి ఎన్నుకొన్నాము. ఈ ప్రపంచ తెలుగు సమాఖ్యలో దాదాపు అన్ని దేశాల నుంచి వచ్చిన ప్రతినిధులు వారి వారి అనుభవాలు వివరించి సమాఖ్యకొక సమగ్రతను సమకూర్చారు.

శ్రీమతి ఇందిరాదత్ గారి ఆధ్వర్యంలో మదరాసుతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రధాన కేంద్రాలలో స్థానిక ప్రముఖుల సహకారంతో వివిధ కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.

2004 డిసెంబర్‌లో బెంగుళూరులో ఆరవ ప్రపంచ తెలుగు మహాసభలు జరుగనున్నాయి. తెలుగు భాష, సంస్కృతి వీటి అభివృద్ధి కోసం ఆవిర్భవించిన ప్రపంచ తెలుగు సమాఖ్య సంస్థలో నేను కూడా గణనీయమైన పాత్ర నిర్వహించడం నాకెంతో సంతోషం కలిగించింది.

☆☆☆

**తృప్తినిచ్చిన గుర్తింపులు :**

సినిమా పరిశ్రమ నాపై చూపిన అభిమానం, గౌరవం, నమ్మకం దానికి తగ్గట్టు పరిశ్రమకు నేను చేసిన సేవలు, సాంఘిక, సంక్షేమ సేవా కార్యక్రమాలు వీటికి గుర్తింపుగా ఇటు చిత్ర పరిశ్రమ అటు రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు అందించిన పురస్కారాలు, వాటిలో కొన్ని ప్రధాన ఘట్టాలను ఉదహరిస్తాను.

తెలుగు సినిమా ప్రారంభ దశలో మొట్టమొదటి మూకీ చిత్రం 'భీష్మ ప్రతిజ్ఞ' నిర్మాత శ్రీ రఘుపతి వెంకయ్య. ఆయన జ్ఞాపకార్థం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలుగు సినీ రంగంలో విశిష్ట సేవలందించిన ప్రముఖులను

రఘుపతి వెంకయ్య అవార్డుతో గౌరవించే సాంప్రదాయం 1980 నుంచి మొదలయింది. 1988 సంవత్సరానికి ఆ అవార్డుకు నన్ను ఎంపిక చేసి 1989 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు గారు ఆ అవార్డును నాకు అందజేసి గౌరవించారు.

1992లో అమెరికాలోని న్యూయార్క్ నగరంలో 'తానా' వార్షిక సభలో శ్రీ యన్.టి.ఆర్. చేతులమీదుగా నాకు 'లైఫ్‌టైమ్ ఎచీవ్‌మెంట్ ' అవార్డు అందించటం నేను మరువలేను. గతంలో ఒకసారి 'దక్షిణభారత ఫిలిం ఫ్యాన్స్ అసోసియేషన్' వారు మద్రాసులో ముగ్గురు న్యాయమూర్తుల ద్వారా నాకు 'లైఫ్‌టైమ్ ఎచీవ్‌మెంట్ ' అవార్డు అందజేసిన ఘట్టం కూడా మరువలేను.

దక్షిణభారత చలనచిత్ర వాణిజ్య మండలి ఆధ్వర్యంలో నాలుగు భాషలలో పరిశ్రమకు చెందిన వివిధ సంస్థల ప్రముఖులందరూ సంప్రదించుకొని నేను సినీ పరిశ్రమకు చేసిన సేవలకు గుర్తింపుగా అప్పటి అధ్యక్షుడు శ్రీ గంగాధరన్ గారి ఆధ్వర్యంలో 'సినీ భీష్మ' బిరుదును నాకు అందజేశారు. 1995లో మద్రాసులో జరిగిన ఓ విస్తృత సమావేశంలో తెలుగు, తమిల, కన్నడ మళయాళ చిత్ర పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖుల సమక్షంలో శ్రీ శివాజీ గణేశన్ చేతుల మీదుగా ఆ బిరుదుతో పాటు జ్ఞాపికను అందజేసి నన్ను సత్కరించటం నేను మరువలేని మధుర ఘట్టం.


శ్రీ అక్కినేని నాగేశ్వరరావు జన్మదినోత్సవ సందర్భంగా ఆయన పేరిట లైఫ్‌టైమ్ ఎచీవ్‌మెంట్ అవార్డును వారి చేతులమీదుగా రసమయి సంస్థ వారు నాకు అందజేసి నన్ను సత్కరించారు.

2001 సంవత్సరంలో భారత ప్రభుత్వం నాకు 'పద్మశ్రీ' అవార్డును ప్రకటించింది. అప్పటి రాష్ట్రపతి కె.ఆర్. నారాయణన్ చేతుల మీదుగా 22.3.2001 తేదీన రాష్ట్రపతి దర్బారు హాలులో ఆ అవార్డును నాకు అందజేసి గౌరవించటం మరో మధుర స్మృతి.

ఇటీవల 'ఆకృతి' సాంస్కృతిక సంస్థ 14.11.2004న హెచ్.ఎమ్. రెడ్డి అవార్డుతో మాజీ ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడుగారి చేతులుమీదుగా నాకు అందజేయటం ఓ తీపి గుర్తు.

సినీ రంగంపట్ల సమాజం పట్ల బాధ్యతగల వ్యక్తిగా నా పని నేను చేసుకు పోతున్న తరుణంలో నేను ఆశించని, ఎదురు చూడని ఇటువంటి గుర్తింపు గౌరవాలు లభించినపుడు పొందే తృప్తి, ఆనందం వెలకట్టలేనివి, మరువలేనివి.


★★★



తండ్రి బలరామరాజుగారి 90వ జన్మదినోత్సవం సందర్భంగా
తల్లి శ్రీమతి సుభద్రమ్మగారు, సోదరులు బుచ్చి వెంకటపతిరాజులతో



నాకు చిత్రనిర్మాణ నిర్వహణలో
సహకరించిన ఆత్మీయుడు
శ్రీ లక్ష్మీపతిరాజు



నాటి ముఖ్యమంత్రి శ్రీ యన్.టి.ఆర్ నుండి ప్రతిష్ఠాత్మకమైన
'రఘుపతి వెంకయ్య' అవార్డు అందుకుంటున్న సందర్భంగా...



తానా వార్షిక సభల్లో యన్.టి.ఆర్ చేతులమీదుగా 'లైఫ్‌టైమ్ ఎచీవ్‌మెంట్' అవార్డుతో



ఆకృతి సంస్థ 'హెచ్.ఎం. రెడ్డి' అవార్డును మాజీ ముఖ్యమంత్రి
శ్రీ చంద్రబాబు నాయుడుగారి చేతులమీదుగా అందజేస్తున్న దృశ్యం



'పద్మశ్రీ' అవార్డు గ్రహీతకు కన్నడ చిత్ర పరిశ్రమ నీరాజనం...




అక్కినేని జన్మదినోత్సవం సందర్భంగా 'ఏ.ఎన్.ఆర్ లైఫ్‌టైమ్ ఎచీవ్‌మెంట్' అవార్డును
శ్రీ డి.వి.ఎస్. రాజుగారికి నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అందజేస్తున్న దృశ్యం
(రసమయి నిర్వహణ)



మద్రాసులో దక్షిణభారత ఫిలిం ఫాన్స్ అసోసియేషన్‌వారి 'లైఫ్ టైమ్ ఎచీవ్‌మెంట్' అవార్డును
ప్రదానం చేస్తున్న న్యాయమూర్తులు (ఒకరు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి,
ఇద్దరు మద్రాసు హైకోర్టు న్యాయమూర్తులు)



రాష్ట్రపతి శ్రీ కె.ఆర్. నారాయణన్ నుండి 'పద్మశ్రీ' పురస్కారాన్నందుకుంటున్న దృశ్యం





'పద్మశ్రీ' సర్టిఫికెట్





'పద్మశ్రీ' మెడల్



‘భీష్మ’ అవార్డు ప్రధానంలో భాగంగా శ్రీ శివాజి శాలువాతో సత్కరిస్తున్న దృశ్యం



‘భీష్మ’ అవార్డును అందజేస్తున్న శ్రీ శివాజీ గణేశన్ మరియు శ్రీ కమల్ హాసన్



ప్రతిష్ఠాత్మకమైన **'భీష్మ'** అవార్డుతో

దక్షిణ భారత చలనచిత్ర వాణిజ్య మండలి

శ్రీ డి.వి.ఎస్. రాజుగారికి

**'భీష్మ'**

అవార్డు అందజేసిన సందర్భంగా

పలువురు ప్రముఖులు వెలుబుచ్చిన

అభిప్రాయాలు...

## INDIAN COUNCIL FOR CULTURAL RELATIONS

I am indeed very happy that the South Indian Film Chamber of Commerce has proposed to honour Shri D.V.S. Raju with 'BHISHMA' Award on September 19, 1995 at Madras, in recognition of his outstanding contribution to the cause of Indian film industry for the last four decades.

I was very keen to be personally present on this happy occasion and felicitate my good friend, Shri D.V.S. Raju, with whom I share a happy association for a long number of years. I send my best wishes for the success of the function. Please convey my warm regards and congratulations to Shri D.V.S. Raju on the conferment of this coveted honour.

With regards,

Yours sincerely,

**VASANT SATHE**

శ్రీ డి.వి.ఎస్. రాజు గారు సౌజన్యశీలి, నాకు ఆప్తమిత్రులు, సోదరతుల్యులు. సినీ పరిశ్రమలో నాకు గల అంతరంగిక ముఖ్యులలో ముఖ్యులు శ్రీ రాజు గారు.

ఆయన ఏ పని తలపెట్టినా క్రమశిక్షణతో అంకిత భావంతో కృషి చేసి విజయవంతంగా పూర్తి చేయగల కార్యదీక్షాదక్షుడు. చిత్ర పరిశ్రమ హైదరాబాద్‌కు తరలించే దిశగా ఆయన చేసిన కృషి నిరుపమానము.

నేను పలుసందర్భాలలో తలపెట్టిన సాంఘిక, సామాజిక సేవా కార్యక్రమాల్లో క్రమశిక్షణతో నాకు అండగా బాధ్యత వహించిన ఆత్మీయులు. వివిధ హోదాల్లో అటు చిత్ర పరిశ్రమకూ యిటు సాంఘిక సేవారంగానికీ వీరు చేసిన కృషి నిరుపమానమైనది.

వారి సేవలకు, సామర్థ్యానికి గుర్తింపుగా దక్షిణ భారత ఫిలిం పరిశ్రమ 'భీష్మ' ఎవార్డుతో వారిని సత్కరించటం నాకు ప్రత్యేకంగా సంతోషదాయకం. ఇక ముందు కూడాపరిశ్రమాభివృద్ధికి వారి సేవలు అందివ్వాలని ఆకాంక్షిస్తున్నాను.

**– ఎన్.టి. రామారావు**

I am glad to learn that the South Indian Film Chamber of Commerce, Madras, is bringing out an excellent and informative souvenir in connection with the grand function being arranged to honour Shri D.V.S. Raju with the 'BHISHMA' Award in recognition of his outstanding contributions to the Indian Film Industry.

I take this opportunity to congratulate Shri D.V.S. Raju, the doyen of Indian Film Industry, on his winning the award.

I congratulate the South Indian Film Chamber of Commerce in their earnest effort to honour merit.

**A.K. ANTONY**
Thiruvananthapuram

B.R. FILMS

It is a matter of pleasure and pride for me to learn that the South Indian Film Chamber of Commerce is honouring a very dear and respected friend of mine - Shri D.V.S. Raju Garu. Mr. Raju has a wonderful track record both as a producer and a film man. His services to the film industry have been signal. his contribution to NFDC and its shaping is praiseworthy. I wholeheartedly welcome this great gesture by the Film Chamber and wish my friend Shri D.V.S. Raju Garu all the best in future. May God bless him with all round love, happiness and prosperity.

Film Chamber deserves to be complemented on this function.

It would have given me great pleasure to attend and personally congratulate my very dear friend but I am not keeping good health. In fact I told the gentleman who telephoned me about this august function. So my apologies to the Chamber and to Shri Raju.

Once again wishing him the very best in life.

With regards,

Yours sincerely
**B.R. CHOPRA**

# సందేశం

నా మొదటి చిత్రం 'బేదర కణ్ణప్ప' వాల్ పోస్టర్లు వేయించిన మద్రాసులోని 'సినీ లితో వర్క్స్' యజమానిగా శ్రీ డి.వి.ఎస్. రాజుగారితో తొలి పరిచయం. ఎన్టీఆర్, సావిత్రి లాంటి ప్రతిభావంతులైన నటీనటుల్ని తెలుగు సినీరంగపు ప్రముఖ తారలుగా తీర్చిదిద్దిన ప్రఖ్యాత తెలుగు చలనచిత్ర నిర్మాణ సంస్థ, వాహినీ స్టూడియోలో అప్పుడప్పుడూ కలుసుకుంటూ వుండేవాళ్లం. ఎంతో ఆత్మీయంగా పలకరించేవారు.

ఆయన నిష్ఠావంతుడైన కర్తవ్యదీక్షాదక్షుడు. ఆయన కార్యతత్పరత క్రమశిక్షణలంటే నాకు చాలా గౌరవం. చలన చిత్రపరిశ్రమ అభివృద్ధికై సదా పరితపించే ఆయన సలిపిన కృషి, ఆయన్ని 'దక్షిణ భారత చలనచిత్ర వాణిజ్య మండలి'కి అధ్యక్షునిగా ఎంపికయ్యేలా చేసింది. ఇది ఆయన నిస్వార్థ సేవానిరతికి నిలువెత్తు సాక్ష్యం. ఆయన్ని భారత ప్రభుత్వం 1980లో 'అఖిల భారత చలనచిత్ర అభివృద్ధి సంస్థ'కి అధ్యక్షునిగా ఎంపిక చేయడం ఆయన ప్రతిభాపాటవాలకి ప్రత్యక్ష నిదర్శనం. ఆ కాలంలోనే యావత్ప్రపంచాన్నీ మెప్పించిన 'గాంధి' చిత్రం నిర్మించబడటం ప్రతి భారతీయుడూ గర్వించదగిన విషయం. ఆయన నిజంగానే దక్షిణ భారత చలనచిత్ర పరిశ్రమకి భీష్మాచార్యునివంటివారు. అటువంటి ఆయనకీ ఆయన సేవానిరతికీ ఈ భీష్మ పురస్కారం లభించడం అభినందనీయం.

మన చలనచిత్ర పరిశ్రమకి ఆయన నిస్వార్థ సేవ నిండునూరేళ్లూ లభించాలని ఈ శుభసందర్భంలో ఆ పరమాత్ముని ప్రార్థిస్తున్నాను.

– రాజ్‌కుమార్

I am very happy to learn that Shri D.V.S. Raju garu is being honoured with the prestigious 'Bhishma Award' for his distinguished services to the movie-industry in various capacities, by the South Indian Film Chamber of Commerce.

I had the pleasure of coming into close personal contact with Shri D.V.S. Raju garu during the formative period and later in conducting the first conference of the World Telugu Federation, in December 1994, at Madras. The systematic way in which he planned cultural programmes for the 3-day WTF Conference earned for him the admiration of on e and all and greatly helped in the success of the Conference.


His service to the film industry in general and to the South Indian movie-industry in particular, as a leading film maker, a former President of the Film Federation of India, Bombay, have all brought him distinction as a leader in the motion picture industry.

A gentleman to the core and unostentatious, Shri D.V.S. Raju garu is respected by one and all not only as a leading film maker and also as a prominent Telugu citizen of the City of Madras.

My wife Mrs. Indira Dutt joins me in extending our hearty congratulations and best wishes to him on this happy occasion.

With regards,


Yours sincerely
**Dr. V.L. DUTT**
President, World Telugu Federation (WTF)



NFDC కార్యాలయం, ముంబయిలో డి.వి.యస్.రాజుగారు




తెలుగు చలన చిత్ర పరిశ్రమాభివృద్ధి సదస్సు సందర్భంలో...



డా॥ నీలం సంజీవరెడ్డిగారితో చిత్రరంగ ప్రముఖులు



సుందర్‌లాల్ నహతా, శ్రీకాంత్ నహతా, డి.రామనాయుడు, ఎ. పుండరీకాక్షయ్య లతో




బీహార్ గవర్నరుగా మద్రాసు వచ్చిన శ్రీ పెండేకంటి వెంకటసుబ్బయ్యగారిని
శ్రీ డి.వి.యస్. రాజు, తండ్రి శ్రీ బలరామరాజుగారితో కలిసి ఆహ్వానిస్తున్న సందర్భం



ముఖ్యమంత్రి తుఫానునిధికి రూ. 46.98 లక్షలు దక్షిణభారత చలనచిత్ర వాణిజ్య మండలి
తరపున కార్యదర్శి శ్రీ పుండరీకాక్షయ్యగారితో కలిసి అందజేస్తున్న శ్రీ డి.వి.యస్.



పద్మశ్రీ అవార్డు సందర్భంగా రాష్ట్ర క్షత్రియ సేవా సంఘం తరఫున
మెమెంటోను ప్రదానం చేస్తున్న శివరామరాజుగారు



కేంద్రమంత్రి అయిన సందర్భంగా శ్రీ దాసరిని అభినందిస్తున్న శ్రీ రాజుగారు



గ్రంథకర్త శ్రీ డి.వి.ఎస్. రాజుగారితో యీ పుస్తకాన్ని రూపుదిద్దిన
శ్రీయుతులు ఎస్.వి. రామారావు, ఎం.ఎస్. సూర్యనారాయణ, టి. శ్రీకాంత్



మారిషస్‌కు ఫిలిం డెలిగేషన్‌ను తీసుకువెళ్లిన సందర్భంగా మారిషస్ ఫైనాన్స్ మినిస్టర్ సర్ రంగడు గారితో, సుందర్‌లాల్ నహతా, కొట్టార్కర్, యు. విశ్వేశ్వరరావు



29వ అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్ ప్రారంభోత్సవ సందర్భంగా సమాచార శాఖామంత్రి శ్రీ జైపాల్ రెడ్డి, ఢిల్లీ ముఖ్యమంత్రి శ్రీ సాహెబ్ సింగ్ వర్మలతో

**చలన చిత్రోత్సవాల విశేషాలు :**

1981 లో మారిషస్‌లో దక్షిణభారత చలనచిత్రోత్సవాలకు నా నాయకత్వంలో ఎన్‌ఎఫ్‌డిసి నుంచి మా ప్రతినిధి వర్గం వెళ్ళాము. అక్కడున్న వారం రోజులలోను ప్రభుత్వం తరఫున మా ప్రతినిధి బృందం అప్పటి మారిషస్ దేశాధ్యక్షుడయిన సర్.సి.వో. రాంగులామ్‌గారు యితర మంత్రులు ఏర్పాటుచేసిన పలు సమావేశాల్లో పాల్గొని చలనచిత్ర రంగానికి చెందిన విషయాలను చర్చించాము.

1983లో మనీలాలో జరిగిన అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో కూడా నా నాయకత్వంలో ఎన్‌ఎఫ్‌డిసి నుంచి కొన్ని చిత్రాలను కొన్ని సాంస్కృతిక బృందాలను తీసుకొని వెళ్ళాము. ఆ చిత్రోత్సవం భారీ ఎత్తున ఘనంగా జరిగింది. పలు దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. నాటి ఫిలిప్పీన్ అధ్యక్షులు మార్కోస్ సతిమణి శ్రీమతి ఇమాల్‌దా మార్కోస్ ఆధ్వర్యంలో ఆహ్వాన సంఘం ఏర్పడి ప్రతిష్ఠాత్మకంగా ఆ చిత్రోత్సవాలను నిర్వహించారు.

1998 జనవరిలో ఢిల్లీలో జరిగిన అంతార్జతీయ చలన చిత్రోత్సవంలో నన్ను ముఖ్య అతిథిగా ఆహ్వానించి ఆ చిత్రోత్సవాలను నాతో ప్రారంభించటం నా జీవితంలోని మరువలేని మరో చరిత్రాత్మక సంఘటన.

పలుసార్లు రాష్ట్ర ప్రభుత్వ నందీ అవార్డు కమిటీలు సభ్యునిగాను, రెండుసార్లు జ్యూరీ అధ్యక్షునిగానూ వ్యవహరించాను. జాతీయ స్థాయిలో ఒకసారి నేషనల్ ఫిలిం అవార్డ్స్ జ్యూరీ కమిటి అధ్యక్షునిగా వ్యవహరించాను.

2001 సంవత్సరంలో హైద్రాబాదు నగరంలో జరిగిన అంతర్జాతీయ బాలల చలనచిత్రోత్సవం జ్యూరీ కమిటీ అధ్యక్షునిగా వ్యవహరించి పలుదేశాలనుంచి వచ్చిన జ్యూరీ సభ్యులతో కలసి దేశ విదేశాల నుంచి వచ్చిన బాలల చిత్రాలు వీక్షించటం మరో మధురాను భూతి.


⋆⋆⋆



ఢిల్లీలో 29వ అంతర్జాతీయ చలన చిత్రోత్సవాన్ని ముఖ్య అతిథిగా
జ్యోతి వెలిగిస్తున్న దృశ్యం (సహకరిస్తున్న ప్రముఖ నటి మనీషా కొయిరాలా)



నాటి హోంమంత్రి మాధవరెడ్డి, సమాచారశాఖ మంత్రి తమ్మినేని సీతారాం లు
నంది అవార్డు జ్యూరీ ఛైర్మన్‌గా శ్రీ రాజుగారిని సత్కరిస్తున్న దృశ్యం



యన్.టి.ఆర్ నేషనల్ అవార్డ్స్ కమిటీ మెంబర్‌గా అప్పటి ముఖ్యమంత్రి
శ్రీ చంద్రబాబు నాయుడు గౌరవిస్తున్న సందర్భం. ప్రక్కన అవార్డు గ్రహీత శ్రీ శివాజీ గణేశన్

**నంది నాటకోత్సవాలు - కొత్త ఊపిరి :**

2002 ఫిబ్రవరి నెలలో నాటి ముఖ్యమంత్రి శ్రీ యన్. చంద్రబాబు నాయుడు గారు నాకు తెలియజేయకుండా ఆంధ్రప్రదేశ్ ఫిలిం, టి.వి. నాటక రంగ అభివృద్ధి సంస్థ నన్ను అధ్యక్షునిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం నాకు ఆశ్చర్యం కలిగించింది. ఇది నేను ఊహించని మరో పరిణామం. నాతో పాటు కొంతమంది చిత్ర ప్రముఖులు ఆ బోర్డులో సభ్యులుగా నియమించబడ్డారు. ఫిలిం పరిశ్రమ, టి.వి. నాటకరంగ అభివృద్ధికి ముఖ్య సలహాదారుగా శ్రీ అక్కినేని నాగేశ్వరరావుగారిని, ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారుగా శ్రీ కె. రాఘవేంద్రరావు గారిని అంతవరకు ముందుగానే నియమించారు. వీరంతా వివిధ విభాగాలకు చెందిన నంది బహుమతుల ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించటానికి ఎంతో సహకరించారు.

భారతదేశంలో కొన్ని రాష్ట్రాలలో ఉత్తమ చిత్రాలకు బహుమతులు ఇచ్చి ప్రోత్సహించే అలవాటు ఉంది. మన రాష్ట్రంలో మాత్రం మరో అడుగు ముందుకు వేసి చలన చిత్రాలతో పాటు టివి, నాటక రంగాలకు కూడా అవార్డు లిచ్చి ప్రోత్సహించిన నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుగారి అభిరుచి చెప్పుకోదగ్గది. దీనికి తమవంతు సహకారం అందించిన నాటి సినిమాటోగ్రఫి మంత్రి శ్రీ దేవేందర్ గౌడ్‌గారి కృషి కూడా ప్రశంసనీయం.

మేము చార్జి తీసుకున్న తరువాత, పెండింగులో ఉన్న 7 సంవత్సరాల నంది, టి.వి.ఉత్సవాలు మూడు రోజుల పాటు రవీంద్రభారతిలో నిర్వహించటం, నాటక రంగానికి సంబంధించిన రెండు సంవత్సరాల నంది అవార్డుల ప్రధానోత్సవం కూడా పూర్తి చేసుకొని మూడు సంవత్సరాలకు చెందిన ఫిలిం అవార్డుల ప్రధానం లలిత కళాతోరణంలో జరిపించాము. ఆ విధంగా పెండింగు లేకుండా నంది అవార్డుల ప్రధానోత్సవాలు పూర్తిచేశాము.

అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న యన్.టి.ఆర్. జాతీయ స్థాయి ఫిలిం అవార్డు ఇవ్వటంలో కూడా రాష్ట్ర ప్రభుత్వానికి ఎ.పి.ఎఫ్.డి.సి. సహకారం అందించింది. ఈ అవార్డుకు ఎంపికయిన వారిని అయిదు లక్షల రూపాయలతో సత్కరించటం ఆనవాయితీ. 1996లో ప్రవేశపెట్టబడిన ఈ అవార్డు ఆ సంవత్సరానికి శ్రీ అక్కినేని నాగేశ్వరరావుగారికి అందజేశాము. దరిమిలా ఈ అవార్డుకు అర్హులయిన వారిని నిర్ణయించే కమిటీలో నేను, శ్రీ అక్కినేని నాగేశ్వరరావు గారు, శ్రీ సి. నారాయణరెడ్డి గారు సభ్యులం. ఆ తరువాత అవార్డు అందుకున్నవారు - శ్రీ దిలీప్‌కుమార్ (1997), శ్రీ శివాజీ గణేశన్ (1998), లతామంగేష్కర్ (1999), శ్రీ హృషికేశ్ ముఖర్జీ (2000), శ్రీమతి భానుమతి (2001), శ్రీ రాజ్‌కుమార్ (2002). అలాగే రఘుపతి వెంకయ్య అవార్డు ఎంపిక ప్రక్రియకు సంబంధించిన కమిటీలో కూడా నేను కొన్నిసార్లు సభ్యునిగా వ్యవహరించాను.

నాటక రంగాన్ని ప్రోత్సహించే దిశగా నంది నాటకోత్సవాల్లో సాంఘిక, నాటక విభాగంలో కొత్త రచనలు పోటీల్లో పాల్గొనాలని సూచించాము. పద్యనాటక విభాగంలో కూడా కథావస్తువు పాతదే అయినా రచనా విధానం కొత్త పుంతలు తొక్కింది. ఫలితంగా ఎన్నో పౌరాణిక, చారిత్రాత్మక పద్య నాటకాలు ఈ పోటీలో చోటు చేసుకొని ప్రేక్షకుల మెప్పుపొందాయి.

ఒక విధంగా చెప్పాలంటే ఆంధ్రనాటక కళాపరిషత్ కార్యక్రమాలు అంతరించాక నాటక రంగ పునరుద్ధరణకు ప్రభుత్వం చేపట్టిన నంది నాటకోత్సవాలు కొత్త ఊపిరిని పోశాయి.

చిన్నప్పటినుంచి నాటకాలన్నా, పద్య నాటకాలన్నా ఎంతో ఆసక్తి ఉన్న నాకు ఈ నాటక యజ్ఞంలో పాలుపంచుకోవటం ఎంతో ఆనందాన్నిచ్చింది.

నేను ఆశావాదిని. నా 75 సంవత్సరాల జీవితకాలంలో నా ఊహ తెలిసినప్పటినుంచి నేటివరకు నేను చేసే కృషిలో సహకరించే మిత్రులు లభించడం ఓ అరుదైన విశేషం. వారి సహకారం వల్లనే నేను ఇటు చిత్ర పరిశ్రమకు గాని అటు సామాజిక పరంగాగాని సేవలు అందించే అదృష్టం నాకు కలిగింది. గ్లామర్‌కు నిలయమైన రంగుల సినీ పరిశ్రమలలో ఉంటూ మచ్చలేని స్వచ్ఛమైన జీవితాన్ని గడపగలిగే అవకాశం రావడం దైవ లిఖితం.

ఈ సేవా దృక్పథం నా తండ్రిగారి వద్దనుంచి నాకు వారసత్వంగా లభించిన సంపద. ఆయన రాజకీయాలలో ఉన్నా ప్రజాసేవే పరమావధిగా జీవించారు.

సినిమా వ్యాపారం లాభాపేక్షతే కూడినదే! కాదనను. అయితే ధనార్జనే ప్రధానధ్యేయం కాకూడదు. ఏ పరిశ్రమలో అయితే మనం ఉన్నామో దాని అభివృద్ధికి బాధ్యత వహించి కృషి చేయాలనేది నా తపన. నిజానికి నేను పరిశ్రమ మనుగడ, ప్రగతికోసం వెచ్చించిన సమయాన్ని పూర్తిగా చిత్ర నిర్మాణంవైపు మళ్లించితే మరో పాతిక చిత్రాలు నిర్మించేవాడినేమో! కాని చిత్ర రంగానికి చెందిన పలు సంస్థలలో వివిధ హోదాల్లో సేవలందించడంలో నాకు గొప్ప తృప్తి లభించింది. ఈ దిశగా నా కుటుంబ సభ్యులు అందించిన సహకారం, నా పట్ల వారికి గల నమ్మకం, విశ్వాసం నన్నెప్పుడూ ముందుకు నడిపిస్తూ వచ్చాయి.

ఇక్కడ శ్రీ యన్.టి. రామారావుగారి గూర్చి ప్రత్యేకంగా ప్రస్తావించాలి. మేమిద్దరం ఏ శుభ ముహూర్తంలో కలుసుకున్నామో గాని ఆ ముహూర్త బలం వల్ల ఆయనా, వారి సోదరులు శ్రీ త్రివిక్రమరావుగారు, వారి జీవితాంతం నన్నొక ఆత్మీయునిగానూ, సోదరునిగానూ, శ్రేయోభిలాషిగానూ భావించారు. నామీద విశ్వాసం వుంచి అనేక బాధ్యతలు నాకు ఒప్పజెప్పడం, వాటిని నేను అంకిత భావంతో నిర్వహించి సఫలీకృతుణ్ణి కావడం నాకెంతో తృప్తినిచ్చిన విషయం. ఆనాడు శ్రీ రామారావుగారి తల్లితండ్రులు గాని,

నాటికి, నేటికి వారి కుమారులు, కూమార్తెలు, ఇతర కుటుంబ సభ్యులు నాపట్ల చూపిన, చూపుతున్న ఆదరణ మరువలేనిది.

శ్రీ రామారావుగారు రాజకీయాల్లో ప్రవేశించి ఉన్నత పదవినధిష్టించి, నాకు రాజకీయ ప్రవేశం కల్పించాలని ఆశించినా, ఎందుకో నా మనస్తత్వానికి నేటి రాజకీయ వాతావరణం సరిపడదని గ్రహించి "మీరు పడుతున్న ఇబ్బందులు ప్రత్యక్షంగా చూస్తున్నాను. నాకు రాజకీయరంగం సరిపడదు. కాని మీకు అండగా వుంటాను" అని చెప్పి నా సహకారం అందించాను.

ఈ నాటి చిత్ర పరిశ్రమ అనేక కోణాల్లోంచి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటుంది. కాలానుగుణంగా సమాజంలో వస్తున్న మార్పులే దీనికి కారణం. ఆ అనారోగ్య వాతావరణం పరిశ్రమలో ప్రవేశించటం పట్ల నేను బాధపడుతూ తరాల అంతరాల దృష్ట్యా నేను చిత్రనిర్మాణానికి దూరంగా ఉండాల్సివచ్చింది. ఇది నన్ను నేను నియంత్రించుకుంటూ తీసుకున్న నిర్ణయం అయినప్పటికీ మంచిని ఆశిస్తూ పరిశ్రమకు మంచిరోజులు రావాలని కోరుతూ రాష్ట్రస్థాయిలోనూ, అఖిల భారత స్థాయిలోనూ, నేను యివ్వగలిగిన సలహాలు యిస్తూ సేవలు అందిస్తూనే వున్నాను. ఏమైనా, ఆశావాదిగా చిత్రపరిశ్రమలో మంచి మార్పులు రావాలని పదిమంది పచ్చగా వుండాలని కోరుకుంటున్నాను.

॥ సర్వేజనా సుఖినోభవంతు ॥

☆☆☆